మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

NAMASTE TELANGANA

www.ntnews.com /ntdailyonline

బుధవారం WEDNESDAY 11.9.2024 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 12+4+8 పేజీల నిపుణ ప్రత్యేక అనుబంధం Pages: 12+4+8 Pages NIPUNA Supplement | సంపుటి (Volume): 14 ‖ సంచిక (Issue): 97 ‖ వెల (Price) రూ.6.50

అష్టమి

బుధవారం, సూర్యోదయం: 6-04, సూర్యాస్తమయం: 6-21. శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయనం వర్ష రుతువు భాద్రపద మాసం శుక్ల పక్షం తిథి: అష్టమి రాత్రి 11-46 వరకు. నక్షత్రం: జ్యేష్ఠ రాత్రి 11-46 వరకు. వర్జ్యం: లేదు. రాహుకాలం: పగలు 12-12 నుంచి పగలు 1-44 వరకు. దుర్ముహూర్తం: పగలు 11-47 నుంచి పగలు 12-37 వరకు. అమృతకాలం: పగలు 12-05 నుంచి పగలు 1-46 వరకు.

కోఠి మహిళా యూనివర్సిటీకి ఐలమ్మ పేరు



ఐలమ్మ వర్ధంతి సభలో రేవంత్‌రెడ్డి ప్రకటన › 2

బీసీ కమిషన్ సభ్యురాలిగా ఐలమ్మ మనుమరాలు

నటేశ్వరశర్మ ఇకలేరు



తెలుగు, సంస్కృతంలో 60కిపైగా గ్రంథాలు రచించిన విశిష్ట కవి

నిరుడు దాశరథి అవార్డుతో సత్కరించిన కేసీఆర్ సర్కార్

నేడు బోయినపల్లి శ్మశానవాటికలో అంత్యక్రియలు › 6

చిన్నారిని పీక్కుతిన్న వీధి కుక్కలు

నిజామాబాద్ జిల్లా బోధన్‌లో విషాదం › 10

జైనూర్‌పై ఎన్‌హెచ్‌ఆర్సీ సీరియస్

2 వారాల్లో నివేదిక ఇవ్వాలని ప్రభుత్వానికి ఆదేశం › 10

ప్రయాణించిన దూరానికే టోల్!

త్వరలో జీపీఎస్ ఆధారిత టోల్ › 7

3 నెలల్లో కులగణన

సామాజిక, ఆర్థిక, రాజకీయ వెనుకబాటుతనంపై సమగ్ర సర్వే చేయాలి

పూర్తిచేసి మాకు నివేదిక ఇవ్వండి: రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం



చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే | జస్టిస్ జే శ్రీనివాసరావు

సుప్రీంకోర్టు మార్గదర్శకాలను అమలు చేయాలి

రాష్ట్రం యూనిట్‌గా కాకుండా స్థానిక సంస్థల యూనిట్‌గా కులగణన నిర్వహించాలి

ఇదే సుప్రీంకోర్టు తీర్పులోని అంతరార్థం

రాష్ట్రంలో వెనుకబడిన వర్గాల కులగణనకు మార్గం సుగమమైంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో కీలకమైన రిజర్వేషన్ల ఖరారుకు అవసరమైన బీసీల కులగణనను మూడు నెలల్లో పూర్తిచేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు కీలక ఆదేశాలు జారీచేసింది. కులగణన పూర్తయిన తరువాత సమగ్ర నివేదిక సమర్పించాలని ఉత్తర్వులిచ్చింది. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం వెనుకబడిన వర్గాల సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ వెనుకబాటుతనంపై సమగ్ర సర్వే నిర్వహించాలని స్పష్టంచేసింది.

హైదరాబాద్, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ):సర్వోన్నత న్యాయస్థానం మార్గదర్శకాలకు అనుగుణంగా కులగణన జరగాలని హైకోర్టు పేర్కొన్నది. వికాస్‌కిషన్‌రావ్ గావ్లీ వర్సెస్ మహారాష్ట్ర కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం బీసీల సమకాలీన, అనుభావిక పరిశీలన జరగాలని తెలిపింది. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లకు సంబంధించి జీహెచ్‌ఎంసీ చట్టంలోని సెక్షన్ 5ను సవాలు చేస్తూ జాజుల శ్రీనివాస్‌గౌడ్, దాసోజు శ్రవణ్‌కుమార్, ఎర్ర సత్యనారాయణ, ఇతరులు దాఖలు చేసిన వ్యాజ్యాన్ని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావుతో కూడిన ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది. స్థానిక సంస్థల యూనిట్‌గా బీసీల రిజర్వేషన్లు అమలు చేయాలని, రాష్ట్రం యూనిట్‌గా కాదని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ కులగణనను › 2వ పేజీలో

అప్పుల్లో జూలై రికార్డు



ఒక్క నెలలో ఏకంగా 10,392 కోట్ల రుణం

పదేండ్ల తెలంగాణ చరిత్రలో ఇదే అత్యధికం

ఆదాయం కన్నా అప్పు 141 కోట్లు ఎక్కువ

స్వయంగా కాగ్‌కు వెల్లడించిన ప్రభుత్వం

ఈ నెలలో ఇప్పటికే 4 వేల కోట్ల రుణం › 2

16న ఢిల్లీకి రేవంత్‌రెడ్డి › 2

సీఎం హోదాలో 21వ సారి

మంత్రివర్గ విస్తరణ, ఫిరాయింపు ఎమ్మెల్యేల అంశంపై చర్చించే అవకాశం

అనర్హతపై నిర్ణీత గడువేదీ లేదు

పదో షెడ్యూల్‌లో ఆ విషయం పేర్కొనలేదు

రేపే నిర్ణయం తీసుకోవాలని తీర్పులో లేదు

రూల్‌బుక్ ప్రకారమే పీఏసీ చైర్మన్ ఎన్నిక

హైకోర్టు తీర్పును సమీక్షిస్తున్నాం: శ్రీధర్‌బాబు



హైదరాబాద్, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ): పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేసే విషయమై పదో షెడ్యూల్‌లో నిర్ణీత గడువును పేర్కొనలేదని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై హైకోర్టు ఇచ్చిన తీర్పును న్యాయవాదులు సమీక్షిస్తున్నారని, చట్ట ప్రకారం ఏ విధంగా ముందుకు వెళ్లాలనేదానిపై చర్చిస్తున్నారని పేర్కొన్నారు. పదో › 3వ పేజీలో

ఇంకా చాలా బెంచ్‌లు ఉన్నాయి

హైకోర్టు తీర్పుపై న్యాయ నిపుణులతో చర్చిస్తాం

ఉపఎన్నికలు వస్తాయో లేదో: కడియం శ్రీహరి › 3



గాంధీ.. మరి ఇదేంది?

కాంగ్రెస్‌లో చేరినట్టు ఎక్స్ ద్వారా స్వయంగా వెల్లడి

జూలై 13న సీఎం రేవంత్‌తో దిగిన ఫొటో పోస్ట్

గాంధీ చేరికను నిర్ధారించిన వేం నరేందర్‌రెడ్డి

అరికెపూడి మెడలో మెరిసిన కాంగ్రెస్ కండువా

అది దేవాలయ కండువా అంటూ బుకాయింపు › 3



రుణమాఫీ చేయలేదని నిర్బంధం

చందుపట్ల పీఏసీఎస్ పాలకవర్గం, సిబ్బందిని గదిలో బంధించిన బాధిత రైతులు › 2



శిథిలాల మధ్య తమ పుస్తకాలను ఏరుకుంటున్న చిన్నారులు

చిన్నారుల పుస్తకాలపై బుల్డోజర్

సున్నం చెరువు కూల్చివేతల్లో హైడ్రా అత్యుత్సాహం

బుక్స్ తీసుకునే సమయం కూడా ఇవ్వకుండా కూల్చివేతలు

విసిరేసిన పుస్తకాలను ఏడుస్తూ ఏరుకున్న చిన్నారులు

పసిహృదయాన్ని గాయపర్చిన సీఎంకు మనసు లేదు

చిన్నారులపైనా సీఎం ప్రతాపం?: కేటీఆర్ › 5

• వాల్మీకి స్కామ్..

నాగేంద్రనే మాస్టర్‌మైండ్

కర్ణాటక మాజీ మంత్రి, కాంగ్రెస్ నేతపై ఈడీ చార్జ్‌షీట్

పక్కదారి పట్టిన 21 కోట్లు..లోక్‌సభ ఎన్నికల్లో వినియోగం

హైదరాబాద్‌కు చెందిన సత్యనారాయణవర్మ కీ రోల్

తెలంగాణ కాంగ్రెస్ నేతలతో ఆయనకు సాన్నిహిత్యం

సిట్ క్లీన్‌చిట్‌ను తప్పుబట్టిన దర్యాప్తు సంస్థ › 7

పుస్తకాలు కూడా తీసుకోనియ్యలే..

ఎట్ల చదువుకోవాలె..యాడుండాలె? : చిన్నారుల ఆవేదన

చేతులు జోడించి వేడుకున్నా పట్టించుకోరా? • పుస్తకాలపైకి బుల్డోజర్ పంపుతరా? • పసిహృదయాన్ని గాయపరిచిన సీఎంకు మనసులేదు

సున్నం చెరువు కూల్చివేతల్లో సర్కారు అత్యుత్సాహం • బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపాటు

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ): కనికరం లేకుండా హైడ్రా చేపట్టిన కూల్చివేతలతో రోడ్డున పడ్డ కుటుంబాలకు చెందిన చిన్నారుల ఆవేదన ఇది! సున్నం చెరువు కూల్చివేతల పర్వంలో అధికారుల అత్యుత్సాహం విమర్శలకు దారితీస్తున్నది. కనీసం పుస్తకాలను కూడా తీసుకోనివ్వకుండా, స్కూల్ బ్యాగులను సైతం ముట్టుకోనివ్వకుండా బుక్స్ తీసుకుంటామంటే సమయం ఇవ్వకుండా పుస్తకాలన్నీ బయట పడేసి తమను పోలీసులు గుంజుకుంటూ బయటకు పంపించి ఇండ్లు కూలగొట్టారంటూ సున్నంచెరువు కూల్చివేతల బాధిత చిన్నారులు రోదించిన తీరు హృదయాలను కలిచివేస్తున్నది.

> నా బుక్స్ అక్కడనే పడిపోయినయ్. అందరి బుక్స్ అక్కడనే ఉన్నయ్.. బ్యాగులు కూడా తీసుకోనియ్యలే..
>
> **- ఓ చిట్టితల్లి ఆవేదన**

పుస్తకాలపైకీ బుల్డోజరా?: కేటీఆర్

చిన్నారుల మాటలకు చలించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సీఎం రేవంత్‌పై తీవ్రంగా మండిపడ్డారు. 'చిన్నారుల మాటలు వినైనా మీకు బాధనిపించ లేదా? ఓ చిన్నారిపైనా ఈ సీఎం ప్రతాపం' అంటూ ఎక్స్ వేదికగా ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇండ్లపైకే కాక పుస్తకాలపైకీ బుల్డోజర్లు పంపుతారా?' అని ప్రశ్నించారు. చిన్నారుల గూడు చెదరగొట్టిన రేవంత్ సర్కారుకు పేదలపై ప్రేమలేదని, పసిహృదయాలను గాయపరిచిన సీఎంకు మనసే లేదని విమర్శించారు.

> బుక్స్ తీసుకుంటమంటే గ్యాప్ ఇవ్వకుండా మమ్మల్ని పోలీసులు పట్టుకొని గుంజేసింర్రు. బుక్స్ బయటకు తీయకుండా.. మమ్మల్ని కూడా తీసుకోనివ్వకుండా రోడ్డున పడేస్తే మేమెట్ల చదువుకోవాలి? ఎక్కడుండాలి?
>
> **- మరో చిన్నారి ప్రశ్న**



పుస్తకాలను సర్దుకుంటున్న చిన్నారులు



ఫరూఖ్‌నగర్ మండలం రాయికల్ వద్ద మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

ఆరు నెలలుగా జీతాలివ్వని సర్కార్

- **దవాఖానల విధుల బహిష్కరణకూ వెనుకాడం**
- **మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ నేత నరసింహ**
- **టీవీవీపీ దవాఖానల ఎదుట కార్మికుల ఆందోళన**
- **ప్రభుత్వం వెంటనే జీతాలు చెల్లించాలి: హరీశ్‌రావు**

హైదరాబాద్, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ): టీవీవీపీ దవాఖానల్లో పనిచేస్తున్న సిబ్బందికి ప్రభుత్వం ఆరు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని, ఇప్పటికైనా వేతనాలు చెల్లించకుంటే విధులను బహిష్కరించడానికి కూడా వెనుకాడబోమని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింహ హెచ్చరించారు. ఏరియా దవాఖానలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో పనిచేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ, పేషెంట్ కేర్ కార్మికులు మంగళవారం దవాఖానల ఎదుట గంటపాటు ధర్నా నిర్వహించారు. తమకు ఆరు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని టీవీవీపీ దవాఖానల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు ఆవేదన వ్యక్తంచేశారు. హైదరాబాద్ కింగ్ కోఠిలో జరిగిన ధర్నాలో నరసింహ పాల్గొని మాట్లాడారు. కొన్ని దవాఖానల్లో నాలుగు నెలలుగా, మరికొన్ని దవాఖానల్లో ఆరు నెలలుగా సిబ్బందికి జీతాలు అందలేదని తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి టీవీవీపీ దవాఖానలకు ప్రభుత్వం బిల్లులు విడుదల చేయలేదని చెప్పారు. జీతాలు అందక కార్మికులు అవస్థలు పడుతున్నారని, వారి కుటుంబాలు పస్తులు ఉంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. టీవీవీపీ కమిషనర్‌కు, రాష్ట్ర ప్రభుత్వానికి అనేక విజ్ఞప్తులు చేసినా స్పందన రావడం లేదని తెలిపారు. ప్రభుత్వం ఒక వైపు ఒకటో తేదీనే జీతాలు ఇస్తున్నామని చెప్తున్నా, కార్మికులు ఆరేడు నెలలుగా పస్తులు ఉండాల్సిన దుస్థితి నెలకొన్నదన్నారు. ప్రస్తుత సీజనల్ వ్యాధులు, వర్షాలను దృష్టిలో పెట్టుకొని గంటపాటు మాత్రమే ధర్నాలు చేస్తున్నామని, సమస్య పరిష్కారం కాకపోతే విధులనే బహిష్కరిస్తామని హెచ్చరించారు.

దవాఖానల నిర్వహణను గాలికొదిలిన సర్కారు: హరీశ్‌రావు

దవాఖానల నిర్వహణను రాష్ట్ర ప్రభుత్వం గాలికొదిలిందని మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజమెత్తారు. విషజ్వరాలు విజృంభించి రోగులతో దవాఖానలు కిక్కిరిసిపోతున్నా, నిధులు విడుదల చేయకుండా చోద్యం చూస్తున్నదని ధ్వజమెత్తారు. టీవీవీపీ దవాఖానల్లోని శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ సిబ్బందికి ఆరు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. తక్షణమే వారికి పెండింగ్ వేతనాలను చెల్లించాలని బీఆర్ఎస్ పార్టీ పక్షాన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఒకటో తేదీనే జీతాలు చెల్లిస్తున్నట్టు చెప్పుకునే ముఖ్యమంత్రికి వీరి వెతలు కనిపించకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. సిబ్బంది ఎన్నిసార్లు నిరసనలు తెలిపినా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లయినా లేదని, వారి గోడును పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి జీతాలు చెల్లించాలని, పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

నాడు బాహుబలి మోటార్లు నేడు బాహుబలి బుల్డోజర్లు

రైతన్న వికాసంకోసం కేసీఆర్ సర్కారు యత్నం • కూల్చివేతలతో రేవంత్ ప్రభుత్వం విధ్వంసం

తొమ్మిది నెలల్లో ఒక్క భారీ నిర్మాణమూ చేపట్టని ప్రభుత్వం • ప్రభుత్వాల మధ్య వ్యత్యాసాన్ని చూసి ప్రజల విస్మయం

ఇది కదా వికాసం...

ఆరు దశాబ్దాల సమైక్యపాలనలో చితికిపోయిన రైతన్న బతుకును బాగు చేసేందుకు కేసీఆర్ ప్రభుత్వం తీసుకువచ్చిన బాహుబలి మోటారు ఇది. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా గాయత్రీ పంపుహౌజ్‌లో అమర్చిన 132 మెగావాట్ల సామర్థ్యంతో ఏర్పాటు చేసిన మోటార్లు ఆసియా ఖండంలోనే అతి పెద్దవి. ఆపై ఇంతకంటే ఎక్కువ సామర్థ్యంతో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో ఏకంగా 145 మెగావాట్ల సామర్థ్యంతో మోటార్లను ఏర్పాటు చేశారు. ఇలా పదేండ్ల కేసీఆర్ ప్రభుత్వం బీడు భూముల్లో పచ్చని సిరులు పండించేందుకు పోటీ పడి మరీ ఇలా సాగునీటి ప్రాజెక్టులను నిర్మించేందుకు భగీరథయత్నం చేసింది. అందుకే తెలంగాణ ఏర్పడేనాటికి 2014-15 సంవత్సరంలో తెలంగాణ పండించిన ధాన్యం 68.17 లక్షల టన్నులు. వాటి విలువ రూ.12,871.01 కోట్లు. 2022-23లో 278.30 లక్షల టన్నులతో రూ.54,546.80 కోట్ల ధాన్యాన్ని ఉత్పత్తి చేసే స్థాయికి ఎదిగింది.

ఇది కదా విధ్వంసం...

ఒక సౌధాన్ని నిర్మించాలంటే నెలలు పడుతుంది. కానీ అదే సౌధాన్ని కూకటివేళ్లతో పెకిలించాలంటే రెండు నిమిషాలు చాలు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇదే చూస్తున్నాం. గత తొమ్మిది నెలల కాలంలో ఒక ప్రాజెక్టు లేదు.. ప్రజల కోసం ఒక నిర్మాణాన్ని చేపట్టలేదు... భావితరాలకు పనికొచ్చే ఒక ఆలోచన అంతకన్నా లేదు... కేవలం రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగా విధ్వంసాన్ని నమ్ముకున్నారు. ఆ పరంపరలో పేదోళ్ల గూడును బుల్డోజర్లతో నేలమట్టం చేస్తున్నారు. ఇందుకోసం రేవంత్ సర్కారు సమకూర్చిన బాహుబలి యంత్రం ఇదే. 36 మీటర్ల సామర్థ్యం ఉన్న ఈ యంత్రం పద్నాలుగు అంతస్తుల భవనాన్ని కూడా ఇట్టే కూలుస్తుంది. ఈ యంత్రం దేశంలో ఐదు చోట్ల మాత్రమే ఉన్నట్టు తెలిసింది. ఢిల్లీ, ముంబై, కోల్‌కత్తా, బెంగళూరుతో పాటు హైదరాబాద్ నగరంలోనూ ఒక ప్రైవేటు సంస్థ వద్ద ఉంది. హైడ్రా పేరుతో రేవంత్ ప్రభుత్వం సామాన్యుడి గూడును కూల్చివేసేందుకు ఈ యంత్రాన్నే వినియోగిస్తున్నారు. ఇప్పటిదాకా ఉత్తరాదికే పరిమితమైన ఇది నేడు తెలంగాణకు పరిచయం చేసింది.



బాహుబలి మోటార్లు



బాహుబలి బుల్డోజర్లు

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, సెప్టెంబరు 10 (నమస్తే తెలంగాణ): బుర్రకో బుద్ధి.. జిహ్వాకో రుచి అంటారు. ఎవరి ఆలోచనలు వారివి. ఎవరి పంథా వారిది. కాకపోతే అవి ప్రజలు... అంతకు మించి సమాజానికి ఎంతవరకు మేలు చేస్తాయనేది ప్రధానం. ముఖ్యంగా రాష్ట్ర ప్రజలకు పెద్ద దిక్కుగా ఉండే పాలకుడి ఆలోచనలు ప్రజలను వికాసం వైపు నడిపించాలేగానీ విధ్వంసం వైపు మళ్లించవద్దు. కానీ దురదృష్టవశాత్తు కాంగ్రెస్ ప్రభుత్వం గత తొమ్మిది నెలల్లో ఒక్కటంటే ఒక్క నిర్మాణాత్మక ప్రాజెక్టును చేపట్టిన దాఖలాలు లేవనేది జగద్విదితం. ఈ నేపథ్యంలో రుణమాఫీ, ఇతర వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు బుల్డోజర్లతో హైడ్రామా సృష్టిస్తున్నది.కేసీఆర్ ప్రభుత్వ హయాంలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో కొత్త రికార్డులు.. ఆహార ధాన్యాల ఉత్పత్తిలో చారిత్రక వృద్ధి అని మీడియాలో కథనాలు చూసేవాళ్లం. కానీ ఇప్పుడు ఒక వారాంతంలో హైడ్రా ఐదు నిర్మాణాల్ని కూల్చివేస్తే, మరో వారాంతంలో పది నిర్మాణాల్ని కూల్చి పంజా విసిరిందని విధ్వంసాన్ని ఆస్వాదించే పరిస్థితి ఏర్పడింది.

ఎవరిదీ పాపం?!

వాస్తవానికి హైదరాబాద్ మహానగరంలో వారసత్వంగా వచ్చిన చెరువుల్లో నాలుగింట మూడొంతులు సమైక్యపాలనలోనే కాలగర్భంలో కలిసిపోయాయి. ఆరు దశాబ్దాల కాలంలో కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలే అధికారంలో ఉన్నాయి. ఈ వాస్తవాల్ని గుర్తించకుండా బీఆర్ఎస్ నేతలే లక్ష్యంగా రేవంత్ ప్రభుత్వం తీసుకువచ్చిన హైడ్రా ఆ ప్రక్రియను పూర్తి చేసే క్రమంలో సామాన్యుడి గూడుపై తన ప్రతాపాన్ని చూపుతుంది. చెరువుల్ని పరిరక్షించడం అందరి బాధ్యత. కానీ దశాబ్దాల పాటు ఇదే కాంగ్రెస్ పాలకులు ఇష్టానుసారంగా చెరువుల కబ్జాను గుడ్లప్పగించి చూడటంతోపాటు కాంగ్రెస్ పెద్దలే లేక్‌వ్యూ విధానంలో గెస్ట్‌హౌస్‌లు, సౌధాలను నిర్మించుకున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వ పెద్దలు ముందుగా తమ అక్రమ నిర్మాణాల్ని కూల్చుకొని ఆపై ఇతరులపై కొరఢా ఝుళిపిస్తే తెలంగాణ సమాజం హర్షిస్తుంది. కానీ కాంగ్రెస్ నేతల అక్రమాల వైపు కన్నెత్తి చూడని హైడ్రాకు కేవలం కొన్ని నిర్మాణాలే అక్రమంగా కనిపిస్తుండటం అందరిలోనూ అనుమానాలను రేకెత్తిస్తుంది.

ఏదీ ప్రణాళిక?

హైడ్రా ఒక చెరువును పరిరక్షించాలని నిర్ణయించుకున్నపుడు ముందుగా దాని ఎఫ్‌టీఎల్‌ను శాస్త్రీయంగా నిర్ధారించాలి. సంబంధిత శాఖ హద్దు రాళ్లను అమర్చాలి. ఆపై హైడ్రా రంగంలోకి దిగి అన్నింటినీ కూల్చివేస్తే ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళుతున్నారని అనుకోవచ్చు. కానీ ఒక చెరువు పరిధిలో నాలుగైదు నిర్మాణాల్ని కూల్చడం, మిగతా వాటిని వదిలేయడం ఎవరికీ అర్థం కావడం లేదు. ఇంకో వైపు ప్రముఖులు ఉండే చోట నోటీసులు ఇచ్చి గడు వు ఇస్తున్న అధికారులు... నోటీసులు ఇవ్వకుం డా సామాన్యులపై మాత్రం సూర్యోదయానికి ముందుగానే బుల్డోజర్లతో విరుచుకుపడటం అందరినీ విస్మయానికి గురి చేస్తుంది. తొలుత కేవలం ఎఫ్‌టీఎల్ పరిధిలోని నిర్మాణాలను కూల్చివేస్తామన్న అధికారులు... ఒకచోట బఫర్‌జోన్‌లోనూ కూల్చివేతలు చేపట్టారు. ఇలా ఒక్కో చోట ఒకో రీతిలో ఎలాంటి ప్రణాళిక లేకుండా హైడ్రా కూల్చివేతలు చేపడుతుంది.

ఇండ్లు కూల్చి..ఉల్టా కేసులు

- **కండ్లెదుటే ఇండ్లు కూలుతుంటే బాధితుల ఆవేదన**
- **కడుపుమండి పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం**
- **కూల్చివేతలను అడ్డుకున్నారని వారిపై హైడ్రా ఫిర్యాదు**
- **సున్నం చెరువు బాధితులపై మాదాపూర్‌లో కేసు నమోదు**

మాదాపూర్, సెప్టెంబర్ 10 : కూలీనాలీ చేసుకుంటూ నివాసముంటున్న వారిని నిర్దాక్షిణ్యంగా గుడిసెలు ఖాళీ చేయించి వాటిని కూలగొట్టడమే కాకుండా బాధితులపై హైడ్రా క్రిమినల్ కేసులు కూడా నమోదు చేయించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కండ్లెదుటే తమ గుడిసెలను కూలగొడుతుంటే కడుపుమండి బాధితులు పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. కూల్చివేతలకు ఆటంకం కలిగించారంటూ వీరిపై నార్త్‌ట్యాంక్ డివిజన్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మాదాపూర్ పోలీసులు బాధితులపై 132 రెడ్‌విత్ 4(5), బీఎన్ఎస్ సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. మాదాపూర్‌లోని సున్నం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో అక్రమ నిర్మాణాల పేరిట భవనాలు, షెడ్లు, గుడిసెలను గత ఆదివారం హైడ్రా కూల్చివేసింది. కూలీ పని చేసుకునేవారు చాల మంది షెడ్లు, గుడిసెల్లో బతుకుతున్నారు. ఉదయం 5 గంటలకు హైడ్రా బుల్డోజర్లు సున్నం చెరువు వద్దకు చేరుకున్నాయి. గంట సేపట్లో ఇండ్లు ఖాళీ చేయాలంటూ అధికారులు హుకుం జారీచేసి వాటిలో ఉన్న వారందరినీ రోడ్డుపైకి తెచ్చారు. తమను రోడ్డుపై పడేశారంటూ వెంకటేశ్, లక్ష్మి దంపతులు, డ్రైవర్‌గా పనిచేసే సురేశ్ తమ ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు ప్రయత్నించారు. వీరిని పోలీసులు అడ్డుకున్నారు. తమ కుటుంబం రోడ్డున పడడంతో తీవ్ర ఆవేదన చెందిన బాధితులు, ఇల్లు కూలిపోయిందనే బాధలో ఉంటే హైడ్రా అధికారులు తమ విధులకు ఆటంకం కలిగించారంటూ వారిపై ఫిర్యాదు చేయడం విమర్శలకు దారితీస్తున్నది. పెద్దల జోలికి వెళ్లని హైడ్రా, కూలీలపై తమ ప్రతాపాన్ని చూపిస్తున్నదంటూ పలువురు మండిపడుతున్నారు.

ఎంత సిగ్గుచేటు! : కేటీఆర్

ఇండ్లు కూల్చుతున్నారన్న బాధతో అడ్డుకున్నవారిపైనే కేసులు పెట్టిన ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. 'ఉన్న ఒక్క గూటినీ మీ బుల్డోజర్ ప్రభుత్వం కూల్చివేస్తే.. కడుపు మండి, కన్నీళ్లతో పెట్రోల్ పోసుకున్నందుకు కేసులు పెడుతారా? ఎంత సిగ్గు చేటు! ఎంతటి నీతిమాలిన చర్య!' అంటూ ఎక్స్ వేదికగా ఆగ్రహం వ్యక్తంచేశారు. 'మీది ప్రజా ప్రభుత్వమో, ప్రజాపాలనో కాదు రేవంత్‌రెడ్డి గారూ! మీరు నడుపుతున్నది బుల్డోజర్ ప్రభుత్వం.. కేసుల రాజ్యం' అంటూ ధ్వజమెత్తారు. 'బుల్డోజర్ మీ అన్న ఇంటి మీదికి, పొంగులేటి నిర్మాణాల మీదికి పోతుందా?' అని నిలదీశారు. బాధితులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని, తమ పార్టీ లీగల్ టీమ్ బాధితులను సంప్రదించి తగిన సహకారాన్ని అందిస్తుందని చెప్పారు.

'హైడ్రా'మాను ఆపండి

- **సున్నం చెరువు బాధితులను ఆదుకోవాలి**
- **లేదంటే రేవంత్‌రెడ్డి ఇంటిని ముట్టడిస్తాం**
- **విద్యార్థుల రాజకీయ పార్టీ నేతల హెచ్చరిక..**
- **ప్రెస్‌మీట్ ముగియగానే అరెస్ట్ చేసిన పోలీసులు**



ప్రెస్‌క్లబ్ వద్ద విద్యార్థుల రాజకీయ పార్టీ నేతలను అరెస్టు చేస్తున్న పోలీసులు

ఖైరతాబాద్, సెప్టెంబర్ 10 : ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా ఇండ్లను కూల్చి చంటి పిల్లలు, ఆడవాళ్లున్నారని కూడా చూడకుండా భారీ వర్షంలో కట్టుబట్టలతో సున్నం చెరువు వద్ద 200 మంది నిరుపేదలను రోడ్డున పడేశారని, వారిని ఆదుకోకుంటే సీఎం రేవంత్‌రెడ్డి ఇంటిని ముట్టడిస్తామని విద్యార్థుల రాజకీయ పార్టీ నేతలు హెచ్చరించారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పార్టీ అధ్యక్షుడు యెచ్చు సునీల్ మాట్లాడుతూ హైడ్రా పేరుతో ప్రభుత్వం ఆడుతున్న డ్రామాకు ఫుల్‌స్టాప్ పెట్టాలని డిమాండ్ చేశారు. సున్నం, కత్వా, అమీన్‌పూర్ చెరువుల ఒడ్డున వందలాది కుటుంబాలు ఎలాంటి ఆదరణ లేక, కూలీనాలి చేసుకుంటూ బతుకుతున్నాయని, వారిపై ప్రభుత్వం కర్కశంగా వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. కష్టపడి కట్టుకున్న రేకుల షెడ్లు, గుడారాలను ఆక్రమణల పేరుతో హైడ్రా కూల్చివేయడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తంచేశారు. బాధితులకు డబుల్ బెడ్రూం ఇండ్లు అందించాలని, లేదంటే సీఎం, మంత్రుల ఇంటి ముట్టడితో పాటు వారి ఇండ్లలోనే బాధితులకు నివాసాలు కల్పిస్తామని హెచ్చరించారు. సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు ఇజ్జగిరి కమలాకర్, పాక నవీన్ బాబు, మహిళా అధ్యక్షురాలు సాత్వికారెడ్డి, జీహెచ్ఎంసీ ప్రధాన కార్యదర్శి మహేశ్, అనిల్, వినయ్, భూక్యానందు, బదావత్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్ గేటు వెలుపలే అరెస్ట్

ప్రెస్‌మీట్ ముగించుకొని ప్రెస్‌క్లబ్ నుంచి ర్యాలీగా బయలుదేరిన విద్యార్థుల రాజకీయ పార్టీ నాయకులు, బాధితులను పోలీసులు అరెస్ట్ చేశారు. హెచ్చరికలు లేకుండానే వారిని అరెస్ట్ చేసేందుకు యత్నించగా, పార్టీ నాయకులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. 'సీఎం డౌన్ డౌన్', 'ప్రభుత్వ నిరంకుశ వైఖరి నశించాలి' అంటూ నినాదాలు చేశారు.

పిల్లలతో ఎక్కడికి పోవాలి



కూలిపనులు చేసుకుంటూ పిల్లలను పోషించుకుంటున్న. మహబూబ్‌నగర్ నుంచి 20 ఏండ్ల కింద వచ్చినం. షెడ్డు వేసుకొని బతుకుతున్నం. పిల్లలతో సహా బయటకు వెళ్లగొట్టి కూలగొట్టింర్రు. చిన్న పిల్లలను పట్టుకొని ఎటుపోవాలె?

- బుజ్జమ్మ, బాధితురాలు

మా బతుకులు రోడ్డునపడ్డయ్



కొన్నేండ్ల కింద ఇసుక లారీ బోల్తా పడి నా భర్త గోపాల్ చనిపోయిండు. ఇద్దరు బిడ్డలు, కొడుకును కూలి పనులు చేసుకుంట చదివిస్తున్న. ఉన్నట్టుండి మా బతుకులను రోడ్డున పడేసింర్రు. ప్రభుత్వానికి ఇది న్యాయం కాదు.

- చంద్రిబాయి, బాధితురాలు

మాకు న్యాయం చేయాలి



నా భర్త డ్రైవర్. ఇద్దరు చిన్న పిల్లలున్నరు. కష్టపడి చిన్న ఇల్లు కట్టుకున్నం. ఖాళీ చేయాలని ఎలాంటి నోటీసులు ఇవ్వలేదు. బలవంతంగా బయటకు పంపి కూల్చివేసింర్రు. మాకు ప్రభుత్వం న్యాయం చేయాలి. డబుల్ బెడ్రూం ఇల్లు ఇవ్వాలి.

- పద్మ, బాధితురాలు

యూట్యూబ్ చానళ్లు రేవంత్‌ను గద్దె దించుడు ఖాయం

- **ఒకప్పుడు వాటి ద్వారానే అధికారంలోకి వచ్చాడు**
- **ఇప్పుడు వాటినే తక్కువచేసి మాట్లాడుతున్నాడు**
- **సీఎం రేవంత్‌పై హరీశ్‌రావు మండిపాటు**

షాద్‌నగర్, సెప్టెంబర్ 10: అబద్ధాలను యూట్యూబ్ చానెళ్ల ద్వారా ప్రచారం చేసి, లేనివి ఉన్నట్టు, ఉన్నవి లేనట్టు గత ప్రభుత్వంపై విషప్రచారం చేసి అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పుడు అవే యూట్యూబ్ చానెళ్లను తక్కువ చేసి మాట్లాడటం సరికాదని మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. ఆయన మంగళవారం నాగర్‌కర్నూల్ వెళ్తూ మార్గమధ్యంలో ఫరూఖ్‌నగర్ మండలం రాయికల్ వద్ద మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి అధికారం కోసం యూట్యూబ్ చానెళ్లను అడ్డంపెట్టుకొని అవాస్తవాలను వాస్తవాలుగా ప్రచారం చేయలేదా? అని ప్రశ్నించారు. ఏరు దాటక ముందు ఓడ మల్లన్న, ఒడ్డు దాటాక బోడి మల్లన్న అనే తీరులో సీఎం రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. ప్రభుత్వ పనితీరును, డొల్లతనాన్ని, ఇచ్చిన మాటను తప్పిన తీరును యూట్యూబ్ చానెళ్లు బయటపెడుతుంటే తట్టుకోలేకపోతున్నారని విమర్శించారు. సీఎం డొల్లతనాన్ని, ఆయన మోసాలను బయటపెడితే తట్టుకోలేకపోతున్నారని, కచ్చితంగా సీఎంకు తగిన శాస్తి జరుగుతుందని చెప్పారు. రానున్న రోజుల్లో యూట్యూబ్ చానెళ్లన్నీ ఒక్కటై రేవంత్‌రెడ్డిని గద్దె దించడం ఖాయమని అన్నారు. హరీశ్‌రావుతోపాటు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వై అంజయ్యయాదవ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రాజవరప్రసాద్ పాల్గొన్నారు.

అప్పుడు ఉపయోగించుకొని... కేటీఆర్

కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు యూట్యూబ్ జర్నలిస్టులను వాడుకొని, ఇప్పుడు యూట్యూబ్ జర్నలిస్టుల పట్ల అనాలోచితంగా వ్యవహరిస్తున్నారని కేటీఆర్ అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి యూట్యూబ్ జర్నలిస్టులపై చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఆయన స్పందించారు.

హైడ్రాకు 23 మంది పోలీస్ సిబ్బంది

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న 23 మంది ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలను హైడ్రాకు కేటాయిస్తూ శాంతి భద్రతల డీజీ మహేశ్ భగవత్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. వీళ్ల డిప్యూటేషన్, అటాచ్‌మెంట్లపై హైడ్రాలో విధులు నిర్వర్తించనున్నారు. కేటాయించిన వారిలో 15 మంది ఇన్‌స్పెక్టర్లు, ముగ్గురు ఆర్‌ఐలు, ఇద్దరు ఆర్ ఎస్సైలు, ముగ్గురు ఎస్సైలు ఉన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టికి రూ.5 కోట్ల చెక్కు అందజేస్తున్న ఎంఈఐఎల్ ఎండీ పీవీ కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఎన్‌టీ రావు

సీఎంఆర్‌ఎఫ్‌కు 10కోట్ల విరాళాలు

హైదరాబాద్, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ): సీఎంఆర్‌ఎఫ్‌కు మంగళవారం రూ.10కోట్ల విరాళాలు అందాయి. ముఖ్యమంత్రి నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టికి ఎంఈఐఎల్ ఎండీ కృష్ణారెడ్డి, బిజినెస్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి, ఫైనాన్స్ డైరెక్టర్ ఎన్‌టీ రావు రూ.5కోట్ల చెక్కును అందజేశారు. రేస్ క్లబ్ డైరెక్టర్, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, డైరెక్టర్ నర్సింహారెడ్డి రూ.2కోట్ల చెక్కు ఇచ్చారు. సియాంట్ లిమిటెడ్ రూ.కోటి, లలితా జ్యువెలర్స్ అధినేత కిరణ్ రూ.కోటి, మైత్రా ఎనర్జీ, అక్షత్ గ్రీన్ టెక్ డైరెక్టర్లు విక్రమ్ కైలాస్, రవి కైలాస్ రూ.కోటి, సినీ నిర్మాత దిల్‌రాజు రూ.25 లక్షలు అందజేశారు.

రోడ్ల మరమ్మతులకూ నిధుల కొరత!

- **కేంద్రసాయం వస్తేనే పునరుద్ధరణ**
- **నేడు, రేపు కేంద్ర బృందం పర్యటన**

హైదరాబాద్, సెప్టెంబర్ 10(నమస్తే తెలంగాణ) : వరదల కారణంగా కొట్టుకుపోయిన రోడ్ల పునరుద్ధరణకు నిధుల కొరత వెంటాడుతున్నది. తక్షణ మరమ్మతులు కూడా చేపట్టలేని పరిస్థితి నెలకొన్నదని అధికారవర్గాలు వాపోతున్నాయి. కేంద్ర ప్రభుత్వ సాయం అందేవరకు శాశ్వత పునరుద్ధరణ చేపట్టే అవకాశం లేదని చెబుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉండడంతో హామీలను నెరవేర్చేందుకు అప్పులపైనే ఆధారపడుతుండగా, అత్యవసర పనులకు కూడా నిధులు వెచ్చించలేని దీనస్థితి. ఈ పరిస్థితుల్లో మూలిగే నక్కపై తాటిపండు పడిన చందంగా భారీ వర్షాలు రాష్ట్రాన్ని ముంచెత్తాయి. వర్షాలతో భారీగా నష్టం వాటిల్లిన వాటిలో రోడ్లు ముఖ్యమైనవిగా చెప్పవచ్చు. సుమారు 2,300 కిలోమీటర్ల మేర రోడ్లు రవాణాకు వీలులేకుండా పోయినట్టు అధికారులు గుర్తించారు. చెరువుకట్టలు తెగిన ప్రాంతాల్లో రోడ్లు పూర్తిగా కొట్టుకుపోయాయి. ముఖ్యంగా ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో నష్టం తీవ్రంగా జరిగింది. రెండుచోట్ల వంతెనలు కొట్టుకుపోగా, పలు ప్రాంతాల్లో వంతెనల అప్రోచ్‌లు, కల్వర్టులు ధ్వంసమయ్యాయి. వరదల నష్టాన్ని పరిశీలించేందుకు బుధ, గురువారాల్లో కేంద్ర బృందం రాష్ట్రంలో పర్యటించనున్నది. రోడ్ల నష్టం సుమారు రూ.2వేల కోట్లకు పైగానే ఉందని నిర్ధారించిన ఆర్‌అండ్‌బీ శాఖ.. ప్రభుత్వం ద్వారా నివేదిక ఇచ్చేందుకు సిద్ధమైంది. తక్షణ మరమ్మతుల కోసం కనీసం రూ.300 కోట్లు అవసరమవుతాయని అధికారులు చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఎలాంటి నిధులు విడుదల చేయలేదు. ముఖ్యంగా జిల్లా, మండల కేంద్రాలను అనుసంధానించే రోడ్లు కంకరతేలి ప్రయాణం సాగించలేని స్థితికి చేరాయి. వీటి మరమ్మతులకు సుమారు రూ.1000 కోట్లు అవసరమవుతాయని అధికారులు ఇప్పటికే ప్రభుత్వానికి నివేదిక పంపినప్పటికీ నిధులు మాత్రం విడుదల కాలేదు. గత ప్రభుత్వంలో చేపట్టిన పనులకు కూడా దాదాపు రూ.1000 కోట్లకు పైగా బిల్లులు పెండింగులో ఉన్నాయి. దీంతో కొత్తగా రోడ్ల మరమ్మతు పనులకు కాంట్రాక్టర్లు ముందుకురావడం లేదు.

మహిళా శక్తికీ పైసా ఇయ్యలే..

- **బ్యాంకులు ఇచ్చే రుణాలకే ప్రభుత్వం పేరు**
- **వడ్డీలేని రుణాల మాటెత్తని సర్కారు**

హైదరాబాద్, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ) : మహిళా శక్తి అంటూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించినా ఆచరణలో మాత్రం పైసా ఇవ్వడంలేదు. వడ్డీలేని రుణాల మొత్తాన్ని ఎప్పటికప్పుడు విడుదల చేస్తామని, అదే సమయంలో గతంలో ఇవ్వాల్సిన మొత్తానికి తమకు సంబంధంలేదంటూ చేతులు ఎత్తేశారని మహిళా సంఘాలు ఆరోపిస్తున్నాయి. బ్యాంకులు ఇచ్చే రుణాలకే, గతంలో ఉన్న బ్యాంక్ లింకేజీ పథకానికే మహిళా శక్తి పేరు తగిలించుకొని ప్రచారం చేసుకుంటున్నదని మహిళా సంఘాలు విమర్శిస్తున్నాయి. మహిళా శక్తి కార్యక్రమంలో క్యాంటీన్లు సహా ఇతర ఆహార, ప్రజలకు సర్వీస్ అందించే వాటిని మొత్తం రకరకాల వ్యాపారాలను నెలకొల్పాలని సూచించారు. కానీ వాటికి ప్రభుత్వం నుంచి పైసా సాయం ఇంతవరకూ అందలేదు. ప్రభుత్వ సబ్సిడీ లేకుండా ఎలా వ్యాపారాలు చేయాలని మహిళలు ప్రశ్నిస్తున్నారు. వడ్డీతో పాటు ప్రభుత్వం 50 శాతం సబ్సిడీ ఇవ్వాలని కోరుతున్నారు.

రూ.500 కోట్ల బకాయిలు..

బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాల రీపేమెంట్‌లో అసలుతోపాటు వడ్డీని మహిళా సంఘాలు చెల్లించాల్సి ఉంటుంది. ఆ తరువాత వడ్డీని ప్రభుత్వం విడుదల చేస్తుంది. కానీ, మార్చిలో ఇచ్చిన రుణాలకు వీఎల్ఆర్ ఉసెత్తడంలేదని, దీంతో సంఘాలకు రూ.500 కోట్ల బకాయి ఉందని చెబుతున్నారు.

వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

ఫిరాయింపులపై కీలక తీర్పు

మొన్నటి ఎన్నికల అనంతరం బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హత వ్యవహారంపై రాష్ట్ర హైకోర్టు అత్యంత కీలకమైన ఆదేశాలు జారీచేసింది. బీఆర్ఎస్ నేతలు పాడి కౌశిక్ రెడ్డి, వివేకానంద దాఖలు చేసిన పిటిషన్లపై జస్టిస్ బీ విజయసేన్ రెడ్డి ధర్మాసనం జారీచేసిన ఈ ఆదేశాలు సుదీర్ఘ పర్యవసానాలను కలిగి ఉంటాయనడంలో సందేహం లేదు. రాష్ట్ర రాజకీయాలను ఇది ప్రభావితం చేస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఎందుకంటే 'ఫిరాయింపులపై మీరు తేలుస్తరా లేక మేమే తేల్చాలా?' అనే ప్రశ్నను శాసనవ్యవస్థ సర్వోన్నత అధికారి అయిన సభాపతికి న్యాయస్థానం సంధించింది. పార్టీ ఫిరాయింపులపై సహేతుకమైన గడువులో నిర్ణయం తీసుకోవడమనేది న్యాయసమీక్షకు లోబడే ఉంటుందని స్పష్టం చేయడం మరో ముఖ్యాంశం. అందుకు అనుగుణంగానే నాలుగు వారాల గడువును కూడా విధించింది. అంటే స్పీకర్ తన విచారణ షెడ్యూల్‌ను నాలుగు వారాల్లో ఖరారు చేయాలని సారాంశం. ఇక ఏ మాత్రం జాప్యానికి ఆస్కారం ఉండకూడదన్న ధోరణి కోర్టు ఆదేశాల్లో వ్యక్తమైంది.

ఇక్కడ మనకు హైకోర్టు సూచించిన క్రమంలో నాలుగు అంశాలు ప్రధానమైనవిగా కనిపిస్తున్నాయి. ఒకటి, ఫిరాయింపు పిటిషన్ ఫైళ్లను అసెంబ్లీ కార్యదర్శి తక్షణం స్పీకర్ ముందుంచాలని ఆదేశించడం. రెండు, విచారణ షెడ్యూల్ రూపొందించాలని చెప్పడం. మూడు, సదరు వివరాల నివేదికను రిజిస్ట్రార్‌కు నివేదించాలనడం. నాలుగు, ఇదంతా గడువులోగా జరగకపోతే సుమోటోగా విచారణ జరిపి తీర్పునిస్తామని తేల్చిచెప్పడం. నిర్ణీత సమయంలోగా నిర్ణయం జరగాలన్న పిటిషనర్ల వాదనను కాదనలేమని కోర్టు అభిప్రాయపడింది. చట్టసభ గడువు ఐదేండ్లు కనుక సభాకాలం ముగిసేదాకా స్పీకర్ మౌనంగా ఉంటానంటే కోర్టులు చేతులు కట్టుకొని కూర్చోవని స్పష్టం చేయడం విశేషం. అలాగని సాంకేతిక కారణాలు చెప్పి పిటిషన్‌ను కొట్టివేయడం వల్ల న్యాయం చేసినట్టు కాదని నొక్కిచెప్పింది.

హైకోర్టు ధర్మాసనం తన నిర్ణయాలకు ఆలంబనగా రెండు సుప్రీంకోర్టు తీర్పులను ప్రస్తావించడం గమనార్హం. అందులో మొదటిది నాగాలాండ్‌కు చెందిన కిహోటో హోలోహన్ కేసులో ఫిరాయింపుల నిరోధక చట్టం రాజ్యాంగ బద్ధతను, స్పీకర్ సర్వాధికృతను సమర్థిస్తూ ఇచ్చినది. కాగా, రెండోది మణిపూర్‌కు చెందిన కీశం మేఘాచంద్రసింగ్ కేసులో ఇచ్చిన మూడు నెలల గడువుకు సంబంధించినది. దేశంలోని కోర్టులకు సర్వోన్నత న్యాయస్థానం తీర్పులు శిరోధార్యాలుగా ఉంటాయి. రాజ్యాంగం 141 అధికరణం ప్రకారం అవి చట్టాలుగా పరిగణించబడతాయని హైకోర్టు ధర్మాసనం గుర్తుచేసింది. ప్రజాస్వామ్యం, రాజ్యాంగ ప్రమాణాలు, నైతికతలకు ప్రతి రాజ్యాంగ వ్యవస్థ కట్టుబడి ఉండాలని, కాలయాపన వల్ల న్యాయం దక్కని పరిస్థితులు ఉండకూడదని చెప్పడం గమనార్హం. ఈ తీర్పుపై శాసన, పరిపాలనా వ్యవస్థల ప్రతిస్పందన ఎలా ఉంటుందో వేచి చూడాలి.

ఎన్నాళ్లీ మాఫీ సాగదీత?

ఉమ్మడి పాలనలో పంటలు ఎండిపోయి, అప్పులపాలై అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకుంటే, ఇప్పుడు తెలంగాణ గడ్డపై అప్పు మాఫీ కాలేదని రైతు ఉరి వేసుకొని ప్రాణం తీసుకున్నాడు. రైతుల్లో పంట రుణమాఫీ ఆశలు రేపిన ప్రస్తుత ప్రభుత్వం ఒక అమాయకుడి చావుకు కారణమైంది. రుణమాఫీ వైఫల్యానికి ఈ మరణం తాజా తార్కాణం. రైతు తన సూసైడ్ నోట్‌లో 'బ్యాంకులో రుణమాఫీ కానందుకు ఆత్మహత్య' అని స్పష్టంగా రాశాడు.



బి నర్సన్
94401 28169



తల్లి కొడుకులు విడివిడిగా బ్యాంకు అప్పు తీసుకున్నారు. ఒకే రేషన్ కార్డులో ఇద్దరి పేర్లున్నా ఏ ఒక్కరికి రుణమాఫీ కాలేదు. తన రేషన్ కార్డులో తల్లి పేరు ఉన్నందువల్లే తనకు మాఫీ లభించలేదని ఆయన బాధపడ్డాడు. ఇక వచ్చే అవకాశం లేదని తీవ్ర నిర్ణయాన్ని తీసుకున్నాడు. ఈ ఆత్మాహుతి పట్ల ప్రభుత్వం కనీసం సానుభూతి ప్రకటించిన దాఖలాల్లేవు.

గత లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆగస్టు 15 నాటికి ఒకే విడతగా రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని ఏప్రిల్ 15 నాడు ప్రకటించారు. అదే గనుక జరిగితే 'తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి, తిరిగి పోటీలో నిలబడను' అని బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు సవాల్ విసిరారు. దాంతో రుణమాఫీ ప్రభుత్వానికి ప్రతిష్ఠాత్మకమైంది. నిజానికి హరీశ్‌రావు ఈ మాట అని ఉండకపోతే 'రైతు భరోసా' లాగే రుణమాఫీ పట్ల కూడా వాయిదాల పర్వమే కొనసాగేది. మొత్తానికి ఏదో ఒత్తిడి కారణంగా రుణమాఫీ తెరపైకి వచ్చింది. బ్యాంకుల నిర్వహణా కార్యాలయాల నుంచి పంట రుణ బకాయిల లెక్కలు తీసుకున్నారు. రైతులు బ్యాంకులకు చెల్లించవలసింది రూ.41 వేల కోట్లు అని చెప్పారు. అంతకాదు రూ.39 వేల కోట్లేనని సర్ది చెప్పారు. చివరికి రూ.31 వేల కోట్ల మీద నిలబడ్డారు. జూలై 19 నాడు మొదలైన మాఫీ సొమ్ము విడుదల మూడు విడతలుగా ఆగస్టు 15 నాటికి పూర్తయింది. ప్రతిసారి '32.5 లక్షల రైతులకు రూ.31వేల కోట్ల రుణ మాఫీ' అని ప్రభుత్వం గొప్పగా ప్రకటించింది. ఇప్పటివరకు విడుదల చేసిన సొమ్ము మాత్రం రూ.18 వేల కోట్లు మాత్రమే. అంటే ఇంకా 40 శాతం సొమ్ము పంచవలసే ఉన్నది. రూ.2 లక్షలపైన ఉన్న బకాయిని రైతు స్వయంగా చెల్లించిన తర్వాతే మాఫీ సొమ్ము ఖాతాలో జమవుతుందనే మెలిక ఎందుకో అర్థం కాదు. వ్యవసాయమంత్రి ఎప్పుడు మాట్లాడినా 22 లక్షల మందికి ఒకే విడతలో రూ.18 వేల కోట్లు జమ చేశాం. అయితే వివిధ కారణాల వల్ల కొందరి రైతుల ఖాతాల్లోకి జమ కాలేదు. సక్రమంగా వారి ఖాతాల్లోకి బదలాయించేలా చర్యలు చేపట్టామని చెప్తున్నారు. రైతులు ఆఫీసుల చుట్టూ తిరిగే అవసరం లేదు, ఉద్యోగులే ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరిస్తారని అంటున్నారు. కుటుంబ నిర్ధారణ కాని ప్రతి ఒక్కరి నుంచి సమాచారం తీసుకొని, వాటిని సరిదిద్దేలా చూస్తున్నాం. ఇప్పటికి 2.65 లక్షల మంది వివరాలు సేకరించామన్నారు. ఈ తతంగమంతా ఎప్పుడు పూర్తవుతుందో, సర్కార్ ఇవ్వాలనుకున్న రైతులకైనా లాభం కలుగుతుందో లేదో చెప్పలేని పరిస్థితి నెలకొన్నది. ఎటుతిరిగి రూ.18 వేల కోట్ల గురించి తప్ప మంత్రిగారు మరో మాట ఎత్తడం లేదు. రూ.31 వేల కోట్లలో మిగిలిన రూ.13 కోట్లు ఎప్పుడు, ఎవరి ఖాతాల్లో వేస్తారో చెప్పడం లేదు.

రుణమాఫీ రూ.31 వేల కోట్లు చేశామని ఎందుకు ప్రచారం చేసుకుంటున్నారో స్పష్టత లేదు. బ్యాంకులు ఇచ్చిన వివరాల ప్రకారం అంత మొత్తం అవసరమవుతుందని చెప్పిన ప్రభుత్వం ఆ వివరాలను దాచిపెడుతుంది. ప్రభుత్వం నిర్ణయించిన కటాఫ్ తేదీల ప్రకారం బ్యాంకులు అందించిన రైతుల పేర్లు, వారి బకాయిలు ప్రభుత్వం బయటపెట్టాలి. అప్పుడే న్యాయంగా రుణమాఫీ రావలసిన రైతుల వివరాలు తెలుస్తాయి. బ్యాంకుల వారీగా ఆ సొమ్మును విడుదల చేస్తే రైతు ఖాతాల్లో జమవుతాయి.

మాఫీ రూ.31 వేల కోట్లు చేశామని ఎందుకు ప్రచారం చేసుకుంటున్నారో స్పష్టత లేదు. బ్యాంకులు ఇచ్చిన వివరాల ప్రకారం అంత మొత్తం అవసరమవుతుందని చెప్పిన ప్రభుత్వం ఆ వివరాలను దాచిపెడుతుంది. ప్రభుత్వం నిర్ణయించిన కటాఫ్ తేదీల ప్రకారం బ్యాంకులు అందించిన రైతుల పేర్లు, బకాయిలు బయటపెట్టాలి.

కుటుంబానికి ఒకరికే, రేషన్ కార్డులో ఒక పేరుకే, పింఛన్ వస్తే కట్, రేషన్ కార్డులో ఉద్యోగి ఉంటే 'నో' అనే దాపరికపు అడ్డంకుల వల్లే ఈ సమస్యలన్నీ వచ్చాయి. విడుదల చేసిన సొమ్ములో కూడా వందల కోట్లు రైతుల ఖాతాల్లోకి చేరడం లేదు. ఎంత మిగిలితే అంత లాభం అన్నట్లుగా రోజుకో పిట్టకథ చెప్తూ ప్రభుత్వం కాలం వెళ్లదీస్తున్నది. ప్రస్తుత పరిస్థితి చూస్తుంటే రూ.18 వేల కోట్లు కూడా రైతులకు దక్కేట్లు లేదు.

రుణమాఫీ 60 శాతం మాత్రమే అయింది. అందరికి అందేలా రైతుల పక్షాన నిలబడి ప్రభుత్వాన్ని నిలదీస్తామని బీజేపీ బాధితుల కోసం ఒక ఫోన్ నంబర్ ప్రకటించింది. చాలా కాల్స్ వచ్చాయన్నారు. ఆందోళనకు దిగుతామని కూడా అన్నారు. ఇంతవరకు దాని ఊసు లేదు. కమ్యూనిస్టు పార్టీలు కూడా ఖమ్మం జిల్లాలో రైతులందరికీ రుణమాఫీ చేయాలని ఓ డ్రామా లాంటి ధర్నా చేపట్టారు. మంత్రి తుమ్మల వచ్చి ఏదో హామీ ఇవ్వగానే జెండాలు దించేశారు. రైతు ఆత్మహత్య పట్ల తన వేదనను ప్రకటించిన హరీశ్‌రావు మాటలు రైతులను రెచ్చగొట్టేలా ఉన్నాయని కాంగ్రెస్ వర్గాలు పోలీసుల దాకా వెళ్లాయి. రుణమాఫీ బూటకంపై ఎవరు నోరెత్తినా ఊరుకొనేది లేదన్నట్లు ప్రభుత్వం వ్యవహరిస్తున్నది.

రాహుల్‌ని రప్పించి రైతు డిక్లరేషన్ వేదికపై వరంగల్‌లో 'రుణమాఫీ విజయయాత్ర' ఏర్పాటుచేస్తామన్న ప్రభుత్వం ఇప్పుడు ఆ మాట ఎత్తడం లేదు. అరకొర మాఫీతో పార్టీ పట్ల రైతులు అసంతృప్తిగా ఉన్నారనే విషయం ఆయన దాకా వెళ్లి ఉండవచ్చు. మాఫీ కోసం కేటాయించిన రూ.31 వేల కోట్ల లెక్క తేల్చాలని విపక్షాలు ప్రభుత్వాన్ని నిలదీస్తే రైతులకు న్యాయం జరిగే అవకాశం ఉన్నది.

మూడో ప్రత్యామ్నాయం ఎక్కడ?

భారత రాజకీయాల్లో ఇప్పుడు ఎక్కడ చూసినా వినిపిస్తున్న మాట కేంద్రంలో మూడో ప్రత్యామ్నాయం. ఉభయ కమ్యూనిస్టు పార్టీలు, ఇతర వామపక్షాల మద్దతుతో కేంద్రంలో 2004 నుంచి 2008 వరకు కాంగ్రెస్ నాయకత్వంలోని యూపీఏ సర్కారు నడిచింది. కమ్యూనిస్టులు మద్దతు ఉపసంహరించుకున్న తర్వాత కూడా మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం 2014 పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘోర పరాజయం పాలయ్యేంత వరకు కొనసాగింది. వామపక్షాల మద్దతుతో కేంద్రంలో కాంగ్రెస్ ఆధిపత్యమున్న మన్మోహన్‌సింగ్ ప్రభుత్వ ఏర్పాటుతోనే దేశంలో మూడో ప్రత్యామ్నాయానికి నూకలు చెల్లినట్టయింది.



మెరుగుమాల
నాంచారయ్య



ఢిల్లీలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీల భాగస్వామ్యం లేని మూడో ప్రత్యామ్నాయ కూటమికి చెందిన చివరి ఇద్దరు ప్రధానులు ఎవరంటే.. హెచ్‌డీ దేవెగౌడ, ఐకే గుజ్రాల్ అని చెప్పకతప్పదు. కానీ, కాంగ్రెస్ బయటి నుంచి ఇచ్చిన మద్దతుతో దేవెగౌడ, గుజ్రాల్ నాయకత్వాన ఈ ప్రభుత్వాలు నడిచిన కారణంగా వాటిని అసలుసిసలు మూడో ప్రత్యామ్నాయాలుగా పరిగణించలేం. వరుసగా 2009, 2014, 2019, 2024లో జరిగిన ఎన్నికల ఫలితాలు ఇండియాలో మూడో ప్రత్యామ్నాయానికి అవకాశం లేదని నిరూపించాయి. కమ్యూనిస్టు పార్టీలు, ఉత్తరప్రదేశ్, బీహార్‌లో పూర్వపు పాలకపక్షాలు సమాజ్‌వాదీ, ఆర్జేడీలు పది, పదిహేనేండ్ల క్రితం వరకు దేశంలోని రెండు ప్రధాన జాతీయపక్షాలు బీజేపీ, కాంగ్రెస్‌కు సమాన దూరం పాటిస్తామనే వైఖరిని అవలంబించాయి. తర్వాత ఈ రెండు పెద్ద హిందీ రాష్ర్టాల ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా తమ రాజకీయ పంథాకు స్వస్తి పలికాయి. రెండు చోట్లా ముఖ్యంగా యూపీలో బీజేపీ 2014 నుంచీ బలీయ శక్తిగా అవతరించడం, బీహార్‌లో బీజేపీ బలం క్రమేపీ పెరగడం దీనికి కారణం. వాస్తవానికి యాదవులు, కుర్మీలు, ఇతర వెనుకబడిన కులాలు, దళితులు, ముస్లిం మద్దతు మెండుగా ఉన్న ఎస్పీ, ఆర్జేడీలు ఈ రెండు రాష్ర్టాల్లో బ్రాహ్మణులు, ఇతర అగ్రవర్ణాల నేతృత్వంలోని కాంగ్రెస్‌ను ప్రస్తుత బలహీన స్థితికి నెట్టివేయడంలో కీలకపాత్ర పోషించాయి. యూపీలో అయితే బయటి నుంచి మద్దతు ఇచ్చినప్పుడు కూడా ఎస్పీ స్థాపకుడు ములాయం సింగ్ యాదవ్ (1990ల చివర్లో) తన సంకీర్ణ సర్కారులోకి కాంగ్రెస్‌ను తీసుకోలేదు. మంత్రి పదవులు కూడా ఇవ్వలేదు. చివరికి 2017 యూపీ అసెంబ్లీ, 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు స్వల్ప సంఖ్యలో సీట్లిచ్చి, ఎస్పీ కలిసి పోటీచేసింది. ఇక బీహార్ విషయానికి వస్తే ఆర్జేడీ (ఆ పార్టీ అధినేత లాలూ ప్రసాద్ భార్య రబ్డీ దేవీ నాయకత్వంలో) చివరి దశ పాలనకాలంలో కాంగ్రెస్ జూనియర్ భాగస్వామిగా చేరింది. మళ్లీ 2014 తర్వాత రెండుసార్లు జేడీయూ నేత నితీశ్ కుమార్ నాయకత్వాన సాగిన మహా ఘటబంధన్ సంకీర్ణ ప్రభుత్వాల్లో కూడా కాంగ్రెస్ చిన్నపాటి భాగస్వామి అయింది. కేంద్రంలో, అనేక ఉత్తరాది రాష్ర్టాల్లో పదేండ్లకు పైగా అధికారంలో పాతుకుపోయిన బీజేపీని గద్దె దింపాలంటే కాంగ్రెస్ కూటమిలో ఉండక తప్పదనే నిర్ణయానికి డీఎంకే వంటి దక్షిణాది పార్టీ సహా జనతా పరివార్ పార్టీలుగా పిలిచే ఎస్పీ, ఆర్జేడీ, ఇంకా కమ్యూనిస్టు పార్టీలు ఇప్పుడు వచ్చేశాయి. దీంతో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలతో ఎన్నికల్లో పొత్తు, అధికారం పంచుకునే పార్టీలు ఇప్పుడు చాలా తక్కువ సంఖ్యలో ఉన్నాయి. కేరళలో వామపక్షాలు, తెలంగాణలో బీఆర్ఎస్, ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్ కాంగ్రెస్, ఒడిశాలో బీజేడీ వంటి కొన్ని పార్టీలే ఎన్డీయే, ఇండియా కూటములకు దూరంగా ఉన్నాయి.

దేశంలో, ముఖ్యంగా కేంద్రంలో ఏ ఒక్క పార్టీకి సంపూర్ణ మెజారిటీ రాకుండా త్రిశంకు లోక్‌సభల ఏర్పాటుకు 1989, 1991, 1996, 1998, 1999, 2004, 2009 పార్లమెంట్ ఎన్నికలు దారితీశాయి. ఒక్క 1991 పార్లమెంటు మధ్యంతర ఎన్నిక తర్వాత మాత్రమే కాంగ్రెస్ ఇతర పార్టీలను చీల్చి, మైనారిటీ సర్కారును మెజారిటీ మద్దతు ఉన్న ఏక పార్టీ ప్రభుత్వంగా రెండున్నరేండ్లలో మార్చగలిగింది. నాటి ప్రధాని, కాంగ్రెస్ అధ్యక్షుడు పీవీ నరసింహారావు చాణక్యం, పాండిత్యం అందుకు దోహదం చేశాయి. అలా కాకుండా కేంద్రంలో పాలక కూటమికి నాయకత్వం వహించిన జనతాదళ్, బీజేపీలకు 1996-2004 మధ్య రెండొందల సీట్లు మాత్రమే లోక్‌సభలో ఉన్న కారణంగా రాజకీయ సుస్థిరత లేదనే చెప్పవచ్చు. ఈ కారణంగానే అప్పట్లో మధ్య తరగతి పౌరులు.. 'దేశంలో రెండు ప్రధాన జాతీయపక్షాల్లో ఏదో ఒకదానికి పార్లమెంటు ఎన్నికల్లో సాధారణ మెజారిటీకి అవసరమైన 272 సీట్లు రావాలి. మన లాగా పార్లమెంటరీ ప్రజాస్వామ్య పంథాలో పయనిస్తున్న బ్రిటన్, అధ్యక్ష తరహా పాలన ఉన్న అమెరికాలో మాదిరిగానే రెండు ప్రధాన ఆధిపత్య రాజకీయపక్షాలు మాత్రమే సంపూర్ణ మెజారిటీతో అధికారంలోకి వచ్చే రాజకీయ వ్యవస్థ భారత్‌లోనూ వేళ్లూనుకోవాలి' అనే భావనతో ఉండేవారు. అయినా బీజేపీ, కాంగ్రెస్ మీద ఆధారపడకుండా మూడో ప్రత్యామ్నాయ రాజకీయ కూటమి బలపడితేనే భారత ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుందనే వారి సంఖ్య కూడా గణనీయంగా ఉండేది. కాంగ్రెస్ పార్టీ నియంతృత్వ ధోరణులను, ఇతర ప్రాంతీయపక్షాలను సహించని ఆధిపత్య ధోరణులను గట్టిగా వ్యతిరేకించే వామపక్షాలు సహా అనేక పక్షాలు 1967-1989 మధ్యకాలంలో హిందూ మతతత్వ భావజాలంతో ఉన్న జనసంఘ్, బీజేపీ, శివసేన వంటి పక్షాలతో చేతులు కలపడానికి వెనుకాడలేదు. 2014 నుంచీ కేంద్రంలో, దేశంలోని నాలుగు వైపులా ఉన్న అనేక రాష్ర్టాల్లో బీజేపీ బలపడే క్రమంలో దేశంలో తృతీయ ప్రత్యామ్నాయం గురించి మాట్లాడే ఓపిక, ఆసక్తి వామపక్షాలు సహా అనేక బలమైన ప్రాంతీయపక్షాలకు లేకుండా పోయాయి.

యూపీఏ-2 హయాం మధ్యలో 2012లో వేగం పుంజుకున్న అవినీతి వ్యతిరేక ఉద్యమం నుంచి మాజీ ఐఆర్ఎస్ అధికారి అరవింద్ కేజ్రీవాల్ నాయకత్వాన అదే ఏడాది నవంబర్‌లో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అవతరించింది. వామపక్ష విధానాల వైపు మొగ్గుతో బయల్దేరిన ఆప్ ఆరంభం నుంచీ బీజేపీ, కాంగ్రెస్‌లకు వ్యతిరేకంగా మూడో ప్రత్యామ్నాయంగా కనిపించింది. ఏడాది తర్వాత 2013 చివర్లో జరిగిన ఢిల్లీ శాసనసభ ఎన్నికల్లో మొత్తం 70 సీట్లలో 26 స్థానాలు, 29.5 శాతం ఓట్లు సాధించి సంచలనం సృష్టించింది. 32 సీట్లు కైవసం చేసుకున్న బీజేపీని అధికారంలోకి రాకుండా నిలువరించడానికి ఆప్‌కు కాంగ్రెస్ మద్దతు ఇవ్వడంతో కేజ్రీవాల్ మొదటిసారి ఢిల్లీ సీఎం అయ్యారు. కాంగ్రెస్‌తో విభేదాల వల్ల కొద్ది నెలలకే కేజ్రీవాల్ సర్కార్ కూలిపోయాక ఎప్పటిలా రెండు జాతీయపక్షాలకు ఆప్ ప్రధాన ప్రత్యర్థిగా అవతరించే ప్రయత్నం చేసింది.

2014 పార్లమెంట్ ఎన్నికల్లో వారణాసి నుంచి కూడా నామినేషన్ వేసిన ప్రధాని నరేంద్రమోదీపై కేజ్రీవాల్ పోటీకి దిగి, కాంగ్రెస్, బీజేపీలకు తాను వ్యతిరేకమని నిరూపించారు. అయితే 2019 ఎన్నికల్లో బీజేపీ మెజారిటీ పెంచుకోవడం, కేంద్ర సర్కారు ఆదేశాలకు అనుగుణంగా నడిచే ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్లతో గొడవల కారణంగా గత రెండేండ్లలో కాంగ్రెస్‌కు ఆప్ కాస్త దగ్గరైంది.

అయితే, 2022 పంజాబ్ ఎన్నికల్లో నాటి పాలకపక్షం కాంగ్రెస్, అకాలీదళ్, బీజేపీ కూటములను ఓడించి మూడో ప్రత్యామ్నాయంగా ఎదుగుతుందనే భావన కలిగించింది. కానీ, 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఢిల్లీలో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకుని మూడో ప్రత్యామ్నాయంగా ఎదగాలనే కాంక్షకు నెమ్మదిగా తెరదించింది.

2024 బ్రిటిష్ పార్లమెంటు ఎన్నికల్లో 33 శాతం ఓట్లు మాత్రమే దక్కించుకున్న లేబర్ పార్టీ మంచి మెజారిటీ (మొత్తం 650కి 411 సీట్లు) సాధించింది. పూర్వపు అధికారపక్షం కన్జర్వేటివ్ పార్టీ 23.7 శాతం ఓట్లతో కేవలం 121 సీట్లే గెల్చుకుంది. కొత్తగా రంగంలోకి దిగి 600కు పైగా సీట్లలో పోటీచేసిన మితవాద రిఫామ్ పార్టీ (పాత బ్రెగ్జిట్ పార్టీ) గెలిచింది 6 సీట్లే అయినా 14.3 శాతం ఓట్లు కైవసం చేసుకుంది. అంతేకాదు, ఇటీవల వివిధ రాజకీయపక్షాల పనితీరుపై జరిగిన ఒక సర్వేలో రిఫామ్ పార్టీ బాగా పుంజుకుంటున్నట్టు తేలింది. నిండా ఏడు కోట్ల జనాభా లేని ఇంగ్లండ్‌లోనే నూరేండ్లకు పైగా కొనసాగుతున్న రెండు ఆధిపత్య రాజకీయపక్షాల (లేబర్, కన్జర్వేటివ్) పాలనకు స్వస్తి పలికి మూడో ప్రత్యామ్నాయానికి అవకాశం ఇవ్వాలనే అభిప్రాయం జనంలో బలపడుతోంది. ఈ నేపథ్యంలో దాదాపు నూరు కోట్ల మంది ఓటర్లు, ఏడెనిమిది మతాలు, వేలాది సామాజికవర్గాలు ఉన్న సువిశాల భారతదేశంలో కేవలం రెండు జాతీయ రాజకీయపక్షాలే ఒకదాని తర్వాత ఒకటి కేంద్రంలో అధికారం చేపట్టడం వాంఛనీయ పరిణామం కాదు.

ఉత్తరం

అటకెక్కిన పరిశోధనలు


రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలు అటకెక్కాయి. వర్సిటీలలో పరిశోధనలకు రోజురోజుకు ప్రాధాన్యం తగ్గుతుండటం ఆందోళనకరం. రెగ్యులర్ అధ్యాపకుల సంఖ్య తక్కువగా ఉండటమే అందుకు కారణమని తెలుస్తున్నది. చాలా వర్సిటీల్లో 25 శాతం మాత్రమే రెగ్యులర్ అధ్యాపకులు ఉండగా.. మిగిలిన 75 శాతం ఒప్పంద, తాత్కాలిక అధ్యాపకులే ఉండటం గమనార్హం. పరిశోధనలు చేసేందుకు విద్యార్థులు ఆసక్తి చూపుతున్నప్పటికీ సరైన మార్గదర్శకులు లేకపోవడంతో ప్రైవేట్, ఇతర రాష్ర్టాల విశ్వవిద్యాలయాల వైపు చూడాల్సిన పరిస్థితి దాపురిస్తున్నది. విభాగాధిపతులుగా, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్లుగా, డైరెక్టర్లుగా ఒప్పంద అధ్యాపకుల సేవలను వినియోగించుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం పరిశోధనలకు మాత్రం వారి అనుభవాన్ని ఉపయోగించకపోవడం విచారకరం. రెగ్యులర్ ప్రొఫెసర్లు లేని ప్రస్తుత పరిస్థితుల్లో ఒప్పంద అధ్యాపకుల సేవలను వినియోగించుకోకపోతే భవిష్యత్తులో పరిశోధనలు కనుమరుగయ్యే ప్రమాదం పొంచి ఉన్నది.

- డాక్టర్ టి.నాగయ్య, 97012 75354

గెజిటెడ్ హోదా కల్పించాలె

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలి కాలంలో గురుకులాలలో జూనియర్ లెక్చరర్, డిగ్రీ లెక్చరర్ పోస్టులను భర్తీచేసిన విషయం తెలిసిందే. అయితే, వీరికి గెజిటెడ్ హోదాను ప్రభుత్వం కల్పించకపోవడం విచారకరం. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న లెక్చరర్లకు గెజిటెడ్ హోదా కల్పించి, వీరిని తక్కువగా చూడటం ప్రభుత్వ తీరుకు నిదర్శనం. కాబట్టి, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకొని అందరినీ ఒకేతీరున చూడాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. ఇందులో భాగంగానే గురుకులాల్లోని జూనియర్ లెక్చరర్, డిగ్రీ లెక్చరర్లకు కూడా గెజిటెడ్ హోదా కల్పించాల్సిందిగా డిమాండ్ చేస్తున్నాం.

- రాపాక రవీందర్, జనగాం




వరుస ఓటములతోనే అసహనం!

పీవీ నరసింహారావు ప్రధానిగా ఉన్నప్పుడు ప్రతిపక్ష నేతగా ఉన్న వాజ్‌పేయి విదేశాల్లో మన భారత్‌కు ప్రాతినిధ్యం వహించి, దేశాన్ని ముందుకు తీసుకెళ్లారు. కానీ, ప్రస్తుత ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ మాత్రం దేశానికి మేలు చేయక పోగా.. ఇతర దేశాల్లో జన్మభూమి కీర్తిప్రతిష్ఠలను దిగజారుస్తున్నారు. వరుస ఎన్నికల్లో ఓటములతో నిరాశ, నిస్పృహల్లో కూరుకుపోయిన ఆయన విదేశాల్లో తన అసహనాన్ని వెళ్లగక్కుతున్నారు.

- శివరాజ్‌సింగ్ చౌహాన్, కేంద్రమంత్రి

నివాళి



తెలంగాణ సాహితీ శిఖరం అయాచితం



గంగవరం
ఆంజనేయశర్మ
94404 62545

సాహితీ శిఖరం నేలకొరిగింది. ఒక గొప్ప సంస్కృతాంధ్ర కవి పండితుడిని సాహితీలోకం కోల్పోయింది. ప్రముఖ సాహిత్య పండితుడు, ధార్మిక, ఆధ్యాత్మికవేత్త, అవధాని డాక్టర్ అయాచితం నటేశ్వరశర్మ అస్తమించడం ఆత్మీయ సాహిత్య లోకానికి తీరని లోటు. ప్రముఖ విద్వాంసులు జయలక్ష్మి-అనంత రాజయ్యశర్మల జ్యేష్ఠ పుత్రుడు డాక్టర్ అయాచితం నటేశ్వరశర్మ కామారెడ్డి సమీపంలోని రామారెడ్డిలో 1956 జూలై 17న జన్మించారు.

'అచటబుట్టిన చిగురుకొమ్మైన చేవయగు' అన్నట్టు అయాచితం వారింట్లో అయాచితమైన ప్రజ్ఞాపాటవాలు కలిగి అంచెలంచెలుగా అత్యున్నత సాహితీ శిఖరాలను అధిరోహించిన సంస్కృతాంధ్ర కవి పండితులు నటేశ్వరశర్మ. 1969లో సంస్కృత విద్యాభ్యాసం చేస్తున్న రోజుల్లోనే సంస్కృతం, తెలుగులో పద్య, శ్లోక, గేయ రచనలను ఆయన ప్రారంభించారు. 1970లో కంచి పీఠాధిపతుల సమక్షంలో విద్యార్థిగా సంస్కృత శ్లోక స్వాగతాన్ని పలికిన ఆయన.. గొప్ప కవిగా కీర్తిప్రతిష్టలు అందుకుంటారని అప్పట్లోనే అభినందనలు పొందారు. అయాచితం అర్ధాంగి అరుణకుమారి కూడా పండిత కుటుంబానికి చెందినవారే.

కామారెడ్డిలోని ప్రాచ్య విద్యాపరిషత్తు సాయంప్రాచ్య కళాశాలలో ఆచార్యుడిగా మొదలైన ఆయన ప్రస్థానం ప్రధానాచార్యుల వరకు సాగింది. అంతేకాదు, ఓయూలో ప్రాచ్య భాషా పీఠాధిపతిగా కూడా ఆయన సేవలందించారు. 2014 జూలైలో పదవీ విరమణ పొందారు. వేలాది మంది విద్యార్థులకు సంస్కృతాంధ్ర భాషలను ఆయన బోధించారు. అంతేకాదు, కవిత్వంలో, అవధానాల్లో పట్టువచ్చేలా వారిని తీర్చిదిద్దారు. అయాచితం శిష్య, ప్రశిష్యులెందరో గొప్పగొప్ప అవధానులుగా, కవులుగా వారి అవధాన కవిత్వ కీర్తిని నిలబెడుతున్నారు.

డాక్టర్ నటేశ్వరశర్మ అనేకమంది పండితుల సాహచర్యంలో ఉభయ రాష్ర్టాల్లో ఉభయ భాషా పాండిత్యాల్లో గొప్ప కీర్తిని పొందారు. వందలాది అవధానాలు, సాహిత్య గోష్ఠులు, వేలాది పుస్తకాలకు పీఠికలు, వివిధ పత్రికల్లో అనేక వ్యాసాలు రచించి ఎనలేని కీర్తిని గడించారు.

ఆణిముత్యాల్లాంటి అయాచితం నటేశ్వరశర్మ దస్తూరి ముందు ముద్రణా యంత్రాలు కూడా దిగదుడుపే. గుండ్రని, చక్కని దస్తూరి వారిది. ఎన్నో పురస్కారాలతో పాటు అత్యున్నతమైన దాశరథి పురస్కారం కూడా ఆయనను వరించింది. 'శకుంతల' అనే పద్యకావ్యానికి తెలుగు విశ్వవిద్యాలయం నుంచి ఉత్తమ కావ్య పురస్కారం కూడా లభించింది. 'భారత ప్రశస్తి'కి జాతీయ సాహిత్య పరిషత్తు పురస్కారం పొందారు. 1994లో ఓయూ నుంచి డాక్టరేట్ పట్టా, స్వర్ణ పతకం కూడా పొందారు. ఇటీవల పరిశోధన రచన 'సౌందర్యలహరి సౌందర్యం' అనే గొప్ప కావ్యం ప్రముఖ పండితులు, ధార్మికుల చేతులమీదుగా ఆవిష్కృతమైంది.

సంస్కృతం, తెలుగులో 60కి పైగా గ్రంథాలను అయాచితం రచించారు. అంతేకాదు, తెలంగాణ సుప్రభాతం రూపకం రాశారు. శ్లోక పద్య వచన ప్రక్రియలో రచనలు చేశారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో కవిగా తన గొంతు విప్పారు. గతేడాది జూన్ 2న జరిగిన రాష్ట్ర అవతరణ ఉత్సవాల సందర్భంగా నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ తన ప్రసంగంలో నటేశ్వర శర్మ పద్య పాదాన్ని ఉటంకించడం విశేషం.

కామారెడ్డి బ్రాహ్మణ వికాస పరిషత్తుకు చాలా సంవత్సరాలు అధ్యక్ష, కార్యదర్శులుగా ఆయన ఎనలేని సేవలందించారు. అంతేకాదు, అనేక సాహిత్య అవధాన కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూనే, సామాజిక సేవ చేసి ప్రజల్లో ఆత్మీయతను పొందారు. ఉన్నతమైన వ్యక్తిత్వం, విశాల హృదయం, కలుపుగోలుతనం, వినమ్రత ఇవన్నీ ఆయనకు చిరస్థాయి ఆభరణాలు. అనేక దిన, వార, పక్ష, మాస పత్రికల్లో ప్రచురితమయ్యే ఆయన వ్యాసాలు ఆబాలగోపాలాన్ని అలరించేవి.

డాక్టర్ అయాచితం మన ప్రాంతానికి అయాచితంగా లభించిన ఆణిముత్యం. వారి కీర్తి అజరామరం, అనంతం. వారి కీర్తి నగమేరు శిఖరమంత విస్తరించింది. ఇసన్నపల్లి భైరవస్వామి సుప్రభాతంతో పాటు అనేక దేవతల స్తోత్రాలు, శతకములు, అష్టకములు వారికి గొప్ప కీర్తినందించాయి. జంట అవధానాలు కూడా చేసిన అయాచితం నటేశ్వరశర్మ పూర్వ కవుల స్థాయికి చేరుకున్నారు. వారికి సదాసర్వదా మనం రుణపడి ఉన్నాం. వారి నిర్యాణం తెలంగాణ సాహితీ లోకానికే కాదు, తెలుగు సాహితీలోకానికి తీరని లోటు.

దారులు పూలతేరులయి

2023, జూన్ 2న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవంలో ప్రసంగిస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రస్తావించిన డాక్టర్ అయాచితం నటేశ్వరశర్మ రాసిన పద్యం.

'దారులు పూలతేరులయి, తావులు నింపును నేత్రశోభలన్
తేరులవోలె రమ్యపథ దీప్తుల నింపుచు సాగిపోవగా
మారిన గ్రామశోభ, నవ మంజులతాళిని కుంజమై, మనో
హారిణి రాష్ట్ర శోభ జనహాస వికాస విలాసమయ్యెడిన్!'

మరి ఇదేంది గాంధీ..?


- కాంగ్రెస్ పార్టీలో చేరినట్టు ఎక్స్‌లో వెల్లడించిన అరికపూడి
- సీఎంతో దిగిన ఫొటోలు జూలై 13న ట్వీట్‌కు ట్యాగ్
- మెడలో మెరుస్తున్న సీఎం కప్పిన కాంగ్రెస్ కండువా
- అరికపూడి చేరికను ధ్రువీకరిస్తూ వేం నరేందర్‌రెడ్డి ట్వీట్

నేడు కాంగ్రెస్‌లో చేరనేలేదంటూ బాహాటంగా అబద్ధాలు

హైదరాబాద్, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ): శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి గాంధీ వ్యవహారశైలిని ప్రజలు చీదరించుకుంటున్నారు.మహాత్ముడి పేరు పెట్టుకున్న ఆయన ఆ పేరును చెడగొట్టేలా వ్యవహరిస్తున్నారంటూ మండిపడుతున్నారు. నైతిక విలువలు లేకుండా పచ్చి అబద్ధాలు మాట్లాడుతుండటంపై సొంత నియోజకవర్గ ప్రజలే ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మూడు నెలలక్రితం తాను సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరినట్టు ప్రకటించుకున్న ఆయన.. ఇప్పుడేమో తాను కాంగ్రెస్ పార్టీలో చేరలేదంటూ నాలుక మడతేశారు. సీఎం రేవంత్‌రెడ్డిని కేవలం నియోజకవర్గ అభివృద్ధి కోసమే కలిసినట్టు బుకాయిస్తున్నారు. ప్రతిపక్ష పార్టీ సూచించిన సభ్యునికి ఇవ్వాల్సిన పీఏసీ కమిటీ చైర్మన్ పదవిని కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అరికపూడి గాంధీ దక్కించుకున్నారు. దీనిపై ప్రధాన ప్రతిపక్షం బీఆర్‌ఎస్ విమర్శలు గుప్పిస్తున్నది. దీంతో అరికపూడి గాంధీ ప్లేట్ ఫిరాయించారు. తాను కాంగ్రెస్‌లో చేరలేదంటూ అబద్ధాలు చెప్తున్నారు.

నేను కాంగ్రెస్ పార్టీలో చేరిన...

జూలై 13న ఎమ్మెల్యే అరికపూడి గాంధీ సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ విషయాన్ని ఆయనే స్వయంగా వెల్లడించారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి దిగిన ఫొటోలను పంచుకున్నారు. 'ఈ రోజు ఉదయం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసంలో సీనియర్ నాయకుడు మొవ్వ సత్యనారాయణ, కార్పొరేటర్లు రాగం నాగేందర్‌యాదవ్, ఉప్పలపాటి శ్రీకాంత్, మంజుల రఘునాథ్‌రెడ్డి, నియోజకవర్గ సీనియర్ నాయకులు, ముఖ్య అనుచరులు, అభిమానులతో కలిసి కాంగ్రెస్‌లో చేరడం జరిగింది' అంటూ ట్వీట్ చేశారు. ఈ ట్వీట్‌ను రేవంత్‌రెడ్డికి, రాహుల్ గాంధీకి, ఐఎన్‌సీ తెలంగాణ, ఇండియాకు ట్యాగ్ చేశారు. నాడు ఇంత అర్భాటంగా కాంగ్రెస్‌లో చేరినట్టు ప్రకటించుకొని, ఇప్పుడేమో తాను కాంగ్రెస్ పార్టీలో చేరనేలేదంటూ ప్లేట్ ఫిరాయించడంపై నియోజకవర్గ ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు.



ధ్రువీకరించిన వేం నరేందర్‌రెడ్డి

అరికపూడి కాంగ్రెస్‌లో చేరిన విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి కూడా ధ్రువీకరించారు. ఆయన కూడా జూలై 13న తన ఎక్స్ ఖాతాలో ఈ విషయాన్ని పంచుకున్నారు. 'శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి గాంధీ, పలువురు జీహెచ్‌ఎంసీ కార్పొరేటర్లు సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో జాయిన్ అయ్యారు. కాంగ్రెస్ కండువా కప్పి ఆహ్వానించడం జరిగింది' అంటూ వారి ఫొటోను జత చేశారు. అరికపూడి కాంగ్రెస్‌లో చేరారనేందుకు ఇంతకన్నా సాక్ష్యం ఇంకేం కావాలి.

మెడలో మెరుస్తున్న కాంగ్రెస్ కండువా

అరికపూడిని కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తూ రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పారు. తన మెడలో కప్పింది కాంగ్రెస్ కండువా కాదని, అది ఆలయాల్లో కప్పే కండువా అని గాంధీ చెప్పుకొచ్చారు. ఫొటోల్లో మాత్రం ఆయన చెప్పిన దానికి పూర్తి భిన్నంగా సీఎం రేవంత్‌రెడ్డి మెడలో దేవాలయాల్లోని కండువా ఉంటే అరికపూడి గాంధీ మెడలో కాంగ్రెస్ కండువా కనిపిస్తున్నది. తన మెడలో దేవాలయ కండువా కప్పిన సీఎం రేవంత్‌రెడ్డి పార్టీలో చేరిన మిగిలిన వారికి మాత్రం కాంగ్రెస్ కండువా కప్పారని కూడా గాంధీ తెలిపారు. ఆ ఫొటోలో తనతోపాటు పార్టీలో చేరిన వారందరి మెడలో కాంగ్రెస్ కండువా ఉండటం గమనార్హం.

నీతులు చెప్పిన తెల్లారే రేవంత్ గోతులు

- ప్రజాస్వామ్యాన్ని కాంగ్రెస్ సర్కార్ ఖూనీ చేసింది
- పీఏసీ పదవికి హరీశ్ వేసిన నామినేషన్ ఏమైంది?
- ఫిరాయింపు ఎమ్మెల్యేకు పీఏసీ చైర్మన్ ఎట్లిస్తరు?
- తన నిర్ణయంపై స్పీకర్ పునరాలోచించాలి
- తెలంగాణ పరిణామాలపై రాహుల్ స్పందించాలి
- మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి



సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ కాంగ్రెస్‌లో చేరగా పత్రికలో వచ్చిన వార్తను చూపిస్తున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ) : అసెంబ్లీలో సంప్రదాయానికి, నిబంధనలకు విరుద్ధంగా పీఏసీ చైర్మన్ పదవి ఇచ్చారని మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. ప్రతిపక్షానికే పీఏసీ చైర్మన్ పదవి ఇవ్వడం దేశంలో ఆనవాయితీగా వస్తున్నదని, ఈ పదవిని పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేకు ఇవ్వడం పార్లమెంటరీ స్ఫూర్తికి, సంప్రదాయాలకు విరుద్ధమని ధ్వజమెత్తారు. ప్రజాస్వామ్యాన్ని అసెంబ్లీ సాక్షిగా కాంగ్రెస్ సర్కార్ ఖూనీ చేసిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. అరికెపూడి గాంధీని అడ్డుపెట్టుకొని రేవంత్‌రెడ్డి చిల్లర రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. పీఏసీకి హరీశ్‌రావు వేసిన నామినేషన్ పత్రాలు ఏమయ్యాయని, హరీశ్ అంటే రేవంత్‌కు ఎందుకంత భయమని ప్రశ్నించారు. స్పీకర్ భుజం మీద తుపాకీ పెట్టి బీఆర్‌ఎస్‌ను కాల్చాలని చూస్తున్నారని, మొన్న జర్నలిస్టుల మీటింగ్‌లో సీఎం రేవంత్ నీతులు చెప్పి, తెల్లారే గోతులు తవ్వారని ఎద్దేవా చేశారు. నామినేషన్ వేయని అరికెపూడి గాంధీకి పదవి ఎక్కడి నుంచి వచ్చిందో చెప్పాలని, దీనిపై స్పీకర్ పునరాలోచన చేయాలని కోరారు. బీఆర్‌ఎస్ నేత రవీందర్ సింగ్‌తో కలిసి తెలంగాణ భవన్‌లో మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. వ్యవస్థలను ధ్వంసం చేశారని కేసీఆర్‌ను విమర్శించిన రేవంత్, పీఏసీ కమిటీల విషయంలో అతి పెద్ద ధ్వంసం చేశారని మండిపడ్డారు. 'రాహుల్ గాంధీ మాట కూడా వినలేని స్థాయికి రేవంత్ వెళ్లారా?, కాంగ్రెస్‌లో సీనియర్ అయిన జానారెడ్డి లాంటి వారు కూడా రేవంత్‌కు చెప్పే స్థితిలో లేరా?' అని ప్రశ్నించారు. గత అసెంబ్లీ సమావేశాల చివరి రోజున కమిటీల ఎన్నిక షెడ్యూల్ ప్రకటించారని, పీఏసీ ఎన్నిక పూర్తయిన తర్వాత స్పీకర్ అసెంబ్లీలోనే కమిటీ సభ్యుల పేర్లు ప్రకటించాలని, కానీ అందుకు విరుద్ధంగా 38 రోజుల తర్వాత కమిటీలను ప్రకటించారని చెప్పారు. బీఆర్‌ఎస్‌కు నిబంధనల ప్రకారం పీఏసీలో ముగ్గురు సభ్యులకు అవకాశం ఉంటుందని, తాను, హరీశ్‌రావు, గంగుల కమలాకర్ నామినేషన్ వేసినట్టు తెలిపారు. కానీ మధ్యలో అరికెపూడి గాంధీ పేరు ఎక్కడినుంచి వచ్చిందని ప్రశ్నించారు. సభ్యుల కన్నా ఎక్కువ నామినేషన్లు వస్తే ఓటింగ్ జరగాలని, కానీ ఓటింగ్ జరగకుండానే హరీశ్‌రావు నామినేషన్‌ను ఎలా తొలగించారని నిలదీశారు.

ఇదే విధానంలో ఢిల్లీలో అమలైతే?

తెలంగాణ ఏర్పడ్డాక ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్‌కు చెందిన పీ కృష్ణారెడ్డి, గీతారెడ్డి, అక్బరుద్దీన్‌లకు నిబంధనల ప్రకారం పీఏసీ చైర్మన్ పదవి ఇచ్చామని ప్రశాంత్‌రెడ్డి గుర్తుచేశారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు యనమల రామకృష్ణుడు, నాగం జనార్దన్‌రెడ్డికి పదవి ఇచ్చాని చెప్పారు. మోదీ హయాంలో మొదటి రెండు పర్యాయాలు కాంగ్రెస్‌కు ప్రధాన ప్రతిపక్ష హోదా లేకున్నా పీఏసీ చైర్మన్ పదవులు దక్కాయని, ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ సూచన మేరకు కేసీ వేణుగోపాల్‌కు కేంద్రంలో పీఏసీ చైర్మన్ పదవి ఇచ్చారని, కాంగ్రెస్‌కు ఢిల్లీలో ఓ సూత్రం, తెలంగాణలో మరో సూత్రమా? అని నిలదీశారు. రేవంత్ విధానాన్ని ఢిల్లీలో పాటిస్తే అక్కడ కేసీకి పీఏసీ చైర్మన్ పదవి వచ్చేదా? అని ప్రశ్నించారు. హిమాచల్ ప్రదేశ్‌లో పార్టీ మారిన ఎమ్మెల్యేల పెన్షన్ తొలగించారని, తెలంగాణలో పార్టీ మారిన ఎమ్మెల్యేకు పిలిచి పీఏసీ పదవి ఇచ్చారని ఇదేం ద్వంద్వ వైఖరి అని ధ్వజమెత్తారు. పీఏసీపై స్పీకర్ నిర్ణయం మారకపోతే ఇతర మార్గాలు అన్వేషిస్తామని చెప్పారు. గాంధీ బీఆర్‌ఎస్‌కు చెందిన వాడని మంత్రి శ్రీధర్‌బాబు చెప్తున్నారని, గాంధీని పీఏసీ చైర్మన్‌గా నియమించాలని కేసీఆర్ సూచించారా? అని, కేసీఆర్‌ను ఎపుడు సంప్రదించారో చెప్పాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి పెద్ద నియంతలా మారాడని, ఆయన తీరును ప్రతిఘటించి తీరుతామని హెచ్చరించారు.



నేత కార్మికుడి ఆత్మహత్య

- పురుగుల మందు తాగి బలవన్మరణం
- కరీంనగర్ జిల్లాలో విషాదం

రాంనగర్ (కరీంనగర్), సెప్టెంబర్ 10 : ఉపాధి లేక.. అప్పుల పాలై చేనేత కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన కరీంనగర్ జిల్లాలో చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ మండలం చామనపల్లికి చెందిన గుండేటి గణేశ్ (38) సాంచాలు నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈయనకు భార్య, ఓ కుమారుడు ఉన్నారు. ఉపాధి లేక కుటుంబ కలహాలతో ఆరు నెలల కిందట భార్య కొడుకును తీసుకొని పుట్టింటికి వెళ్లింది. సుమారు రూ.3 లక్షల వరకు అప్పు కావడంతో తీర్చే మార్గం లేక మనస్తాపానికి గురయ్యాడు. 'ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకుంటున్నా. నా మృతదేహాన్ని మున్సిపాలిటీ వారికి అప్పగించాలి' అని సూసైడ్ నోట్ రాసి సోమవారం సాయంత్రం 5 గంటల సమయంలో పురుగుల మందు తాగాడు. తండ్రి మల్లేశం గమనించి వెంటనే చికిత్స కోసం కరీంనగర్ ప్రభుత్వ దవాఖానకు తరలించాడు. పరిస్థితి విషమించడంతో మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు కరీంనగర్ రూరల్ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్ తెలిపారు.

యాదగిరిగుట్ట ఆలయం అద్భుతం



యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయం మహాద్భుతంగా రూపుదిద్దుకున్నదని 16వ ఆర్థిక సంఘం సభ్యులు అజయ్ నారాయణ ఝా, మనోజ్ పాండా కితాబునిచ్చారు. జాయింట్ సెక్రటరీ కేకే మిశ్రా, జాయింట్ డైరెక్టర్ దావిందర్ చోడా, డిప్యూటీ డైరెక్టర్ అభిషేక్ నందన్, అసిస్టెంట్ డైరెక్టర్ భద్‌బేష్ హజారిక, కలెక్టర్ హనుమంతు కే జెండగేతో కలిసి మంగళవారం స్వామివారిని దర్శించుకున్నారు. ఈవో భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త నరసింహమూర్తి వారికి స్వామివారి ప్రసాదాలు అందించారు. -యాదగిరిగుట్ట

హుస్సేన్‌సాగర్‌లో గణేశ్ నిమజ్జనంపై ఆంక్షలు



హుస్సేన్‌సాగర్‌లో గణేశ్ విగ్రహాలను నిమజ్జనం చేయవద్దంటూ మంగళవారం ట్యాంక్‌బండ్ మార్గంలో జీహెచ్‌ఎంసీ, హైదరాబాద్ పోలీసుల పేరిట ఫ్లెక్సీలు వెలిశాయి. ఈ విషయంపై వాహనదారులు, భక్తుల్లో చర్చ జరిగింది. హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనంపై హైకోర్టు ఆదేశాలను అమలు చేయడం లేదన్న పిటిషన్‌ను ఇదేరోజు కోర్టు తోసిపుచ్చింది. 2021 ఆదేశాల ప్రకారం నిమజ్జనం చేయాలని సూచించింది. పీవోపీ విగ్రహాలను తాత్కాలిక పాండ్స్‌లో నిమజ్జనం చేసుకోవచ్చని అనుమతించడం గమనార్హం. - హైదరాబాద్ సిటీబ్యూరో

అరికెపూడి తెలంగాణ భవన్‌కు రావాలి

- బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ సతీశ్‌రెడ్డి



హైదరాబాద్, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ) : తాను ప్రతిపక్షంలోనే ఉన్నానని అంటున్న ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ తెలంగాణ భవన్‌కు రావాలని బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై సతీశ్‌రెడ్డి సవాల్ విసిరారు. పీఏసీ(పబ్లిక్ అకౌంట్స్ కమిటీ)చైర్మన్‌గా నియమితులైన గాంధీ వ్యాఖ్యల్ని ఆయన తప్పుబట్టారు. పీఏసీ చైర్మన్‌గా ప్రతిపక్ష పార్టీకి చెందిన ఎమ్మెల్యేనే నియమించాలనే నిబంధనను కాంగ్రెస్ ప్రభుత్వం తుంగలో తొక్కిందని మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో విమర్శించారు. బీఆర్‌ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన గాంధీ.. సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకొని నిసిగ్గుగా తాను ప్రతిపక్షంలోనే ఉన్నానని పేర్కొనటం హాస్యాస్పదంగా ఉందని మండిపడ్డారు.

ఆ 10 మంది ఎమ్మెల్యేల్లో అంతర్మథనం

హైకోర్టు తీర్పు నేపథ్యంలో ముఖ్యులతో సమాలోచనలు



హైదరాబాద్, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ): 'పార్టీ మారి తప్పు చేశామా?'- ఇదీ బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన పది మంది ఎమ్మెల్యేల్లో మొదలైన అంతర్మథనం. 'నిన్నమొన్నటిదాకా ఏం కాదులే అనుకున్నాం. కానీ, హైకోర్టు తీర్పుతో స్పీకర్ నిర్ణయం తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఏంచేయాలో అర్థం కావడం లేదు. ముందు నుయ్యి.. వెనుక గొయ్యి అన్నట్టే ఉన్నది' అని పార్టీ మారిన ఎమ్మెల్యే ఒకరు తన సన్నిహితులతో వాపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతున్నదని, ఆ పార్టీ శ్రేణులు సహకరించడం లేదని, మరోవైపు బీఆర్‌ఎస్ పార్టీకి ప్రజల్లో ఆదరణ పెరుగుతున్నదని ఈ పరిస్థితుల్లో ఇప్పటికిప్పుడు ఉప ఎన్నికలు వస్తే తట్టుకొని నిలబడటం కష్టమని సదరు ఎమ్మెల్యే మథనపడుతున్నారని ఆయన అనుచరులు బాహాటంగానే చెప్తున్నారు. గద్వాల, భద్రాచలం, స్టేషన్‌ఘన్‌పూర్, జగిత్యాల, బాన్సువాడ, చేవెళ్ల, పటాన్‌చెరు, శేరిలింగంపల్లి, ఖైరతాబాద్, రాజేంద్రనగర్ ఈ పది నియోజకవర్గాల్లో హైకోర్టు తీర్పు హాట్‌టాపిక్‌గా మారింది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఏదో గాలి వీచింది కానీ, ఇప్పుడా పరిస్థితి లేదని పార్టీ మారిన ఎమ్మెల్యేలు బలంగా నమ్ముతున్నట్టు సమాచారం. కోర్టు తీర్పు అనంతరం ఫుల్‌బెంచ్‌కు వెళ్తామని ఎమ్మెల్యే కడియం శ్రీహరి పేర్కొనడం, తానింకా బీఆర్‌ఎస్‌లోనే ఉన్నానని పీఏసీ (పబ్లిక్ అకౌంట్స్ కమిటీ) చైర్మన్‌గా నియమితులైన శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ వ్యాఖ్యానించడానికి అంతర్మథనమే కారణమని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు.

సర్కార్‌పై వ్యతిరేకత.. కాంగ్రెస్‌లో తిరుగుబాటు

కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదన్న అసంతృప్తి వివిధ వర్గాల్లో వ్యక్తమవుతున్నది. రుణమాఫీ విషయంలో రైతుల నిరసనలు చేయని నియోజకవర్గమే లేదు. వానకాలం సీజన్ ముగింపు దశకు వచ్చినా రైతుభరోసాపై స్పష్టత రాలేదు. మహిళలకు నెలకు రూ.2,500, వృద్ధులకు ఆసరా పింఛన్ల పెంపుతోపాటు ఆరు గ్యారెంటీల్లో ఏ ఒక్కదానినీ సంపూర్ణంగా అమలుచేయకపోవడం వివిధ వర్గాల్లో అసంతృప్తికి కారణమవుతున్నదని పార్టీ మారిన ఎమ్మెల్యేలు భావిస్తున్నట్టు తెలుస్తున్నది. దీనికి తోడు కాంగ్రెస్ పార్టీలో వర్గపోరు పార్టీ మారిన ఎమ్మెల్యేలకు శరాఘాతంగా మారింది. బీఆర్‌ఎస్ పార్టీ టికెట్‌పై గెలిచి కాంగ్రెస్‌లో చేరిన కొద్దిరోజులకు తత్వం బోధపడిన కొంతమంది ఎమ్మెల్యేలు తిరిగి బీఆర్‌ఎస్‌లో చేరేందుకు ప్రయత్నిస్తున్నారని తెలుసుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వారికి పదవులు ఆశ చూపారు. ఈ అంశం కూడా కాంగ్రెస్ పార్టీని అతలాకుతలం చేస్తున్నది. బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీకి కట్టబెట్టిన పదవులు కాంగ్రెస్ పార్టీలో వర్గపోరును తీవ్రతరం చేశాయి. బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, డాక్టర్ సంజయ్, కడియం శ్రీహరి ప్రాతినిధ్యం వహిస్తున్న గద్వాల, జగిత్యాల, స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌లో వర్గపోరు పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేలా ఉన్నది. ఒకటి రెండు నియోజకకర్గాలు మినహా పార్టీ మారిన 10 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ క్యాడర్ ఎమ్మెల్యేలపై ఆగ్రహంతో ఉన్నారు. ఒకవైపు ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత, మరోవైపు కాంగ్రెస్‌లో తిరుగుబాటుతో సతమతం అవుతున్న నేపథ్యంలో హైకోర్టు తీర్పు ఆ ఎమ్మెల్యేలకు కంటి మీద కునుకు లేకుండా చేసిందని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. మొత్తంగా పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేలపై ఉప ఎన్నికల కత్తి వేలాడనున్నది.

అనర్హతపై నిర్ణీత గడువేదీ లేదు

మొదటిపేజీ తరువాయి...

షెడ్యూల్‌కు సంబంధించి న్యాయస్థానాలు శాసనవ్యవస్థలకు ఆదేశాలు ఇవ్వొచ్చా అన్న అంశంపై కూడా సమీక్షిస్తున్నట్టు తెలిపారు. సీఎల్పీలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఫిరాయింపు ఎమ్మెల్యేలకు సంబంధించి ఇచ్చిన తీర్పులో హైకోర్టు నాలుగు వారాల్లో ప్రక్రియను మొదలుపెట్టాలని మాత్రమే చెప్పిందని, రేపే నిర్ణయం తీసుకోవాలని చెప్పలేదని అన్నారు. అదేవిధంగా పదో షెడ్యూల్‌లో ఫిరాయింపు ఎమ్మెల్యేలపై చర్యలకు సంబంధించి చర్యలు తీసుకునేందుకు ఎక్కడా కూడా నిర్ణీత గడువు పేర్కొనలేదని చెప్పారు. రోజులా, నెలలా, సంవత్సరాలా అన్న విషయం చెప్పలేదని అన్నారు.

నిబంధనల ప్రకారమే పీఏసీ చైర్మన్ ఎన్నిక

శాసనసభ స్పీకర్ రాజ్యాంగ స్ఫూర్తితో, నిబంధనలకు అనుగుణంగా ప్రతిపక్షానికి చెందిన ఎమ్మెల్యేను పీఏసీ చైర్మన్‌గా నియమించారని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. ఒక ప్రక్రియ ప్రకారమే స్పీకర్ ఫైనాన్షియల్ కమిటీలను ఏర్పాటు చేశారని చెప్పారు. స్పీకర్ నిర్ణయంపై బీఆర్‌ఎస్ పార్టీ అడ్డగోలుగా మాట్లాడుతున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్యాన్ని నమ్ముతుందని, రాజ్యాంగ స్ఫూర్తితో ముందుకెళ్తున్నదని అన్నారు. పీఏసీ చైర్మన్‌గా నియమితులైన వ్యక్తి.. తాను స్వయంగా బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యేనని చెప్పారని అన్నారు. అయితే బీఆర్‌ఎస్ పార్టీ సూచించిన మూడు పేర్లు కాకుండా మరో వ్యక్తిని నియమించారనే ఆరోపణలపై మంత్రి సమాధానాన్ని దాటవేశారు.

వస్తామంటే.. వద్దంటామా!

ఇతర పార్టీల ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లోకి వస్తామంటే రావొద్దని అంటామా అని మంత్రి శ్రీధర్‌బాబు ప్రశ్నించారు. తమ పార్టీలోకి ఎవరు వచ్చినా ఆహ్వానిస్తామని స్పష్టం చేశారు. గతంలో కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరిన ఎమ్మెల్యేలను రాళ్లతో కొట్టాలంటూ కాంగ్రెస్ నేతలు పిలుపునిచ్చారని, మరి ఇప్పుడు బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరే ఎమ్మెల్యేలకు కూడా అదే వర్తిస్తుందా అని ప్రశ్నించగా.. అభివృద్ధి కోసం వస్తుంటే రాళ్లతో ఎందుకు కొట్టాలని ఎదురు ప్రశ్నించారు.



పార్టీ ఫిరాయింపులను నేను తీవ్రంగా వ్యతిరేకిస్తా. దానం నాగేందర్‌పై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఇచ్చిన వినతిపత్రాన్ని కార్యదర్శికి పంపించా. దానిపై త్వరలోనే చర్యలు తీసుకుంటాను. ప్రజాస్వామ్యంలో ప్రజల తీర్పును బట్టి ఓ పార్టీ నుంచి గెలిచిన తర్వాత ఆ వ్యక్తి ఆ పార్టీకే అండగా ఉండాలని భావించే వ్యక్తిని నేను. స్పీకర్ హోదాలో ప్రజాస్వామ్యాన్ని కాపాడే దిశగా నా ప్రయత్నం ఉంటది.

-జూలై మొదటి వారంలో ఓ యూట్యూబ్ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్



'రాజ్యాంగంలోని పదో షెడ్యూలు ప్రకారం శాసనసభ స్పీకర్ వ్యవస్థ.. ఒక ట్రైబ్యునల్ (న్యాయ ప్రాధికార సంస్థ) వంటిది. అందువల్ల ఫిరాయించిన ఎమ్మెల్యేలపై దాఖలైన పిటిషన్ల మీద వారు నిర్ణీత సహేతుక కాల వ్యవధిలో నిర్ణయం తీసుకోవడం తప్పనిసరి. కొన్ని అసాధారణ సందర్భాలను మినహాయిస్తే, నిర్ణీత సహేతుక కాల వ్యవధి అంటే, అనర్హత దరఖాస్తు ఇచ్చిన తర్వాత గరిష్ఠంగా మూడు నెలల లోపలే నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది! నిబంధనలను ఉల్లంఘించి పార్టీ ఫిరాయించిన వారిపై పదో షెడ్యూలు మేరకు అనర్హత వేటు వేసి, రాజ్యాంగాన్ని సక్రమంగా అమలు చేయాలంటే, స్పీకర్ మూడు నెలల్లోపు నిర్ణయం తీసుకోవడం తప్పనిసరి.'

-మహారాష్ట్ర గవర్నర్, తదితరులపై కేసులో చీఫ్ జస్టిస్ చంద్రచూడ్, జస్టిస్ షా, జస్టిస్ కృష్ణమురారి, జస్టిస్ హిమాకోహ్లి, జస్టిస్ నర్సింహతో కూడిన ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం.. మే 11, 2023న వెలువరించిన తీర్పు

'రాజ్యాంగంలోని పదో షెడ్యూల్‌లో పేర్కొన్న నిబంధనల ప్రకారం, ఒక సభ్యుడి అనర్హతపై స్పీకర్ సత్వర నిర్ణయం తీసుకోవడానికి న్యాయ వ్యవస్థ జోక్యం చేసుకోవాలనుకుంటే కచ్చితంగా చేసుకోవచ్చు. స్పీకర్ నిర్ణయాలపై న్యాయ సమీక్షను కిహోటో హోలోహన్ కేసు తీర్పు (1992)లోని 110, 111 పేరాలు ఏవిధంగానూ అడ్డుకోవడం లేదు. అనర్హతపై స్పీకర్ తుది నిర్ణయం తర్వాత న్యాయ సమీక్షకు కచ్చితంగా అవకాశం ఉన్నది. ఒకవేళ స్పీకర్ తాత్కాలిక అనర్హత, లేదా సస్పెన్షన్ చర్యలు తీసుకుంటే, కోర్టు కూడా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వవచ్చు'

-మణిపూర్ అసెంబ్లీ స్పీకర్ తదితరులపై కైషమ్ మేఘచంద్రసింగ్ వేసిన కేసులో జస్టిస్ ఆర్‌ఎఫ్ నారిమన్, జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ రామసుబ్రమణ్యంతో కూడిన ధర్మాసనం 2020 జనవరి 21న వెలువరించిన తీర్పు

హైకోర్టు తీర్పు కాంగ్రెస్‌కు చెంపపెట్టు

- రాష్ట్రంలో ఇందిరా కాంగ్రెస్ వర్సెస్ ఆర్‌ఆర్ కాంగ్రెస్
- పీఏసీ చైర్మన్ అనైతిక ఎంపికకు తాము వ్యతిరేకం
- బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



హైదరాబాద్, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ): పార్టీ ఫిరాయింపులపై హైకోర్టు ఇచ్చిన తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిదని బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి చెప్పారు. హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. పార్టీ ఫిరాయింపునకు పాల్పడిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని గతంలో తాము పిటిషన్ వేశామని, దీనిపై హైకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని తెలిపారు. అనర్హత పిటిషన్లను వెంటనే స్పీకర్ ముందుంచాలని, నాలుగు వారాల్లోగా షెడ్యూల్ నిర్ణయించాలని స్పీకర్ కార్యదర్శిని ఆదేశించడం చరిత్రాత్మకమని చెప్పారు. హైకోర్టు తీర్పును మంత్రి పొన్నం ప్రభాకర్ స్వాగతించడం మంచి పరిణామమని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే దృష్టికి సీఎం రేవంత్‌రెడ్డి తీసుకెళ్లి తీర్పును గౌరవించేలా చొరవ చూపాలని సూచించారు. రేవంత్‌రెడ్డి పీసీసీ చీఫ్‌గా ఉన్నప్పుడు ఎమ్మెల్యేలు పార్టీ మారితే వారిండ్ల ముందు చావు డప్పు కొట్టమన్నారని, ఇప్పుడు ఆయనే అనైతికంగా ఇతర పార్టీ ఎమ్మెల్యేలను చేర్చుకుంటున్నారని, ఇది ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రాష్ట్రంలో నేతలు ఇందిరా కాంగ్రెస్, ఆర్‌ఆర్ కాంగ్రెస్‌గా విడిపోయారని, ఆర్‌ఆర్ కాంగ్రెస్‌కు ఏఐసీసీకి మధ్య సమన్వయలోపం నెలకొన్నదని చెప్పారు. పార్టీ ఫిరాయింపులకు పాల్పడే ఎమ్మెల్యేలను అసెంబ్లీ సభ్యత్వానికి అనర్హత వేటు వేస్తామని కాంగ్రెస్ మ్యానిఫెస్టోలోనే హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. ఇందిరా కాంగ్రెస్ నిర్ణయాలు అర్‌అర్ కాంగ్రెస్ అమలు చేయదా? అని ప్రశ్నించారు. పీఏసీ చైర్మన్ విషయంలోనూ సంప్రదాయాలకు విరుద్ధంగా పనిచేశారని విమర్శించారు. ఇతర పార్టీలో గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేను పీఏసీ చైర్మన్‌గా నియమించడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. పార్టీ మారిన మొత్తం 10 మంది ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రేవంత్ పదవి దినదినగండం

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పదవి దినదిన గండంగా మారిందని మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. పీసీసీ అధ్యక్ష పదవి ఆయన చెప్పిన వారికి ఇవ్వలేదని, హైకోర్టు తీర్పుపై మంత్రి పొన్నం వ్యాఖ్యలతో మంత్రులకు సీఎంకు మధ్య గ్యాప్ ఉందన్న విషయం బయటపడిందని తెలిపారు. ప్రభుత్వ పెద్దలు ప్రజలకిచ్చిన హామీలను, వరద బాధితులకు సాయం వదిలేసి, కలెక్షన్ల బిజీలో ఉన్నారని ఎద్దేవా చేశారు. ఆర్ ట్యాక్స్, ఆర్‌ఆర్ ట్యాక్స్, ఆర్‌ఆర్‌ఆర్ ట్యాక్స్, బీ ట్యాక్స్, యూ ట్యాక్స్ ఇలా కలెక్షన్లలో మునిగితేలుతున్నారని మండిపడ్డారు. హైడ్రా ఆరంభ శూరత్వమేనని, కావాలనే హైడ్రా కోరలను సీఎం పీకేశారని విమర్శించారు. కుటుంబ ఒత్తిళ్లు, ఒవైసీకి భయపడి హైడ్రాపై సీఎం వెనక్కి తగ్గారని, హైడ్రా వెనుక రూ.వందల కోట్లు చేతులు మారుతున్నాయని ఆరోపించారు.

ఇంకా చాలా బెంచ్‌లు ఉన్నాయి

- హైకోర్టు తీర్పుపై న్యాయ నిపుణులతో చర్చిస్తాం
- ఉపఎన్నికలు వస్తాయో లేదో తెలియదు: కడియం



స్టేషన్ ఘన్‌పూర్, సెప్టెంబర్ 10: పార్టీ ఫిరాయింపుల విషయమై హైకోర్టు ఇచ్చిన తీర్పుపై న్యాయ నిపుణులతో చర్చిస్తున్నట్టు స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. హైకోర్టు ఇచ్చిన తీర్పుతో అయిపోలేదని, ఇంకా బెంచ్‌లు ఉన్నాయని పేర్కొన్నారు. మంగళవారం ఆయన జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌లో మీడియాతో మాట్లాడుతూ హైకోర్టు తీర్పును గౌరవిస్తామని అన్నారు. న్యాయ నిపుణుల సలహాల మేరకు భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు. గతంలో సుప్రీం కోర్టు రెండు రకాల తీర్పు ఇచ్చిందని, హైకోర్టు, సుప్రీం కోర్టులు భిన్నమైన తీర్పులు ఇచ్చినట్టు తెలిపారు. హైకోర్టు తీర్పుతో ఏదో అయిపోయిందని, అప్పుడే ఉపఎన్నిక వచ్చినట్టుగా కొందరు సంబురాలు చేసుకోవడం సరికాదని, అసలు ఉప ఎన్నికలు వస్తాయో లేదో తెలియదని అన్నారు. హైకోర్టు సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పు కాపీలు ఇంకా తమకు అందలేదని పేర్కొన్నారు.



మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి తన పుట్టినరోజు సందర్భంగా మంగళవారం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా కేసీఆర్.. మల్లారెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

మహిళాశక్తికి ప్రతీక ఐలమ్మ: కేసీఆర్

హైదరాబాద్, సెప్టెంబర్ 10(నమస్తేతెలంగాణ): తెలంగాణ మహిళా శక్తికి, బహుజనుల ధీరత్వానికి ప్రతీక చిట్యాల ఐలమ్మ అని మాజీ సీఎం కేసీఆర్ అభివర్ణించారు. మంగళవారం ఐలమ్మ వర్ధంతి సందర్భంగా కేసీఆర్ ఒక ప్రకటనలో ఆమెను స్మరించుకున్నారు. ఐలమ్మ పోరాట స్ఫూర్తితోనే ఉద్యమించి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని పేర్కొన్నారు. ప్రజావ్యతిరేక పాలనపై ధిక్కారాన్ని ప్రకటించిన ఐలమ్మ జీవితం ఆదర్శనీయమన్నారు. ఆమె జయంతి, వర్ధంతిని బీఆర్ఎస్ హయాంలో అధికారికంగా నిర్వహించి గౌరవించిందని గుర్తుచేశారు.

ప్రజా ఉద్యమాలకు స్ఫూర్తి ఐలమ్మ: కేటీఆర్

భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి నుంచి విముక్తి కోసం చాకలి ఐలమ్మ చేసిన పోరాటం ఎన్నో ప్రజా ఉద్యమాలకు స్ఫూర్తిదాయకమని కేటీఆర్ అన్నారు. ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. ఐలమ్మ పోరాట స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు అందించాలనే ఉద్దేశంతో తెలంగాణ ఏర్పడిన తర్వాత కేసీఆర్ ప్రత్యేక చొరవతో ఆమె జీవిత చరిత్రను పాఠశాల విద్యలో పాఠ్యాంశంగా చేర్చారన్నారు. పాలకుర్తి మార్కెట్ యార్డుకు ఐలమ్మ పేరు పెట్టారని పేర్కొన్నారు.

పెంట్లవెల్లి రైతుల గోడు తీర్చండి!

- పెంట్లవెల్లి పరిధిలో ఒక్కరికీ కాని రుణమాఫీ
- ముఖ్యమంత్రి మాటలు పచ్చి బూటకం
- పావుశాతం కూడా చేయకుండా వందశాతం చేశామంటూ పోజులు
- గురుకులాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయండి : కేటీఆర్



హైదరాబాద్, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ): రుణమాఫీ పూర్తి చేశామని గొప్పలు చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి మాటలు బూటకమని చెప్పడానికి పెంట్లవెల్లి రైతుల గోసే సజీవ సాక్ష్యమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. నాగర్ కర్నూలు జిల్లాలోని పెంట్లవెల్లిలో ఉన్న 499 మంది రైతుల్లో ఒక్కరికీ రుణమాఫీ కాకపోవడం పచ్చిమోసం కాక మరేమిటని మంగళవారం ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. డిసెంబర్ నుంచి ఆగస్టు 15 వరకు డెడ్‌లైన్లు పెట్టిన సీఎం.. నేటివరకూ వీరికి రుణమాఫీ ఎందుకు కాలేదో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. పావుశాతం కూడా మాఫీ చేయకుండా వందశాతం అయిపోయినట్టు ముఖ్యమంత్రి పోజులు కొడుతున్నారని విమర్శించారు. ఆయనకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే వెంటనే పెంట్లవెల్లి రైతుల రుణాలను మాఫీ చేసి వారి గోడు తీర్చాలని డిమాండ్ చేశారు. మరోవైపు గురుకులాల్లో విద్యార్థులు వరుసగా అస్వస్థతకు గురవుతున్న నేపథ్యంలో గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని కేటీఆర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత రెండు రోజుల్లో సిర్పూర్‌లో 35 మంది గురుకుల విద్యార్థులు జ్వరాలబారిన పడ్డారని ఎక్స్ వేదికగా ఆందోళన వ్యక్తం చేశారు. బాగాలేని విద్యార్థులను తల్లిదండ్రుల వద్దకు పంపి చేతులు దులుపుకోవడం అంటే బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడమేనని పేర్కొన్నారు. ఇంత జరుగుతున్నా సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం కనీసం స్పందించడం లేదని ధ్వజమెత్తారు.

మంచినీటినీ వదలని జూటా కాంగ్రెస్

కాంగ్రెస్ ఇచ్చిన హామీలను గాలికొదిలి, బీఆర్ఎస్ పథకాలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రతాపం చూపుతుందని కేటీఆర్ పేర్కొన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో పేదోడి బతుకు ఆగమాగమైందని విమర్శించారు. తాము ప్రకటించిన గృహజ్యోతికి తూట్లు పొడిచిన కాంగ్రెస్, ఇప్పుడు బీఆర్ఎస్ అమలు చేసిన 20 వేల లీటర్ల ఉచిత మంచినీటి పథకంపై కుట్రలు చేయడం సిగ్గుచేటని పేర్కొన్నారు. ఒకవైపు రుణమాఫీ కాలేదంటూ రుణాలు చెల్లించాలని రైతులకు నోటీసులు, మరోవైపు నిరుపేదల ఇండ్లకు హైడ్రా నోటీసులు, ఇప్పుడు నల్లా బిల్లులంటూ డోర్లకు బిల్లులు అతికియ్యడం ఏమిటని ప్రశ్నించారు.

రుణమాఫీ చేయలేదని నిర్బంధం

చందుపట్ల పీఏసీఎస్ పాలకవర్గం, సిబ్బందిని గదిలో బంధించిన బాధిత రైతులు

భువనగిరి కలెక్టరేట్, సెప్టెంబర్ 10 : రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం చందుపట్ల పీఏసీఎస్ పాలకవర్గం, సిబ్బందిని అఖిలపక్షం ఆధ్వర్యంలో రైతులు నిర్బంధించారు. భువనగిరి మండలంలోని చందుపట్ల పీఏసీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం చందుపట్ల రైతువేదికలో రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి బ్యాంకు పరిధిలోని ఎనిమిది గ్రామాల రైతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా తమకు రుణమాఫీ ఎందుకు కాలేదని రైతులు పాలకవర్గాన్ని నిలదీశారు. ఈ క్రమంలో రైతులు ఆగ్రహానికిలోనై పాలకవర్గ సభ్యులను, బ్యాంకు సిబ్బందిని గదిలో వేసి తాళం వేశారు. రుణమాఫీపై స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ అంజిరెడ్డి రైతువేదిక వద్దకు వచ్చి రుణమాఫీపై హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.



రైతులు తాళం వేసిన గదిలో పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మీనర్సింహారెడ్డి, పాలకవర్గ సభ్యులు

లోకం పోకడ



దేశవ్యాప్తంగా మేఘాలు కమ్మేసి జోరుగా వర్షాలు కురుస్తుంటే మణిపూర్ మంటలతో భగ్గుమంటున్నది!

వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఖమ్మం	32.0°c	24.0°c
వరంగల్	31.0°c	25.0°c
ఆదిలాబాద్	30.2°c	23.5°c
నల్లగొండ	30.0°c	22.4°c
కరీంనగర్	30.0°c	26.0°c
మహబూబ్‌నగర్	29.3°c	22.4°c
హైదరాబాద్	29.0°c	22.0°c
నిజామాబాద్	28.5°c	24.6°c
రంగారెడ్డి	28.5°c	21.7°c
మెదక్	28.4°c	22.0°c

మహిళా వర్సిటీకి చాకలి ఐలమ్మ పేరు

ఐలమ్మ మనుమరాలికి మహిళా కమిషన్‌లో చోటు • ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ)/ రవీంద్రభారతి : కోఠి మహిళా యూనివర్సిటీకి చాకలి ఐలమ్మ పేరు పెడతామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. రవీంద్రభారతిలో మంగళవారం నిర్వహించిన చాకలి ఐలమ్మ వర్ధంతి సభ లో సీఎం పాల్గొని ప్రసంగించారు. తెలంగాణ సాయుధ పోరాటంలో ఐలమ్మ చరిత్ర మరువలేనిదని, ఐలమ్మ స్ఫూర్తితో భూములను కాపాడుతున్నామన్నారు. ఆమె మనుమరాలు శ్వేతను తెలంగాణ మహిళా కమిషన్ సభ్యురాలిగా నియమిస్తున్నట్టు ప్రకటించారు. అనంతరం ఐలమ్మ కుటుంబసభ్యులను సీఎం రేవంత్‌రెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్‌గౌడ్, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా గత కేసీఆర్ సర్కారు 2022-23లో కోఠి మహి ళా కాలేజీని వర్సిటీగా అప్‌గ్రేడ్ చేసి 'తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం' పేరును ఖరారు చేసి, 100 కోట్ల నిధులను ప్రకటించింది. రెం డేండ్లుగా వర్సిటీ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. తాజాగా ఐల మ్మ పేరును పెడతామని సీఎం ప్రకటించారు. తెలుగు వర్సిటీ పేరు మార్పుపైనా ఊహాగానాలు వెలువడుతున్నాయి.



ఐలమ్మ మనుమరాలితో సీఎం రేవంత్‌రెడ్డి

సర్కారు తప్పిదం.. ఇద్దరు రైతులకు శాపం

- వేర్వేరు గ్రామాలు, కులాల రైతులకు ఒకే ఫ్యామిలీ ఐడీ
- 67 వేలు, 1.67 లక్షల రుణాలున్నా మాఫీ కాని వైనం
- ఇద్దరినీ ఒకే కుటుంబంగా ఎలా చూపుతారంటూ గగ్గోలు

చింతకాని, సెప్టెంబర్ 10: సర్కారు తప్పిదం.. ఇద్దరు అన్నదాతలకు శాపంగా మారింది. ఫలితంగా రైతు రుణమాఫీ వారికి అందని ద్రాక్షగానే మిగిలింది. ప్రభుత్వం తెచ్చిన ప్రత్యేక సాఫ్ట్‌వేర్ తికమకలతో ఇలా ఎందరో రైతులు రుణమాఫీకి దూరమయ్యారు. నక్కనబోయిన వలరాజుది ఖమ్మం జిల్లా చింతకాని మండలం కొదుమూరు. గురజాల రామారావుది లచ్చగూడెం. చింతకాని మండలంలోని బస్వాపురం యూనియన్ బ్యాంక్‌లో వలరాజుకు రుణఖాతా నంబర్ 1353లో రూ.67,878 పంట రుణం ఉన్నది. గురజాల రామారావుకూ అదే యూనియన్ బ్యాంక్‌లో రుణఖాతా నంబర్ 1335లో రూ.1,67,237 పంట రుణం ఉన్నది. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఇద్దరూ రుణమాఫీకి అర్హులే. కానీ మూడు విడతలు ముగిసి కాలం గడిచిపోతున్నా ఇద్దరికీ రుణమాఫీ కాలేదు. దీంతో బ్యాంకు అధికారుల చుట్టూ తిరిగి విసిగి వేసారిన ఇద్దరూ వ్యవసాయ అధికారులను సంప్రదించారు. అక్కడే అసలు విషయం వెలుగులోకి వచ్చింది. కొదుమూరు రైతు వలరాజు రేషన్ కార్డులో రామారావు పేరు కూడా ఉన్నదని, ఇద్దరూ ఒకే కుటుంబ సభ్యులుగా ఉన్నట్టు డేటా చూపిస్తున్నదని, ఇద్దరి రుణమా కలిపి 2 లక్షలు దాటినందున రుణమాఫీ జరగలేదని ఆఅధికారి చెప్పారు. దీంతో ఇద్దరూ కంగుతిన్నారు. తమవి వేర్వేరు గ్రామాలని, తాము వేర్వేరు సామాజికవర్గాలకు చెందినవాళ్లమని సదరు అధికారికి వివరించారు. సాంకేతికలోపం వల్ల ఇలా జరిగిందని ఆయన వారికి సమాధానం ఇచ్చారు.

రేషన్ కార్డులో నాపేరే లేదు



రుణమాఫీ జాబితాలో నా పేరు లేకపోవడంతో ఏఈవోను కలిశాను. ఆయన చెప్పిన విషయం విని ఆశ్చర్యపోయా. నాకుటుంబ రేషన్ కార్డులో నా పేరేలేదు. వేరే కార్డులో ఎలాఉందో అర్థం కావడం లేదు.

–గురజాల రామారావు, రైతు, లచ్చగూడెం

పొరపాట్లు ఇప్పటికైనా సరిదిద్దాలి



ఏఈవో అడిగిన పత్రాలన్నీ 20 రోజుల క్రితమే ఇచ్చాను. అయినా ఇంత వరకూ నాకు రుణమాఫీ కాలేదు. సరిదిద్ది రుణమాఫీని వర్తింపజేయాలి.

–నక్కనబోయిన వలరాజు, రైతు, కొదుమూరు

రాష్ట్రంలో కొనసాగుతున్న అల్పపీడన ప్రభావం


మరో 2 రోజులు మోస్తరు వర్షాలు

హైదరాబాద్, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ) : వాయువ్య బంగాళాఖాతంలో పూరి వద్ద తీరం దాటిన వాయుగుండం మంగళవారం ఉత్తర ఛత్తీస్‌గఢ్ వద్ద కేంద్రీకృతమైంది. దీని ప్రభావంతో రాష్ట్రంలో మరో రెండు రోజులు మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది. గడిచిన 24 గంటల్లో ములుగు, కుమ్రంభీం-ఆసిఫాబాద్, జయశంకర్-భూపాలపల్లి, భద్రాద్రి-కొత్తగూడెం, పెద్దపల్లి జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిసినట్టు వెల్లడించింది. ములుగు జిల్లా ఏటూరు నాగారంలో అత్యధికంగా 5.12 సెం.మీ., కన్నాయిగూడెంలో 2.81 సెం.మీ., కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాలలో 4.98 సెం.మీ., చింతలమానెపల్లిలో 4.91 సెం.మీ., బెజ్జూర్‌లో 4.29 సెం.మీ., పెంచికల్‌పేటలో 3.20 సెం.మీ., జయశంకర్‌భూపాలపల్లి జిల్లా మలిమెలలో 4.35 సెం.మీ., పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్‌లో 2.84 సెం.మీ చొప్పున వర్షపాతం నమోదైనట్టు పేర్కొంది.

అప్పుల్లో రేవంత్ సర్కార్ రికార్డు

- ఈ ఏడాది జూలైలో 10,392 కోట్ల అప్పు
- తెలంగాణలో అత్యధిక నెలవారీ అప్పు ఇదే
- ఆదాయం కన్నా అప్పే 141 కోట్లు ఎక్కువ
- స్వయంగా కాగ్‌కు నివేదించిన ప్రభుత్వం
- వారం రోజుల్లోనే 4 వేల కోట్ల అప్పులు

హైదరాబాద్, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ): తెలంగాణ చరిత్రలోనే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అరుదైన రికార్డును సృష్టించింది. ఈ ఏడాది జూలైలో ఏకంగా రూ.10,392 కోట్ల అప్పు చేసింది. తద్వారా గత పదేండ్లలో ఎన్నడూ లేనివిధంగా ఒకే నెలలో రూ.10 వేల కోట్లకు పైగా అప్పుతో 'చరిత్ర' సృష్టించింది. ఈ విషయాన్ని స్వయంగా రాష్ట్ర ప్రభుత్వమే కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్)కు నివేదించింది. రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందంటూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తూనే రేవంత్ సర్కారు 'అంతకు మించి' అనే స్థాయిలో ఎడాపెడా అప్పులు చేస్తున్నదనడానికి ఇదే ప్రత్యక్ష నిదర్శనం.



ఆదాయం కన్నా అప్పే ఎక్కువ

రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించిన నివేదిక ప్రకారం.. ఈ ఏడాది జూలైలో వచ్చిన ఆదాయం కంటే రేవంత్‌రెడ్డి సర్కారు తెచ్చిన అప్పే ఎక్కువ. జూలైలో పన్నుల రూపేణా దాదాపు రూ.9,966 కోట్లు, నాన్-ట్యాక్స్ రెవెన్యూ కింద రూ.257 కోట్లు, లోన్లు, అడ్వాన్సుల రికవరీ రూపంలో రూ.3.62 కోట్లు కలిపి రాష్ట్రానికి మొత్తంగా రూ.10,226.46 కోట్ల ఆదాయం వచ్చినట్టు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. కానీ, ఇదే నెలలో ప్రభుత్వం తెచ్చిన అప్పు రూ.10,392.71 కోట్లు. ఈ లెక్కన రాష్ట్రానికి వచ్చిన ఆదాయం కంటే అప్పే రూ.141.13 కోట్లు ఎక్కువ. ఈ ఆర్థిక సంవత్సరంలోని తొలి 4 నెలలను పరిశీలిస్తే జూలైలో రాబడి గణనీయంగా తగ్గినట్టు స్పష్టమవుతున్నది. ఏప్రిల్‌లో రూ.11,821 కోట్లు, మే నెలలో రూ.11,332 కోట్లుగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వ ఆదాయం.. జూన్‌లో రూ.12,465 కోట్లకు పెరిగినట్టు గణాంకాలు చెప్తున్నాయి. దీనితో పోలిస్తే జూలైలో ప్రభుత్వ రాబడి రూ.2,239 కోట్లు, నిరుడు ఇదే సమయంలో వచ్చిన రాబడి కంటే రూ.1,091 కోట్లు తగ్గింది.

ప్రజాపాలనలో రూ.10 వేల కోట్ల మార్క్

బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో అత్యధికంగా ఒకే నెలలో చేసిన అప్పు రూ.9,897 కోట్లు మాత్రమే. 2020 డిసెంబర్‌లో ఆ రుణాన్ని తీసుకున్నది. అయితే ఆ ఏడాది కరోనా విజృంభించడం, లాక్‌డౌన్ తదితర కారణాలతో ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక వ్యవస్థలు స్తంభించాయి. ప్రభుత్వాలకు రాబడి పడిపోయింది. ఈ నేపథ్యంలో అటు ప్రభుత్వ నిర్వహణతోపాటు సంక్షేమ పథకాలను కొనసాగించేందుకు కేసీఆర్ ప్రభుత్వం 2020 డిసెంబర్‌లో భారీగా రుణం తీసుకోవాల్సి వచ్చింది. కానీ, ఈ ఏడాది జూలైలో అలాంటి పరిస్థితులేమీ లేవు. అయినా ప్రజాపాలన పేరుతో రేవంత్‌రెడ్డి సర్కారు ఒకే నెలలో రూ.10 వేల కోట్లకుపైగా అప్పు చేసింది. అయినా ఆ అప్పుతో కొత్త పథకాన్నో, ప్రాజెక్టునో చేపట్టిన దాఖలాలేమీ లేకపోవడం గమనార్హం.

మరో 1,500 కోట్ల అప్పు

బాండ్ల వేలం ద్వారా ఈ నెల 3న రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) నుంచి రూ.2,500 కోట్ల అప్పు తెచ్చిన రాష్ట్ర ప్రభుత్వం.. తాజాగా మంగళవారం మరో రూ.1,500 కోట్ల రుణాన్ని తీసుకున్నది. దీంతో వారం రోజుల్లోనే రూ.4 వేల కోట్ల అప్పు తీసుకున్నట్టయింది. దీంతో గత 9 నెలల్లో రేవంత్‌రెడ్డి సర్కారు ఆర్బీఐ నుంచి తెచ్చిన అప్పులే రూ.46,118 కోట్లకు చేరాయి.

5 నెల్లలోనే సగం అప్పు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ.69,012 కోట్ల అప్పులు తీసుకుంటామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. అందులో బహిరంగ మార్కెట్ నుంచి రూ.57,112 కోట్లు, కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.3,900 కోట్లు, ఇతర రుణాల రూపంలో రూ.1,000 కోట్లు సమీకరించనున్నట్టు బడ్జెట్‌లో వివరించింది. కానీ, ఇప్పటివరకు బాండ్ల వేలం ద్వారా బహిరంగ మార్కెట్ నుంచి రూ.31 వేల కోట్ల రుణాలు సేకరించింది. అంటే ఈ ఏడాది బడ్జెట్‌లో పెట్టుకున్న లక్ష్యంలో సగానికిపైగా అప్పును కేవలం 5 నెలల్లోనే చేసిందన్నమాట. దీంతో మిగతా 7 నెలల్లో రేవంత్ సర్కారు రాష్ట్ర ప్రజల నెత్తిపై ఇంకెంత అప్పుల మూటను పెడుతుందోనని ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

'స్థానికం' వచ్చే ఏడాదే

- బీసీ గణనకు మూడు నెలల గడువు కోరిన ప్రభుత్వం
- ముందే చెప్పిన 'నమస్తే తెలంగాణ'

హైదరాబాద్, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ): స్థానిక సంస్థలు ఎన్నికలు ఈ యేడాది లేనట్లే.. ఎన్నికల నిర్వహణకు కీలకమైన బీసీ రిజర్వేషన్లను ఖరారు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టును మూడు నెలల సమయం అడిగింది. దీంతో ఈ యేడాది స్థానిక సంస్థల ఎన్నికలు లేనట్లేనని స్పష్టమైంది. స్థానిక సంస్థల ఎన్నికలు ఇప్పట్లో సాధ్యం కావని 'నమస్తే తెలంగాణ' ఈనెల 2వ తేదీన కథనం ప్రచురించింది. స్థానిక సంస్థల ఎన్నికలకు ట్రిపుల్ టెస్ట్ ద్వారా బీసీ రిజర్వేషన్లను ఖరారు చేయాలని సుప్రీం కోర్టు గతంలోనే తీర్పు ఇచ్చింది. దీని కోసం ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని సూచించింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ బాధ్యతను బీసీ కమిషన్‌కే అప్పగించింది. అయితే ఈ కమిషన్ గడువు ముగియడంతో కొత్త కమిషన్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం నియమించింది. ఈ కమిషన్ సుప్రీంకోర్టు తీర్పుపై అధ్యయనం చేసి, అవగాహనకు వచ్చి తదుపరి కార్యాచరణను ఖరారు చేయాల్సి ఉంది. ఈ తతంగమంతా పూర్తి చేయడానికి కనీసం 3 నెలల సమయం పడుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. ఇదే విషయాన్ని హైకోర్టుకు తెలిపినట్టు బీసీ సంఘాల నేతలు చెప్తున్నారు. మధ్యలో ఎలాంటి అటంకాలు లేకుండా, వరదలు, విపత్తులు, అనుకొని సంఘటనలు ఏమైనా జరిగితే ఎక్కువ సమయం పట్టే అవకాశం ఉంటుందని అంచనా వేస్తున్నారు.



42 శాతం సాధ్యమయ్యేనా?

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లోక్‌సభ ఎన్నికల సమయంలో జూన్‌లోనే స్థానిక సంస్థల ఎన్నికలు అంటూ ప్రకటన చేశారు. అప్పట్లోనే దీనిపై అనేక అనుమానాలు వ్యక్తమయ్యాయి. కేవలం కాంగ్రెస్ క్యాడర్‌లో ఆశలు కల్పించడానికి, వారు ఆ ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషి చేయించడం కోసమే అలాంటి ప్రకటనలు చేశారని విశ్లేషకులు అంచనా వేశారు. అదిగో ఎన్నికలు, ఇదిగో ఎన్నికలు అంటూ ప్రకటనలు చేస్తూ, లీకులు ఇచ్చారని పార్టీలు విమర్శించాయి. ఎన్నికల పూర్తి ప్రక్రియను ప్రభుత్వం ఇంతవరకు ప్రారంభించలేదు. కీలకమైన బీసీ రిజర్వేషన్లపై ఇంకా స్పష్టమైన వైఖరిని ప్రభుత్వం తీసుకోలేదని బీసీ సంఘాలు ఆరోపిస్తున్నాయి. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో చెప్పిన విధంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలుపై సీఎం రేవంత్ చేతులు ఎత్తేశారని విమర్శిస్తున్నాయి. బీసీలకు 24 శాతం కంటే ఎక్కువగా రిజర్వేషన్లు ఇచ్చే పరిస్థితి లేదని, మిగిలిన 18 శాతాన్ని రాజకీయ పార్టీలుగా టిక్కెట్లు ఇద్దామంటూ కొత్త ప్రతిపాదనను తీసుకవచ్చారని మండిపడుతున్నాయి. జనరల్ సీట్లలో బీసీలకు టిక్కెట్లు ఇచ్చినా ఇతర పార్టీలు ఓసీ అభ్యర్థులను నిలిపితే బీసీల గెలుపు అవకాశాలు దెబ్బ తింటాయని, ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

3 నెలల్లో కులగణన

మొదటిపేజీ తరువాయి...

మంగళవారం నుంచి మూడు నెలల్లోగా పూర్తిచేయాలని స్పష్టం చేసింది. గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ట్రిపుల్ టెస్ట్ ఉద్దేశం కూడా ఇదేనని, ఆ కోణంలోనే సర్వే జరగాలని స్పష్టం చేసింది. ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ ఏ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ 2010లో కృష్ణమూర్తి కేసులో వెలువడిన తీర్పు ప్రకారం స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల కల్పనకు ఆర్థిక, సామాజిక వెనుకబాటుతనాన్ని పరిగణనలోకి తీసుకోరాదని, రాజకీయ వెనుకబాటుతనాన్నే పరిగణనలోకి తీసుకోవాలని చెప్పారు. వికాస్‌కిషన్‌రావు గాప్లీ వర్సెస్ మహారాష్ట్ర కేసులో సుప్రీంకోర్టు చెప్పిన తీర్పులోని 13వ పేరా ప్రకారం.. రాష్ట్రమంతటినీ ఒకే యూనిట్‌గా బీసీ రిజర్వేషన్లు అమలు చేయడానికి వీలు లేదని పేర్కొన్నారు. ఆ తీర్పు మేరకు స్థానిక సంస్థలను యూనిట్‌గా తీసుకొని సర్వే చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఆ వివరాల రిజర్వేషన్లపై నిర్ణ యం తీసుకోవాల్సివుంటుందని అన్నారు. ఈ ప్రక్రియ పూర్తికావడానికి 3నెలల గడువు ఇవ్వాలన్న ప్రభుత్వ వాదనలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు.. మూడు నెలల్లోగా కులగణన నిర్వహించి నివేదిక ఇవ్వాలని ఉత్తర్వులు జారీ చేసింది.

సుప్రీంకోర్టు ఏం చెప్పింది?

వికాస్‌కిషన్‌రావు గాప్లీ వర్సెస్ మహారాష్ట్ర ప్రభుత్వం కేసులో 2021 మార్చి 4న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులోని 13వ పేరాలో... 'మహారాష్ట్ర జిల్లా పరిషత్, పంచాయతీ సమితి చట్టం – 1961లోని సెక్షన్ 12 (2) (సీ) ప్రకారం బీసీ రిజర్వేషన్లు 27 శాతంగా ఉన్నాయి. దీనిని ఏకరీతిగా మొత్తం రాష్ట్రంలోని స్థానిక సంస్థలకు ఒకే తరహాలో అమలు చేయడం సబబు కాదు. అన్ని స్థానిక సంస్థల్లోనూ ఒకే తీరుగా బీసీ రిజర్వేషన్ల అమలు చేయడం సరికాదు. స్థానిక సంస్థల వారీగా బీసీల ఆర్థిక, సామాజిక, రాజకీయ వెనుకబాటుతనాన్ని సర్వే చేయాలి. సమకాలీన పరిస్థితులను శాస్త్రీయంగా, లోతుగా అధ్యయనం చేయాలి. అందుకు అనుగుణంగా ఆయా స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లను అమలు చేయాలి" అని ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనం స్పష్టం చేసింది.

16న ఢిల్లీకి సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్ రెడ్డి మరోసారి ఢిల్లీ బాట పట్టనున్నారు. ఈనెల 16వ తేదీన ఢిల్లీకి వెళ్లనున్నట్టు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. దీంతో 21వ పర్యటన కానున్నది. కొత్త పీసీసీ అధ్యక్షుడిగా మహేశ్ కుమార్ గౌడ్ ప్రమాణం చేసిన తర్వాత.. సీఎం, పీసీసీ అధ్యక్షుడు కలిసి ఢిల్లీ పెద్దలను మర్యాదపూర్వకంగా కలువనున్నట్టు పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న మంత్రివర్గ విస్తరణపై రేవంత్ రెడ్డి స్పష్టత కోరే అవకాశం ఉన్నట్టు తెలుస్తున్నది. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని హైకోర్టు ఇచ్చిన తీర్పుపైనా చర్చించే అవకాశం ఉన్నదని చెప్తున్నారు.

రుణాల రీస్ట్రక్చరింగ్‌కు అవకాశమివ్వండి

- కేంద్ర పన్నుల్లో వాటాను 50 శాతానికి పెంచాలి
- 16వ ఆర్థిక సంఘానికి సీఎం రేవంత్, ఉప ముఖ్యమంత్రి భట్టి సూచన

హైదరాబాద్, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ): అలవిగాని హామీలతో తెలంగాణను అప్పుల ఊబిలోకి నెడుతున్న కాంగ్రెస్ సర్కారు.. ఇప్పుడు ఆ రుణాల రీస్ట్రక్చరింగ్‌కు అవకాశం ఇవ్వాలని లేకుంటే రాష్ట్రానికి అదనపు ఆర్థిక సాయం అందించాలని కేంద్రాన్ని కోరుతున్నది. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క సహా పలువురు ప్రభుత్వ పెద్దలు మంగళవారం ప్రజాభవన్‌లో 16వ ఆర్థిక సంఘం చైర్మన్, సభ్యులతో సమావేశమై మూకుమ్మడిగా ఈ విజ్ఞప్తి చేశారు. కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలకు పంపిణీ చేసే నిధుల వాటాను 41 నుంచి 50 శాతానికి పెంచాలని కోరారు. అన్ని రాష్ట్రాల తరఫున ఈ డిమాండ్‌ను ఆర్థిక సంఘం ముందు పెడుతున్నట్టు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ డిమాండ్‌ను నెరవేర్చితే దేశ ఆర్థిక వ్యవస్థ పరిమాణాన్ని 5 ట్రిలియన్ డాలర్లకు చేర్చాలన్న ప్రధాని నరేంద్రమోదీ లక్ష్యానికి పూర్తిగా సహకరిస్తామని పేర్కొన్నారు. అందుకు సంబంధించిన ప్రతిపాదనలపై కేంద్ర ఆర్థిక సంఘానికి ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. కొన్నేండ్లుగా రాష్ట్రాలతో పంచుకోని సెస్‌లు, సర్‌చార్జీలు పెరిగాయని, మొత్తం స్థూల పన్ను ఆదాయంలో రాష్ట్రాలు తక్కువ వాటాను కలిగి ఉన్నాయని స్పష్టం చేశారు. దేశంలోనే తెలంగాణ వేగంగా అభివృద్ధి చెందుతున్నదని తెలిపారు. దేశ ఆర్థికాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. అనంతరం 16వ ఆర్థిక సంఘం సభ్యులతో కలిసి చైర్మన్ అరవింద్ పనగరియా మీడియాతో మాట్లాడారు. నిర్దిష్ట అభివృద్ధి అవసరాలకు అనుగుణంగా కేంద్ర ప్రాయోజిత పథకాలను (సీఎస్ఎస్) రూపొందించేందుకు అవసరమైన స్వయం ప్రతిపత్తిని రాష్ట్రాలకు కల్పించాలని, అన్ని వర్గాల ప్రజలకు చేరువయ్యేలా కేంద్ర పథకాల్లో మార్పులకు అవకాశం కల్పించాలని 16వ ఆర్థిక సంఘాన్ని తాము కోరినట్టు డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క అంతకు ముందు చెప్పారు.

బీసీ రిజర్వేషన్లను అడ్డుకున్న చరిత్ర కాంగ్రెస్‌దే

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య

ఆర్మూర్‌టౌన్, సెప్టెంబర్ 10: కాంగ్రెస్ పార్టీ చేసిన కామారెడ్డి డిక్లరేషన్ అమలు కోసం బీసీలంతా పోరాడాలని, కాంగ్రెస్ పార్టీ కళ్లు తెరిపించడానికి మిలిటెంట్ ఉద్యమాలకు సిద్ధం కావాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్ కృష్ణయ్య పిలుపునిచ్చారు. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో మంగళవారం నిర్వహించిన 'బీసీ సదస్సు'లో రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులుతో కలిసి ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాజ్యాంగబద్ధమైన రిజర్వేషన్ల కోసం వెనుకబడిన వర్గాలంతా ఉద్యమాలకు సిద్ధం కావాలని, పోరాటాలతోనే రాజ్యాధికారం సాధ్యమవుతుందని చెప్పారు. దేశవ్యాప్తంగా కుల గణన చేయక పోవడం వల్ల బీసీలు భారీగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీల జనాభా 50 శాతానికిపైగా ఉన్నా రిజర్వేషన్లు కల్పించడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయని మండిపడ్డారు. జనాభా ప్రకారం న్యాయమైన వాటా దక్కాలంటే సమగ్ర కుల గణన ఒక్కటే మార్గమని తెలిపారు. కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు చేయడానికి రేవంత్‌రెడ్డికి వచ్చిన నష్టమేమిటని ప్రశ్నించారు. మండల్ కమిషన్ రిపోర్టును బుట్టదాఖలు చేశారని, నాటి ప్రధానులు నెహ్రూ, ఇందిరాగాంధీ రిజర్వేషన్లు అడ్డుకోవడంతో ఓబీసీలు భారీగా నష్టపోయారని తెలిపారు. మరోసారి బీసీలను మోసం చేసేందుకు కాంగ్రెస్ కుట్ర పన్నిందని విమర్శించారు. సమగ్ర కులగణన లేకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే రాష్ట్రం అగ్నిగుండం అవుతుందని హెచ్చరించారు. ఈ సదస్సులో హిందు బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల సిద్దేశ్వర్, సోషల్ జస్టిస్ పార్టీ జాతీయ కన్వీనర్ పిడికిలి రాజు, టీ-జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల కృష్ణ, తెలంగాణ బీసీ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామ్మూర్తిగౌడ్, ఓబీసీ జేఏసీ చైర్మన్ అన్వర్ వేణుకుమార్, అంబేద్కర్ ఆజాదీ సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు కొంగర నరహరి, కుల సంఘాల నాయకులు దేగాం యాదగౌడ్, కోటగిరి రామగౌడ్ పాల్గొన్నారు.



మంగళవారం ఆర్మూర్‌లో జరిగిన బీసీ సదస్సులో పాల్గొన్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య, రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులు, బీసీ నేత రాజారాం యాదవ్ తదితరులు



ప్రిక్వార్టర్స్‌కు త్రిసా-గాయత్రి ద్వయం

హాంకాంగ్: భారత యువ షట్లర్లు త్రిసా జాలీ-గాయత్రి గోపీచంద్ ద్వయం హాంకాంగ్ బ్యాడ్మింటన్ టోర్నీ ప్రిక్వార్టర్స్‌కు చేరింది. బ్యాడ్మింటన్ వరల్డ్ ఫెడరేషన్ (బీడబ్ల్యూఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరల్డ్ టూర్ సూపర్-500 ఈవెంట్‌లో భాగంగా జరుగుతున్న ఈ టోర్నీలో భాగంగా జాలీ-గాయత్రి జోడీ 21-14, 21-14తో పోలిన బుగ్రోవ-యెవ్జెనియ కంటెమిర్(ఉక్రెయిన్)ను ఓడించి ప్రిక్వార్టర్స్ చేరింది. అయితే పురుషుల సింగిల్స్‌లో క్వార్టర్స్ చేరిన మానవ్ చౌదరి, చిరాగ్ సేన్ ఓటములతో టోర్నీ నుంచి నిష్క్రమించారు.

నేటి నుంచి చెస్ ఒలింపియాడ్

బుడాపెస్ట్: ప్రతిష్ఠాత్మక 45వ చెస్ ఒలింపియాడ్‌కు బుధవారం నుంచి తెరలేవనుంది. కచ్చితంగా పతకం సాధిస్తారన్న అంచనాల మధ్య భారత ప్లేయర్లు ఈసారి బరిలోకి దిగుతున్నారు. మహిళల విభాగంలో హారిక, వైశాలి, దివ్యాదేశ్‌ముఖ్, వంతిక అగర్వాల్ భారత్ తరఫున టాప్‌సీడ్‌లుగా పోటీపడుతున్నారు. మరోవైపు ఓపెన్ కేటగిరీలో గుకేశ్, అర్జున్, విదిత్, హరికృష్ణ రెండో సీడ్‌గా ఆడనున్నారు.

చాహల్ జోరు

నార్తాంప్టన్: టీమ్‌ఇండియా స్టార్ లెగ్ స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్ కౌంటీ క్రికెట్‌లో అదరగొడుతున్నాడు. ఇంగ్లండ్ కౌంటీ చాంపియన్‌షిప్‌లో భాగంగా నార్తాంప్టన్‌షైర్‌కు ఆడుతున్న చాహల్.. డెర్బీషైర్‌తో జరిగిన మ్యాచ్ లో ఐదు వికెట్లు (5/45)తో అదరగొట్టాడు. గత నెలలో కెంట్‌తో జరిగిన మ్యాచ్‌లోనూ యుజీ ఐదు వికెట్ల (5/14) ప్రదర్శన చేశాడు. మొదట బ్యాటింగ్ చేసిన నార్తాంప్టన్‌షైర్ ఫస్ట్ ఇన్నింగ్స్‌లో 219 పరుగులకు ఆలౌట్ అయింది. తర్వాత చాహల్ స్పిన్ మాయతో డెర్బీషైర్ 165 పరుగులకే ఆలౌట్ అయింది.

'పారా' విజేతలకు నజరానా

స్వర్ణం గెలిచిన వారికి రూ.75 లక్షలు • చెక్కులు అందజేసిన కేంద్ర క్రీడాశాఖ మంత్రి



ఢిల్లీ: పారిస్ వేదికగా ఇటీవలే ముగిసిన పారాలింపిక్స్‌లో స్వర్ణ, రజత, కాంస్య పతకాలు సాధించిన విజేతలకు కేంద్ర ప్రభుత్వం నగదు పురస్కారాలు ప్రకటించింది. ఈ క్రీడలలో భారత్ తరఫున బంగారు పతకం సాధించినవారికి రూ. 75 లక్షలు, వెండి వెలుగులు పంచినవారికి రూ. 50 లక్షలు, కాంస్యంతో మెరిసిన క్రీడాకారులకు రూ. 25 లక్షల నజరానా ప్రకటించింది. మిక్స్‌డ్ ఈవెంట్స్‌లో పతకాలు గెలిచిన ఆర్చర్లు రాకేశ్ కుమార్, శీతల్ దేవీకి తలా రూ. 22.5 లక్షల చొప్పున దక్కనుంది. ఈ మేరకు ఢిల్లీలో తనను కలిసిన పలువురు పారా అథ్లెట్స్‌ను సన్మానించిన అనంతరం కేంద్ర క్రీడాశాఖ మంత్రి మన్సూఖ్ మాండవీయ వారికి చెక్కులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాండవీయ మాట్లాడుతూ.. 'పారాలింపిక్స్‌లో భారత్ క్రమంగా పుంజుకుంటోంది. 2016లో 4 మెడల్స్ గెలిచిన దేశం.. టోక్యోలో 19 పతకాలు సాధించింది. తాజాగా దానిని 29కు చేర్చి పతకాల పట్టికలో 18వ స్థానంలో నిలిచింది. పారా అథ్లెట్ల కోసం కేంద్ర ప్రభుత్వం అన్ని వసతులూ కల్పిస్తోంది. 2028 లాస్‌ఏంజెల్స్ వేదికగా జరుగబోయే పారాలింపిక్స్‌లో మరిన్ని పతకాలు సాధిస్తాం' అని అన్నారు. పారాలింపిక్స్‌లో భారత్‌కు 7 స్వర్ణాలు, 9 రజతాలు, 13 కాంస్యాలు దక్కిన విషయం (మొత్తం 29) తెలిసిందే.

వీరులకు ఘనస్వాగతం

పారాలింపిక్స్‌లో పాల్గొని పతకాల పంట పండించిన భారత పారా అథ్లెట్లు తిరిగి స్వదేశానికి చేరుకున్నారు. ఆదివారం నాటికి ఈ క్రీడలు ముగిసిన తర్వాత అక్కడ మిగిలిపోయిన భారత బృందం మంగళవారం ఢిల్లీకి చేరుకుంది. ఈ సందర్భంగా క్రీడాకారులకు ఘన స్వాగతం లభించింది. ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి వందలాదిగా చేరుకున్న అభిమానులు.. అథ్లెట్లపై పూలు చల్లుతూ, స్వీట్లు తినిపించుకుంటూ వారికి శుభాకాంక్షలు తెలిపారు. పతక విజేతలతో కలిసి సెల్ఫీలు దిగారు. స్వదేశానికి చేరుకున్న వారిలో సుమిత్ అంటిల్, హర్విందర్ సింగ్, శీతల్ దేవీ, నవ్‌దీప్ వంటివాళ్లు ఉన్నారు.



వ్రితికి రజతం

జాతీయ సీనియర్ స్విమ్మింగ్ టోర్నీ

మంగళూరు: మంగళూరు(కర్ణాటక) వేదికగా జరుగుతున్న 77వ జాతీయ సీనియర్ అక్వాటిక్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో రాష్ట్ర యువ స్విమ్మర్ వ్రితి అగర్వాల్ రజత పతకంతో మెరిసింది. మంగళవారం జరిగిన మహిళల 400మీటర్ల ఫ్రీస్టయిల్ రేసులో వ్రితి 4:25:09 సెకన్ల టైమింగ్‌తో రెండో స్థానంలో నిలిచింది. ఇప్పటికే జాతీయ స్థాయిలో లెక్కకు మిక్కిలి పతకాలు సాధించిన వ్రితి..అదే దూకుడు కొనసాగిస్తున్నది. ఇదే విభాగంలో పోటీపడ్డ హర్షిత రామచంద్ర(కర్ణాటక), భవ్య సచ్‌దేవ(ఢిల్లీ) వరుసగా స్వర్ణ, కాంస్య పతకాలు దక్కించుకున్నారు.

హైదరాబాద్‌కు భారీ ఆధిక్యం

హైదరాబాద్, ఆట ప్రతినిధి: దిండిగల్(తమిళనాడు) వేదికగా జరుగుతున్న బుచ్చిబాబు ఇన్విటేషన్ క్రికెట్ టోర్నీ ఫైనల్లో హైదరాబాద్ భారీ ఆధిక్యం(517) దిశగా దూసుకెళుతున్నది. అనికేత్‌రెడ్డి (4/56), రోహిత్‌రాయుడు (3/36) ధాటికి చత్తీస్‌గఢ్ తొలి ఇన్నింగ్స్‌లో 181 పరుగులకు కుప్పకూలింది. దీంతో 236 పరుగుల ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్‌కు దిగిన హైదరాబాద్‌ను జీవేశ్ (6/56) ధాటికి 281 పరుగులకు ఆలౌటైంది. రాహుల్‌సింగ్(68) అర్ధసెంచరీతో ఆకట్టుకున్నాడు. ఓవరాల్‌గా హైదరాబాద్ మ్యాచ్‌పై పట్టు కొనసాగిస్తున్నది.

చెన్నైలో ఐఆర్‌ఎల్ రేసింగ్



న్యూఢిల్లీ: రేసింగ్ ప్రియులను అలరించేందుకు మద్రాస్ ఇంటర్నేషనల్ సర్క్యూట్ మళ్లీ సిద్ధమైంది. ఇండియన్ రేసింగ్ ఫెస్టివెల్(ఐఆర్‌ఎఫ్)లో భాగంగా ఈనెల 14, 15 తేదీల్లో ఇండియన్ రేసింగ్ లీగ్(ఐఆర్‌ఎల్), ఫార్ములా-4 ఇండియన్ చాంపియన్‌షిప్(ఎఫ్4ఐసీ) మూడో రౌండ్ పోటీలు జరుగనున్నాయి. గత వారం చెన్నైలో నైట్ స్ట్రీట్ సర్క్యూట్ రేసును విజయవంతంగా నిర్వహించిన ఉత్సాహంతో మూడో రౌండ్‌లో ఆరు జట్లకు చెందిన రేసర్లు అలరించేందుకు సిద్ధమవుతున్నారు. 3.7కి.మీ కల్గి ఉన్న మద్రాస్ ఇంటర్నేషనల్ సర్క్యూట్‌లో ఇప్పటికే జరిగిన రెండు రౌండ్లలో జాన్ లాంకస్టర్, అలిస్టర్ యంగ్ విజేతలుగా నిలువగా, మూడో రౌండ్‌లో తీవ్ర పోటీ నెలకొన్నది. దీనికి తోడు ఫార్ములా-4లో యువ రేసర్లు సత్తాచాటడం సంతోషంగా ఉందని ఆర్‌పీపీఎల్ ఎండీ అఖిలేష్ రెడ్డి పేర్కొన్నారు. ఈ లీగ్ ద్వారా దేశంలో రేసింగ్‌ను ఆదరించే అభిమానుల సంఖ్య మరింత పెరిగిందని అన్నారు.

రెండో రోజూ అదే కథ

రద్దు దిశగా అఫ్గన్, కివీస్ టెస్టు?

రెండ్రోజులైనా ఒక్క బంతి పడని వైనం

వసతుల కొరతతో నెట్టింట రచ్చ రచ్చ



ఢిల్లీ: అఫ్గానిస్థాన్, న్యూజిలాండ్ మధ్య ఢిల్లీకి సమీపంలో ఉన్న నోయిడాలో నిర్వహించతలపెట్టిన ఏకైక టెస్టు మ్యాచ్ రద్దు (?) దిశగా సాగుతోంది. ఈ నెల 9 నుంచి 13 మధ్య నోయిడాలోని షాహీద్ విజయ్ సింగ్ పతీక్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ వేదికగా ఈ టెస్టు జరగాల్సి ఉండగా మ్యాచ్ మొదలై రెండు రోజులైనప్పటికీ ఆటలో ఒక్క బంతి కూడా పడలేదు. ప్రస్తుతం నోయిడాలో వర్షాలు లేకున్నా గత వారం కురిసిన వానల కారణంగా స్టేడియంలో ఔట్ ఫీల్డ్ తడిగా మారింది. ఈ స్టేడియంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిస్టమ్ లేనందున ఔట్ ఫీల్డ్ ఆరక రెండ్రోజులుగా మ్యాచ్ సాగకపోవడం ఇరు జట్ల ఆటగాళ్లతో పాటు అభిమానులనూ నిరాశకు గురిచేస్తోంది. మూడో రోజూ ఇక్కడ మ్యాచ్ జరిగే పరిస్థితి లేకపోవడంతో మ్యాచ్‌ను రద్దు చేయడంతో పాటు ఇక నోయిడాలో అంతర్జాతీయ మ్యాచ్‌లు నిర్వహించకుండా ఆదేశాలు ఇవ్వనున్నట్టు సమాచారం. ఐసీసీ మ్యాచ్ రిఫరీ జవగళ్ శ్రీనాథ్ ఇచ్చే నివేదిక ఆధారంగా ఈ వేదిక భవిష్యత్ ఆధారపడి ఉంది.

సోషల్‌మీడియాలో సెటైర్లు..

అఫ్గానిస్థాన్‌లో క్రికెట్ మ్యాచ్‌లను నిర్వహించే పరిస్థితి లేకపోవడంతో ఆ దేశ క్రికెట్ బోర్డు.. బీసీసీఐని సంప్రదించడంతో బోర్డు మూడు వేదికలను సూచించింది. నోయిడాతో పాటు బెంగళూరులోని చిన్నస్వామి, కాన్పూర్‌లోని గ్రీన్ పార్క్ స్టేడియాలను సూచించినా అఫ్గాన్ మాత్రం గతంలో తాము ఆడిన నోయిడానే ఎంచుకుంది. సదుపాయాల కొరతతో పాటు ఫిక్సింగ్ ఆరోపణల నేపథ్యంలో బీసీసీఐ ఇక్కడ దేశవాళీ మ్యాచ్‌ల నిర్వహణను 2019 నుంచే నిలిపేసింది. కాగా నోయిడాలో ఔట్ ఫీల్డ్‌ను ఆరబెట్టేందుకు అక్కడి సిబ్బంది ఉపయోగిస్తున్న ఫ్యాన్లు, గడ్డిని తవ్వుతూ ఆరబెడుతున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అదీగాక ఇక్కడి క్యాటరింగ్ సిబ్బంది భోజనానికి ఉపయోగించే పాత్రలను టాయ్‌లెట్లలో కడుగుతున్న దృశ్యాలూ నెట్టింట వైరల్ అవడంతో నెటిజన్లు బీసీసీఐపై నిందలేస్తున్నారు. అయితే మ్యాచ్‌తో తమకేమీ సంబంధం లేదని బీసీసీఐ ప్రతినిధి ఒకరు చెప్పారు.



క్వార్టర్స్‌లో కార్తీక్ జోడీ

హైదరాబాద్, ఆట ప్రతినిధి: బాలీ(ఇండోనేషియా) వేదికగా జరుగుతున్న వరల్డ్ టూర్ ఐటీఎఫ్ టెన్నిస్ టోర్నీలో రాష్ట్ర యువ ప్లేయర్ సాయికార్తీక్‌రెడ్డి సత్తాచాటాడు. మంగళవారం జరిగిన పురుషుల డబుల్స్ ప్రిక్వార్టర్స్‌లో కార్తీక్ రెడ్డి, బొబ్రోవ్ బోగ్డాన్(రష్యా) ద్వయం 7-6(7-1), 6-1 తేడాతో సంజీవ్, వాన్ డాస్లర్(నెదర్లాండ్స్) జోడీపై గెలిచి ముందంజ వేసింది. మరోవైపు సింగిల్స్ తొలి రౌండ్‌లో కార్తీక్‌రెడ్డి 5-7, 3-6తో జెనియర్ టాంగ్వె(స్విట్జర్లాండ్) చేతిలో ఓటమిపాలయ్యాడు.

చిత్రం

విశాఖలో యాక్షన్ షురూ



నాగార్జున ప్రస్తుతం వైజాగ్‌లో ఉన్నారు. అక్కడ ఆయన ఓ షూటింగ్‌లో బిజీబిజీగా గడుపుతున్నారు. ఆ షూటింగ్‌కి సంబంధించిన విజువల్స్ కూడా కొన్ని బయటకు వచ్చాయి. ఇంతకీ నాగ్ నటిస్తున్న ఆ సినిమా ఏంటి? అనే విషయానికొస్తే.. రజనీకాంత్ 'కూలీ' సినిమాలో నాగ్ కీలక పాత్ర పోషిస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమా షూటింగే ప్రస్తుతం వైజాగ్‌లో జరుగుతున్నది. ఇందులో నాగ్ పవర్‌ఫుల్ పాత్రలో నటిస్తున్నట్టు వార్తలొస్తున్నాయి. రజనీకాంత్‌తో ఢీ అంటే ఢీ అనే పాత్రలో నాగార్జున కనిపిస్తారట. రజనీకాంత్ 'వేట్టైయాన్' చిత్రం వచ్చే నెలలో విడుదల కానుంది. ఆ సినిమా తర్వాత 'కూలీ' వంతు. ఈ సినిమాకు లోకేష్ కనకరాజ్ దర్శకత్వం వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి. సన్ పిక్చర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి అనిరుధ్ సంగీతం అందిస్తున్నారు.

త్రిపాత్రాభినయంతో మెప్పిస్తా!



'**దర్శకుడు** ఈ కథ చెప్పి మూడు పాత్రలు పోషించాలని చెప్పినప్పుడు, ఇంత భారం మోయగలనా అని ఆలోచించాను. రెండు పాత్రలను వేరే వాళ్లతో చేయించొచ్చుగా అని అడిగాను. మూడూ నేనే ఎందుకు చేయాలో ఆయన వివరించి చెప్పారు. అప్పుడు కన్విన్స్ అయ్యాను. ప్రతిష్ఠాత్మక మైత్రీమూవీమేకర్స్ ఈ సినిమాను విడుదల చేయడం ఆనందంగా ఉంది' అని హీరో టోవినో థామస్ నమ్మకం వ్యక్తం చేశారు. ఆయన హీరోగా రూపొందిన చిత్రం 'ARM'. ఐశ్వర్య రాజేశ్, కృతిశెట్టి, సురభి లక్ష్మీ కథానాయికలు. జితిన్‌లాల్ దర్శకుడు. లిస్టిన్ స్టీఫెన్ నిర్మాత. ఈ నెల 12న విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ప్రీరిలీజ్ ఈవెంట్‌లో టోవినో థామస్ మాట్లాడారు. 'ఈ సినిమాకోసం దర్శకుడు ఎనిమిదేండ్లు కష్టపడ్డారు. గ్రేట్ యాక్టర్ టివినో థామస్‌తో పనిచేయడం ఆనందంగా ఉంది. ఆయన నుంచి చాలా నేర్చుకున్నా. ఐశ్వర్య అద్భుతమైన నటి. మంచి టీమ్‌తో కలిసి పని చేశాను' అని కృతిశెట్టి ఆనందం వ్యక్తంచేసింది. ఇందులో జోది అనే పాత్ర చేశానని, ఈ సినిమా పెద్ద విజయం సాధించబోతున్నదని ఐశ్వర్య రాజేష్ నమ్మకం వెలిబుచ్చారు.

సికిందర్‌తో ఆటపాట




కథానాయిక కాజల్ అగర్వాల్ ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉంది. గత కొన్నేళ్లుగా ఆశించిన విజయాలు దక్కకపోయినా ఈ భామ క్రేజ్ ఏమాత్రం తగ్గలేదు. దక్షిణాదితో పాటు హిందీలో కూడా భారీ చిత్రాల్లో అవకాశాలను దక్కించుకుంటున్నది. తాజాగా ఈ అమ్మడు బాలీవుడ్‌లో బంపరాఫర్‌ను సొంతం చేసుకుంది. 'సికందర్' చిత్రంలో సల్మాన్‌ఖాన్ సరసన నటించనుంది. ఏ.ఆర్.మురుగదాస్ దర్శకత్వంలో పాన్ ఇండియా యాక్షన్ చిత్రంగా 'సికిందర్'ను తెరకెక్కిస్తున్నారు. సాజిద్ నడియావాలా నిర్మాత. ఈ సినిమాలో రష్మిక మందన్న కథానాయికగా నటిస్తుండగా, మరో కీలక పాత్రలో కాజల్ అగర్వాల్‌ను ఎంపిక చేశారు. సల్మాన్‌ఖాన్‌తో ఆమెకిది తొలి చిత్రం కావడం విశేషం. కథాగమనంలో కాజల్ అగర్వాల్ పాత్ర చాలా కీలకంగా ఉంటుందని, త్వరలో ఆమె షూటింగ్‌లో జాయిన్ అవుతుందని మేకర్స్ తెలిపారు. సుదీర్ఘ విరామం తర్వాత బాలీవుడ్‌లో అగ్ర హీరో చిత్రంలో ఛాన్స్ దక్కించుకుంది కాజల్ అగర్వాల్. ఈ సినిమా బాలీవుడ్ కెరీర్‌కు ఎంతగానో ఉపయోగపడుతుందని కాజల్ అగర్వాల్ ఆశాభావం వ్యక్తం చేసింది. ప్రస్తుతం కాజల్ అగర్వాల్ తెలుగులో 'కన్నప్ప' చిత్రంలో నటిస్తున్నది.



కమర్షియల్ ఎలిమెంట్స్ ఉన్న రూటెడ్ స్టోరీ ఇది

'ప్రేక్షకులను థియేటర్లకు తీసుకురావడానికి ఏ ఎలిమెంట్స్ కావాలో తెలిసిన దర్శకుడు అర్జున్‌సాయి. నాటకరంగంపై రీసెర్చ్ చేసి ఆయన ఈ కథ రాసుకున్నారు. అన్ని కమర్షియల్ ఎలిమెంట్స్ ఉన్న రూటెడ్ స్టోరీ ఇది. రంగస్థలం గురించి చాలా అద్భుతమైన సన్నివేశాలు ఇందులో ఉన్నాయి' అని రెజీనా కసాండ్రా అన్నారు. దిలీప్ ప్రకాశ్‌కు జోడీగా ఆమె నటించిన చిత్రం 'ఉత్సవం'. అర్జున్ సాయి రచన, దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి సురేశ్ పాటిల్ నిర్మాత. ఈ నెల 13న విడుదల కానుంది. మంగళవారం రెజీనా విలేకరులతో ముచ్చటించారు. 'ఇందులో నేను కార్పొరేట్ ఎంప్లాయ్‌గా కనిపిస్తా. తనకి ప్రేమ మీద సదాభిప్రాయం ఉండదు. చాలా ఇండిపెండెంట్. కథలో కీలకమైన పాత్ర. ఈ పాత్ర చేయడం చాలా రీఫ్రెషింగ్‌గా అనిపించింది. నాజర్, ప్రకాశ్‌రాజ్ రంగస్థలం నుంచి వచ్చారు. వారితో వర్క్ చేయడం వల్ల చాలా నేర్చుకున్నా. వర్సటైల్ యాక్టర్‌గా ఉండాలనేది నా కోరిక. చేయగలిగిన అన్ని రకాల పాత్రలూ చేయడమే నా లక్ష్యం. ప్రస్తుతం సన్నీ డియోల్ హీరోగా గోపీచంద్ మలినేని దర్శకత్వం వహిస్తున్న సినిమా చేస్తున్నా. హిందీలో ఇంకో రెండు ప్రాజెక్ట్స్ ఉన్నాయి' అని

'సర్వైవర్' నాకు స్పెషల్ మూవీ



రజత్ రజనీకాంత్ ప్రధాన పాత్రలో రూపొందిన చిత్రం 'సర్వైవర్'. ఈ చిత్రానికి రచయిత, దర్శకుడు, ఎడిటర్ కూడా ఆయనే కావడం విశేషం. కేన్స్ వరల్డ్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో బెస్ట్ ట్రైలర్, బెస్ట్ యాక్షన్ ఫిల్మ్ అవార్డులను అందుకున్న ఈ సినిమా డిస్నీ ప్లస్ హాట్‌స్టార్, జియో సినిమాలో ప్రస్తుతం స్ట్రీమింగ్ అవుతున్నది. ఈ సందర్భంగా రజత్ రజనీకాంత్ మాట్లాడుతూ 'నేను చేసిన ప్రతి సినిమాకూ అవార్డులు వరించాయి. ఇందులో 'సర్వైవర్' ప్రత్యేకం. ఈ సినిమాకు విమర్శకుల ప్రశంసలందాయి. కథ, యాక్షన్ ఎపిసోడ్స్, నటన అన్నీ బాగా కుదిరాయి. ఇప్పుడు ఓటీటీలో కూడా బాగా ఆదరిస్తున్నారు. ఈ ఆదరణ వల్ల ఇక ముందు మంచి సినిమాలు చేయడానికి బలం చేకూరింది' అని చెప్పారు.

రివేంజ్ డ్రామా 'గాంధారి'



గత మూడేళ్లుగా తెలుగు సినిమాలకు బ్రేక్‌నిచ్చింది పంజాబీ సుందరి తాప్సీ. అయితే హిందీలో మాత్రం ఈ భామ ప్రయోగాత్మక కథాంశాల్లో నటిస్తూ సత్తా చాటుతున్నది. ఆమె తాజా హిందీ చిత్రం 'గాంధారి'కి సంబంధించిన అధికారిక ప్రకటన మంగళవారం వెలువడింది. బాలీవుడ్ నాయిక కనికా ధిల్లాన్ రచన, దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కనుంది. ఈ సినిమాలో తాను పూర్తి యాక్షన్ అవతారంలో కనిపిస్తానని, తన కూతురిని రక్షించుకోవడానికి ఒక తల్లి ఎంత దూరం వెళ్లింది, ఎలాంటి సాహసాలు చేసిందనే అంశాలు భావోద్వేగభరితంగా సాగుతాయని తాప్సీ తెలిపింది. 'దాదాపు ఎనిమిదేళ్ల విరామం తర్వాత యాక్షన్ సీక్వెన్స్‌లో నటించబోతున్నా. 'గాంధారి' అద్భుతమైన స్క్రిప్ట్. ఓ తల్లి మానసిక వేదనకు, పోరాటానికి దృశ్యరూపంగా ఉంటుంది. ఇలాంటి ఇంటెన్స్ క్యారెక్టర్ కోసం చాలా రోజుల నుంచి ఎదురుచూస్తున్నా' అని తాప్సీ పేర్కొంది. నెట్‌ఫ్లిక్స్‌లో ఈ చిత్రం విడుదల కానుంది. ప్రస్తుతం తాప్సీ బాలీవుడ్‌లో నాలుగు చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది.

భయాన్ని పరిచయం చేసే దేవర



'మనిషికి బతికేంత ధైర్యం చాలు.. చంపేంత ధైర్యం కాదు. కాదూ కూడదు అని మళ్లీ ఆ ధైర్యాన్ని కూడగడితే.. ఆ ధైర్యాన్ని చంపే భయాన్నవుతా..' ఈ డైలాగ్‌లోనే 'దేవర' సినిమా కథంతా ఉంది. 2 నిమిషాల 35 సెకన్లున్న ఈ థియేట్రికల్ ట్రైలర్ అదే చెప్పింది. మంగళవారం ముంబైలో ఎన్టీఆర్ 'దేవర' ట్రైలర్‌ను ఘనంగా విడుదల చేశారు. కరణ్ జోహార్, అనిల్ తడాని వంటి బాలీవుడ్ ప్రముఖులు ఈ వేడుకకు హాజరయ్యారు. ఓ ప్రత్యేకమైన ప్రపంచం ఈ ట్రైలర్‌లో కనిపించింది. అభిమానులతో పాటు యాక్షన్ మూవీ లవర్స్ కోరుకునే అంశాలతో దర్శకుడు కొరటాల శివ ఈ ట్రైలర్‌ని తీర్చిదిద్దాడు. ప్రకాశ్‌రాజ్ వాయిస్‌ఓవర్‌తో ఈ ట్రైలర్ మొదలైంది. బైరా (సైఫ్ అలీఖాన్) తన క్రూరమైన గ్యాంగ్‌తో తీర ప్రాంతంలో అకృత్యాలకు తెగబడుతుంటాడు. ప్రశాంతంగా బతుకుతున్న తీరప్రాంత ప్రజల జీవితాల్లో అలజడి సృష్టించడమే కాకుండా, ఓడలను దోచుకుంటూ, కోస్ట్ గార్డులను చంపుతూ రక్తపాతాన్ని సృష్టిస్తుంటాడు. అలాంటి కరుడుగట్టిన రక్తపిపాసులకు భయాన్ని పరిచయం చేస్తాడు 'దేవర' (ఎన్టీఆర్). ఆ గ్రామాన్ని పెను ప్రమాదం నుంచి కాపాడతాడు. ఈ ట్రైలర్‌లో తారక్ స్క్రీన్ ప్రెజెన్స్, డైలాగ్ డెలివరీ, ఎలివేషన్స్ గూజ్‌బంప్స్ తెప్పించేలా ఉన్నాయి. ఒకడు భయస్తుడుగా, ఒకడు భయాన్ని పరిచయం చేసేవాడుగా.. తారక్ రెండు రకాలుగా ట్రైలర్‌లో కనిపిస్తున్నాడు. తారక్, జాన్వీ కెమిస్ట్రీతోపాటు యాక్షన్ సన్నివేశాలకు అనిరుధ్ ఇచ్చిన ఆర్ ఆర్ సినిమాపై అంచనాలను మరింత పెంచేలా ఉంది. ఈ నెల 27 ఈ సినిమా తొలి పార్ట్ విడుదల కానున్న విషయం తెలిసిందే. ఈ చిత్రానికి కెమెరా: రత్నవేలు, ఎడిటింగ్: శ్రీకర్ ప్రసాద్, నిర్మాతలు: మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ.కె, సమర్పణ: నందమూరి కల్యాణ్ రామ్.

తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడిగా ప్రతాని రామకృష్ణ గౌడ్



ఇటీవల జరిగిన తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ ఎన్నికల్లో ప్రతాని రామకృష్ణ గౌడ్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వరుసగా ఆరోసారి ఆయన ఈ పదవికి ఎన్నిక కావడం విశేషం. ఈ సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రతాని రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ 'భవిష్యత్తులో ఎన్నో మంచి కార్యక్రమాలకు ప్లాన్ చేస్తున్నాం. ఇండస్ట్రీలోని 24 విభాగాల నుంచి ఈ ఛాంబర్‌లో 16 వేల మంది సభ్యులున్నారు. సినిమా ఔట్‌డోర్ షూటింగ్‌ల సమయంలో సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు చిన్న చిత్రాలకు రాయితీ ఇచ్చే అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం' అన్నారు. తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ ఉపాధ్యక్షులుగా ఏ.గురురాజ్, డి.కోటేశ్వరరావు, జి.వరప్రసాద్, జనరల్ సెక్రటరీలుగా జె.వి.ఆర్.విద్యాసాగర్, కాచం సత్యనారాయణ, జాయింట్ సెక్రటరీలుగా సోమిరెడ్డి, ఎం.బిందు, కోశాధికారిగా డా||పి. ప్రకాష్ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా 12 మందిని ఎంపిక చేశారు. త్వరలో నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేస్తుందని అధ్యక్షుడు ప్రతాని రామకృష్ణ గౌడ్ తెలిపారు.


Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

'పొగ' పెట్టుకోవద్దు



ఆధునికత పేరుతో ఆడవాళ్లు కూడా ధూమపానం చేస్తున్నారు. ఈ అలవాటు ఎవరికైనా అనారోగ్యకరమే! అయితే, ఇది గర్భిణులపై తీవ్ర ప్రభావం చూపుతుందని చైనాకు చెందిన ఆరోగ్య సంస్థ హెచ్చరిస్తున్నది. తాజాగా నిర్వహించిన ఓ సర్వేలో ధూమపానం వల్ల గర్భిణులకు కలిగే అనర్థాలను వెల్లడించింది.

సిగరెట్ పొగలో దాదాపు నాలుగు వేల రకాల రసాయనాలు ఉంటాయి. అవి గర్భిణుల రక్తంలో కలిసిపోయి.. ప్లాసెంటా ద్వారా కడుపులోని పిండాన్ని చేరుతాయి. అలా.. శిశువు ఎదుగుదలకు, మానసిక అభివృద్ధికీ తీవ్రమైన ఆటంకాలను కలిగిస్తాయి. అంతేకాదు.. ఇందులోని కొన్ని రసాయనాలు తల్లి హృదయ స్పందనల రేటుపై ప్రభావం చూపుతాయి. దాని వల్ల కాన్పు సమయంలో ఇబ్బందులు ఎదురవుతాయి. ముందునుంచే ఈ అలవాటు ఉండి, గర్భధారణ తర్వాత మానేసినా.. 27 శాతం మందికి ఈ సమస్య వచ్చే అవకాశం ఉంటుందట. అదే ప్రెగ్నెన్సీ సమయంలోనూ ధూమపానం చేస్తే.. ముప్పు అవకాశం 31 శాతం నుంచి 32 శాతం వరకు ఉంటుందని సర్వే చెబుతున్నది. పని ఒత్తిడిలోనో.. ఇంకేదో టెన్షన్‌లోనో రోజులో ఒక్క సిగరెట్ తాగినా.. పుట్టబోయే పిల్లలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని సర్వేకారులు చెబుతున్నారు. అందుకే తల్లితోపాటు పుట్టబోయే బిడ్డకూడా ఆరోగ్యంగా ఉండాలి అనుకుంటే.. స్మోకింగ్ తక్షణం మానేయాలని సర్వే సారాంశం.





కథలు రాస్తూ.. ఊహాలు నిజం చేస్తూ..

కొవిడ్ ప్రబలిన రోజులవి. కామారెడ్డి దగ్గర్లోని ఓ పల్లె. అక్కడ ఓ పాతికేండ్ల యువతి భర్తను కరోనా కబళించింది. ఇద్దరు పిల్లల ఆ తల్లికి ఏం చేయాలో పాలుపోలేదు. భర్త బ్యాంకు ఖాతాలో ఎంత డబ్బుందో కూడా ఆమెకు తెలియదు. ఎలా తెలుసుకోవాలో అర్థం కాలేదు. ఆమె దీనస్థితిని ఎవరో సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఆ పోస్టును చూసింది శ్రీఊహ. క్షణం ఆలస్యం చేయకుండా ఆ యువతి దగ్గరికి వెళ్లింది. తనకు చేతనైన సాయం చేసి వచ్చింది. అయినా.. ఆమె మనసు కుదుటపడలేదు. స్మార్ట్‌ఫోన్ల రూపంలో అరచేతిలోకి వచ్చిన అవకాశాన్ని వినియోగించుకోలేని స్థితిలో ఎందరో ఉన్నారు. వారికోసం కార్పొరేట్ కొలువును కాదనుకొని.. వీహబ్‌తో సరికొత్త ప్రయాణానికి శ్రీకారం చుట్టింది ఊహ.

'ఎవరీ ట్యాంక్‌బండ్ శివ?..' అని ఆరాతీసింది ఊహ. హుస్సేన్‌సాగర్‌లో దూకి ఆత్మహత్యకు పాల్పడేవారిని కాపాడటమే లక్ష్యంగా బతుకుతున్నవాడు. కాలుష్య కాసారంలోకి దిగడమే ఆశ్చర్యమైతే, ఎందరి ప్రాణాలో కాపాడటం అద్భుతం అనుకుంది. అతణ్ని కలిసింది. తన గాథంతా తెలుసుకుంది. 'శివ అంటే ఈడే' అనే కథను రాసింది. అదికాస్తా వైరల్ కావడంతో అప్పటి ఐటీ, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి కేటీఆర్ ట్యాంక్‌బండ్ శివకు డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు ప్రకటించారు.

ఇంతకీ ఎవరీ ఊహ. కొందరి వ్యథలు తీర్చాలనీ, మరికొందరి గాథలు ప్రపంచానికి చాటిచెప్పాలని భావిస్తున్న శ్రీఊహ చిక్కటి రచన చేసే చక్కటి సాహితీమూర్తి. సామాజిక కోణంలో సాగే ఆమె సాహితీ ప్రస్థానంలో రెండు పుస్తకాలు వెలుగు చూశాయి. ఆమెకు ప్రతిష్ఠాత్మక అవార్డులు తెచ్చిపెట్టాయి. సోషల్ ఆంత్రప్రెన్యూర్‌షిప్ ద్వారా ఎందరో మహిళల ఊహలకు రెక్కలు తొడుగుతున్న శ్రీఊహ కథ ఇది..

శ్రీఊహ సజ్జ.. పుట్టింది, పెరిగింది హైదరాబాద్‌లోనే! కోల్‌కతా ఐఐఎంలో ఎంబీఏ చేసింది. తర్వాత నల్సార్ లా యూనివర్సిటీలో పీజీ డిప్లొమా చదివింది. చదువు పూర్తవడంతోనే సాఫ్ట్‌వేర్ కొలువు కొట్టింది. ఏడాదికి రూ.30 లక్షల ప్యాకేజీ. తండ్రి జర్నలిస్ట్. తల్లి బ్యాంకర్. అన్నీ ఉన్నా.. ఏదో వెలితి. కామారెడ్డి యువతి కన్నీటి గాథ ఊహను కలిచివేసింది. కార్పొరేట్ ఉద్యోగానికి టాటా చెప్పింది. సామాజిక జీవనానికి శ్రీకారం చుట్టింది. నలుగురికీ మేలు చేయాలనే లక్ష్యంతో వీహబ్‌లో ఇన్నొవేషన్ ఎకో సిస్టమ్ సోషల్ సెక్టార్‌లో డైరెక్టర్‌గా పనిచేస్తున్నది. 'మహిళా సామాజిక వ్యవస్థాపకత' (సోషల్ ఆంత్రప్రెన్యూర్‌షిప్) ద్వారా అనేకమంది గ్రామీణ మహిళలను ఔత్సాహిక వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దుతున్నది. ఆంత్రప్రెన్యూర్‌గా ఎదిగే క్రమంలో అతివలకు ఎదురయ్యే సమస్యలను పరిష్కరిస్తున్నది. సమాజంలో సానుకూల మార్పులను తీసుకురావడానికి వ్యాపారాత్మక నమూనాలను వివరించి.. గ్రామీణ మహిళలను వ్యాపార రంగం వైపు అడుగులు వేయిస్తున్నది. ఎలాంటి లాభాపేక్ష లేకుండా, సామాజిక సంక్షేమం, పర్యావరణ పరిరక్షణ, విద్య, ఆరోగ్యం లాంటి అంశాల్లో మార్పు కోసం తనవంతుగా కృషి చేస్తున్నది.



వీహబ్ వేదికగా..

వీహబ్‌లో చేరాక మహిళా ఆంత్రప్రెన్యూర్లను గుర్తించడం, వారిని ప్రోత్సహించడం పనిగా పెట్టుకుంది ఊహ. వారి ప్రయాణంలో ఉన్న ప్రతిబంధకాలను అధిగమించేందుకు చేయూతను ఇస్తున్నది. 'మహిళా పారిశ్రామికవేత్తల కోసం వ్యాపార ఆలోచనల అభివృద్ధి, వ్యాపార ప్రణాళికలు రూపొందించడం, ప్రభుత్వాలు, ప్రైవేట్ రంగ సంస్థలు, పెట్టుబడిదారులు వంటి వ్యాపార భాగస్వాములతో సుస్థిర సంబంధాలు ఏర్పరచడం, కొత్త కార్యక్రమాలు రూపొందించడం, ప్రభుత్వ పథకాలు సంబంధిత ఆంత్రపెన్యూర్స్‌కు ఉపయోగపడేలా చూడటం, ఇన్నొవేషన్ ప్రోత్సాహకాలు, నిధుల సమీకరణ వంటి కార్యక్రమాలను పర్యవేక్షించడం, కొత్త పెట్టుబడులను ఆకర్షించడం, మార్కెట్ రీసెర్చ్, గవర్నమెంట్ రిలేషన్స్ తదితర టాస్కులు చేస్తుంటాను. సృజనాత్మకత, పట్టుదల ఉన్న మహిళలను ప్రోత్సహిస్తే అద్భుతాలు ఆవిష్కృతం అవుతాయి. వారి ప్రతిభకు తగ్గ వేదికను అందించడానికి అహరహం పనిచేస్తున్నాను' అని చెబుతున్నది ఊహ. ఈ ప్రయాణంలో కేవలం వీహబ్ టవర్‌కే పరిమితం కాలేదామె! కొండలు, గుట్టలు, వాగులు, వంకలు దాటి.. వేలాది మందికి వ్యాపార పాఠాలు నేర్పింది. ఎంతోమంది పట్టణ, గ్రామీణ మహిళలను వీహబ్‌కు రప్పించగలిగింది. ప్రభుత్వం నుంచి ఆర్థికంగా తోడ్పాటు అందేలా కృషి చేస్తున్నది.

సాహితీ సాగు..

ఊహకు సాహిత్యమంటే ప్రాణం. తీరిక సమయాల్లో మనసు కదిలించే కథలు రాయడం తనకు వారసత్వంగా అబ్బిన వ్యసనం అంటుందామె. ఈ సాహితీ సాగులో



వెలువడిన సంకలనాలే 'ఇసుక అద్దం', 'బల్కావ్'. 'ఇసుక అద్దం'లో స్త్రీల సహజమైన శరీరధర్మాల చుట్టూ సమాజం అల్లిన మార్మిక భావజాలం, నిర్దేశించిన సౌందర్య ప్రమాణాలు, కెరీర్ కోసం పోటీ, కుటుంబ సంబంధాల్లో దూరాలు, నైతిక ప్రమాణాల్లో హిపోక్రసీ, పిల్లల పెంపకంలో సమస్యలు తదితర అంశాలను ఆధారంగా చేసుకొని అందమైన కథలు రాసిందామె! ఊహ తన కథల్లో పాత్రలను బాధితులుగా చిత్రీకరించదు. బలమైన వ్యక్తిత్వం ఉన్నవారిగా చూపుతుంది. ఇక రెండో పుస్తకం 'బల్కావ్'! అంటే బాల్కనీ అని అర్థం. తన సోలో బ్యాక్‌ప్యాక్ విహారాల్లోంచి ఇందులోని కథలు పుట్టాయి. వీటిలో కొన్ని ప్రత్యక్షంగా చూసి రాసినవైతే, మరికొన్ని ఊహించి రాసినవి. ఆమె కథా వస్తువులు ఇప్పటి కాలజాలం నుంచి కొన్ని పుడితే... వందలేండ్ల కిందటి గాథలు మరికొన్ని.

వృత్తి.. ప్రవృత్తి.. సంతృప్తి..

'ఇసుక అద్దం' పుస్తకానికి యండమూరి వీరేంద్రనాథ్ ఉగాది పురస్కారం, పురాణం శ్రీనివాస శాస్త్రి కథా పురస్కారం లభించాయి. అందులోని 'చుక్క పొడిచింది'కి వాయిస్ ఆఫ్ తెలంగాణ అవార్డు, హాసిని రామచంద్ర ఫౌండేషన్ కథా పురస్కారం, ఖమ్మం ఈస్థటిక్స్ పురస్కారం దక్కాయి. అలాగే ఈ పుస్తకం ద్వారా ఊహ కొన్ని సామాజిక సమస్యల గురించి ప్రస్తావించింది. దీనికిగానూ, గతేడాది విడుదలైన '50 ఇన్‌స్పైరింగ్ విమెన్ ఆఫ్ తెలంగాణ' ఫీచర్‌లో ఊహకు చోటు లభించింది. ఇసుక అద్దంలోని 'వాష్' అనే కథను ఢిల్లీలో కేంద్ర సాహిత్య అకాడమీ పెద్దల సమక్షంలో ప్రెజెంట్ చేసే అవకాశం కూడా దక్కింది. 'ఇసుక అద్దం'లో ప్రస్తావించిన పలు అంశాలు కేస్ స్టడీస్‌లా తీసుకుంటామని ఢిల్లీ యూనివర్సిటీలో ఓ ప్రొఫెసర్ పేర్కొనడం ఊహ రచనా వైచిత్రిని తెలియజేస్తుంది. 'కొందరు చేస్తున్న వృత్తిలో సంతృప్తిని వెతుక్కుంటారు. మరికొందరు తమ ప్రవృత్తికి తగ్గ పనులు చేస్తూ ఆనందాన్ని పొందుతారు. నేను ఈ రెండిటినీ ఎంజాయ్ చేస్తున్నా' అంటున్న ఊహ మరెందరికో ఆదర్శమని చెప్పకుండా ఉండలేం!

... రవికుమార్ తోటపల్లి

ఇక 'సోలో'గానే

సోలోగామి.. ఆ మధ్య తెగ వైరల్ అయిన మాట! ఈ మాటకర్థం.. తనను తానే పెళ్లిచేసుకోవడం! ఇష్టం ఉండాలే కానీ, ఆడవాళ్లు ఆడవాళ్లను.. మగవాళ్లు మగవాళ్లనే పెళ్లిళ్లు చేసుకుంటున్న కాలమిది. ఈ విపరీత పరిణామాలు చాలవన్నట్టు బ్రెజిల్‌కు చెందిన స్యూలెన్ కేరీ అనే 36 ఏండ్ల వనిత.. గతేడాది తనను తానే మనువాడి వార్తల్లో నిలిచింది. సామాజిక మాధ్యమాల్లోనూ తెగ వైరల్ అయ్యింది. తాజాగా తన నుంచి తాను విడాకులు తీసుకున్నట్లు ప్రకటించి.. మరో బాంబ్ పేల్చింది.



సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్, మోడల్ అయిన స్యూలెన్ కేరీ.. తనకు తగిన భాగస్వామి దొరక్కపోవడంతో స్వీయ వివాహం చేసుకున్నది. అయితే, తన వివాహబంధం పట్ల అసంతృప్తితోపాటు ఒంటరితనం భరించలేక విడాకులు తీసుకుంటున్నట్లు ప్రకటించింది. తనపై తనకు చాలా అంచనాలు ఉన్నాయనీ, వాటిని అందుకోలేకపోవడమే ఈ విడాకులకు కారణమని చెప్పుకొచ్చింది. విడాకుల నిర్ణయానికి ముందు ఆమె 'కపుల్స్ థెరపీ' కూడా తీసుకున్నదట. కౌన్సెలింగ్ సెషన్లకూ హాజరైందట. ఇవేవీ ఫలితాన్ని ఇవ్వకపోవడంతో విడాకులే పరిష్కారం అన్న నిర్ణయానికి వచ్చిందట. అయితే, స్యూలెన్ కేరీని ఆదర్శంగా తీసుకొని.. తనను తానే పెళ్లి చేసుకున్న గుజరాత్‌లోని వడోదరకు చెందిన క్షమా బిందు మాత్రం.. ఇటీవలే తన వివాహ తొలి వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుకోవడం విశేషం!

ఈ నడుము నొప్పి ఎందుకు?

నమస్తే మేడం. నా వయసు 37 సంవత్సరాలు. తొలిసారి గర్భం ధరించాను. సహజ గర్భమే. నెల తప్పి 20 రోజులు అయింది. అయితే బాగా నడుము నొప్పి వస్తున్నది. తొలి రోజుల్లో ఇలా జరగడం సహజమేనా. ఇలా నొప్పి ఎందుకు వస్తుంది. తొమ్మిది నెలలూ ఉంటుందా?

జిందగీ క్లినిక్



సాధారణంగా నెల తప్పగానే నడుము నొప్పి రావడం జరగదు. మీ విషయంలో ఇలా ఎందుకు అయింది అన్నదానికి కొన్ని పరీక్షలు చేస్తే తప్ప తేల్చలేం. ఇందుకోసం మంచి గైనకాలజిస్టుని సంప్రదించండి. బీపీ, షుగర్, థైరాయిడ్, పీసీఓఎస్ లాంటి వాటికి సంబంధించిన పరీక్షలు చేస్తారు. అలాగే ఆస్టియోపోరోసిస్ ఏమైనా ఉందా నిర్ధారించుకోవాలి. 37 సంవత్సరాలకు తొలి గర్భం అంటున్నారు. ఎందుకు ఆలస్యం అయింది, ఇంతకు ముందు ఏమైనా మందులు వాడారా అన్నది తెలియాలి. బరువు ఎక్కువగా ఉన్నారా, ఎత్తుకు సరిపడా ఉన్నారా అన్నదీ చూసుకోవాలి. వీటి ఫలితాల ఆధారంగా మీ నొప్పికి కారణాలు తెలియవచ్చు. ఈ సమయంలో మీరు నొప్పి మాత్రలు మాత్రం వేసుకోకూడదు. అలాగే గర్భం ఆలస్యం అయింది కాబట్టి, పిండం ఆరోగ్యం గురించి తెలుసుకునేందు జెనెటిక్ టెస్ట్ అని చేస్తారు. అది చేయించుకోండి. ఇక, మీ నొప్పి గర్భధారణ సమయం అంతా ఉంటుందా అన్నది ఇప్పుడే చెప్పడం కష్టం.



డాక్టర్ పి. బాలాంబ
సీనియర్ గైనకాలజిస్ట్

అక్కలూ.. ఇవీ మీ హక్కులు!

యావత్ దేశాన్నీ కుదిపేసిన 'కోల్‌కతా జూనియర్ డాక్టర్ హత్యాచార ఘటన' నేపథ్యంలో బెంగాల్ ప్రభుత్వం 'అపరాజిత' బిల్లును తీసుకొచ్చింది. మహిళలు – పిల్లలపై లైంగిక నేరాలు, వేగవంతమైన విచారణ, దోషులకు కఠిన శిక్షలు విధించడమే లక్ష్యంగా.. బెంగాల్ అసెంబ్లీలో ఈ బిల్లు ఆమోదం పొందింది. అప్పుడెప్పుడో 2012లో జరిగిన 'ఢిల్లీ హత్యాచార ఘటన' సందర్భంగా 'నిర్భయ' చట్టం అమల్లోకి వచ్చింది. ఇప్పుడు బెంగాల్ ప్రభుత్వం 'అపరాజిత' బిల్లును ఆమోదించింది.

ఈ క్రమంలో ఎన్నో ప్రశ్నలు తెరపైకి వస్తున్నాయి. అసలు.. మహిళలు – చిన్నారులపై వేధింపులు, వారి రక్షణ కోసం జాతీయ, రాష్ట్ర స్థాయుల్లో ఎలాంటి చట్టాలు అమలులో ఉన్నాయి? వాటిలో ముఖ్యమైనవి ఏవి? మహిళలను రక్షించడానికి జాతీయ, రాష్ట్ర స్థాయుల్లో అనేక చట్టాలు రూపొందాయి. అయితే, ఆయా చట్టాలపై సరైన అవగాహన లేకపోవడంతో బాధితులు వాటిని సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. ఈ క్రమంలో భారతదేశంలోని ప్రతి మహిళా తెలుసుకోవాల్సిన ఏడు ముఖ్యమైన చట్టపరమైన హక్కుల గురించి ఇప్పుడు తెలుసుకుందాం!



1 గృహహింసకు వ్యతిరేకంగా..
గృహహింస నిరోధక చట్టం – 2005.. మహిళలను ఇంట్లో ఎదురయ్యే హింస నుంచి రక్షిస్తుంది. గృహిణిపై చేయి చేసుకోవడమే కాదు.. ఆమెను మాటల ద్వారా, ఆర్థికంగా, భావోద్వేగాలపరంగా, లైంగికంగా వేధించినా.. 498 సెక్షన్ ప్రకారం దోషులను కఠినంగా శిక్షించవచ్చు.

2 పనికి తగ్గ జీతం
సమాన పనికి సమాన వేతనం పొందడం మహిళల హక్కు. మహిళా కూలీలు మొదలుకొని.. ఉన్నతోద్యోగాలు చేసే మహిళల కోసం 'సమాన వేతన చట్టం' అమలులో ఉన్నది. పనిచేసే మహిళలు.. వారి సహోద్యోగులతో సమానమైన వేతనాన్ని ఈ చట్టం ద్వారా డిమాండ్ చేయొచ్చు. కూలీలు, ఉద్యోగినులకు వేతనాలు, ఇతర అలవెన్సుల విషయంలో లింగ వివక్ష చూపడం నేరం కూడా!

3 పని ప్రదేశాల్లో రక్షణ
పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపులను అరికట్టేందుకు ప్రత్యేకమైన చట్టం ఉన్నది. ఈ చట్టం ప్రకారం.. పనిలో లైంగిక వేధింపులకు గురైతే.. ఉన్నతాధికారులకు నివేదించే హక్కు మహిళలకు ఉంది. ఈ చట్టం ప్రకారం.. పనిలో లైంగిక వేధింపులకు సంబంధించిన ఫిర్యాదులను స్వీకరించడానికి, వాటిపై విచారణ చేపట్టడానికి సంస్థలు అంతర్గత ఫిర్యాదుల కమిటీని ఏర్పాటుచేయాలి. పది లేదా అంతకంటే ఎక్కువమంది ఉద్యోగులు ఉన్న ప్రతి కంపెనీ.. ఈ కమిటీని ఏర్పాటు చేసుకోవాల్సిందే! ఎవరైనా మహిళా ఉద్యోగి వేధింపులకు గురైతే.. సదరు బాధితురాలు ఈ అంతర్గత ఫిర్యాదుల కమిటీకి ఫిర్యాదు చేయవచ్చు.

4 రాత్రిపూట అరెస్టు వద్దు
సూర్యాస్తమయం తర్వాత, సూర్యోదయానికి ముందు.. మహిళలను అరెస్టు చేయకూడదు. ఏవైనా తప్పనిసరి పరిస్థితులు ఎదురైతే.. ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఆదేశంతో మాత్రమే రాత్రి సమయంలో మహిళలను అరెస్టు చేయడానికి అవకాశం ఉంటుంది. అంతేకాకుండా, మహిళా ఖైదీని ప్రశ్నించే సమయంలో మహిళా కానిస్టేబుల్‌తోపాటు మహిళకు చెందిన కుటుంబసభ్యులు లేదా స్నేహితులు కూడా ఆమె పక్కన ఉండొచ్చు.

5 అజ్ఞాతం.. మీ హక్కు
లైంగిక వేధింపులకు గురైన మహిళలకు.. 'గోప్యత హక్కు' ఉంటుంది. దీని ప్రకారం.. బాధితురాలి పేరు, ఇతర వివరాలను బయటికి వెల్లడించకూడదు. మేజిస్ట్రేట్ ఎదుట ఒంటరిగా లేదా మహిళా పోలీసు అధికారి సమక్షంలో తన వాంగ్మూలాన్ని నమోదు చేసుకునే హక్కు బాధితురాలికి ఉంటుంది.

6 ఉచిత న్యాయ సేవ
లీగల్ సర్వీసెస్ అథారిటీస్ యాక్ట్.. అత్యాచార బాధితులకు ఉచిత న్యాయ సహాయాన్ని అందిస్తుంది. మహిళలు ఇబ్బందులు ఎదుర్కొన్నప్పుడు న్యాయ సహాయం పొందడానికి ఈ చట్టం హామీ ఇస్తుంది.

7 గౌరవానికి భంగం వద్దు!
లైంగిక వేధింపుల బాధితురాలికి.. తన గౌరవానికి భంగం కలగకుండా చూసుకొనే హక్కు ఉంటుంది. దీని ప్రకారం.. ఏదైనా వైద్య పరీక్షలు అవసరమైతే కేవలం మహిళా వైద్యురాలి ద్వారానే పరీక్షలు నిర్వహించాలి. ఇతరుల సమక్షంలో ఏ విధమైన శారీరక/మానసిక పరీక్షలు నిర్వహించడం చట్టవిరుద్ధం.

చిన్నారిని పీక్కుతిన్న వీధి కుక్కలు

నిజామాబాద్ జిల్లా బోధన్‌లో విషాద ఘటన

శక్కర్‌నగర్, సెప్టెంబర్ 10: వీధి కుక్కలు పది నెలల చిన్నారిపై దాడి చేసి చంపేశాయి. చిన్నారి మృతదేహాన్ని అత్యంత కిరాతకంగా పీక్కుతిన్నాయి. నిజామాబాద్ జిల్లా బోధన్‌లో సోమవారం రాత్రి జరిగిన ఈ ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. బోధన్ పట్టణంలో ఓ మహిళ యాచిస్తూ పొట్టపోసుకుంటున్నది. ఆమెకు పది నెలల కుమారుడున్నాడు. కొత్త బస్టాండ్ ప్రాంతంలో ఉండే ఆమె సోమవారం రాత్రి బాబును ఓ చెట్టు కింద ఉంచి పనిమీద వెళ్లింది. కాసేపటి తర్వాత వచ్చి చూస్తే బాబు కనిపించలేదు. చుట్టుపక్కల ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసిన పోలీసులు రంగంలోకి దిగారు. పట్టణ సీఐ వెంకటనారాయణ తన సిబ్బందితో కలిసి.. బాబు అదృశ్యమైన ప్రాంతాన్ని పరిశీలించారు. చుట్టుపక్కల ఆరా తీయగా మంగళవారం తెల్లవారుజామున కుక్కలు ఓ బాబును నోట పట్టుకుని వెళ్లినట్టు స్థానికుడు పోలీసులకు తెలిపాడు. స్థానికుడు ఇచ్చిన సమాచారం మేరకు ఆ ప్రాంతాన్ని పరిశీలించగా అక్కడక్కడ మాంసపు ముద్దలు దొరికాయి. అవి చిన్నారి అవయవాలుగా గుర్తించి బాలుడిని కుక్కలు చంపేసి పీక్కుతిన్నట్టు నిర్ధారించారు. వాటిని సేకరించి బోధన్ ప్రభుత్వ దవాఖానలో అప్పగించారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. వీధి కుక్కల బెడదతో అల్లాడిపోతున్న స్థానికులు తాజా విషాదం నేపథ్యంలో వణికిపోతున్నారు. ఇటీవలే తట్టికోట్ ప్రాంతంలో ఓ బాలుడిని కుక్కలు మెడ పట్టుకుని ఎత్తుకెళ్తుండగా అడ్డుకున్న గర్భిణితోపాటు పలువురిపై దాడి చేశాయి. ఆ ఉదంతం మరువక ముందే మరో బాలుడు కుక్కలకు ఆహారంగా మారడం స్థానికంగా తీవ్ర భయాందోళన నెలకొంది.

గృహిణిపై డెలివరీ బాయ్ లైంగికదాడికి యత్నం

- ఆర్డరు చేసిన వస్తువులను ఇవ్వడానికొచ్చి దుశ్చర్య
- మహిళ కేకలు వేయడంతో పరారైన యువకుడు
- అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన పోలీసులు

సోన్, సెప్టెంబర్ 10: ఓ గృహిణిపై డెలివరీ బాయ్ లైంగికదాడికి యత్నం చేశాడు. సదరు మహిళ కేకలు వేయడంతో అక్కడి నుంచి పారిపోతుండగా స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన మంగళవారం నిర్మల్ జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. పట్టణంలోని మంజులాపూర్ కాలనీకి చెందిన ఓ గృహిణి మూడు రోజుల క్రితం ఇయర్‌ఫోన్స్ కోసం ఫ్లిప్‌కార్టులో ఆన్‌లైన్‌లో ఆర్డర్ పెట్టింది. సంబంధిత కంపెనీకి చెందిన డెలివరీ బాయ్ విఘ్నేశ్ ఇయర్‌ఫోన్స్ తీసుకొని మంగళవారం ఉదయం 11-12 గంటల మధ్య డెలివరీ చేసేందుకు ఆమె ఇంటికి వచ్చాడు. గృహిణి భర్త ఉదయం 10 గంటలకు విధులకు వెళ్లడంతో ఇంట్లో ఒంటరిగా ఉంది. ఇదే అదునుగా భావించిన ఆ డెలివరీ బాయ్.. గృహిణిపై లైంగికదాడికి యత్నించాడు. అప్రమత్తమైన ఆ మహిళ కేకలు వేసి ఇరుగుపొరుగు వారిని పిలిచింది. వెంటనే యువకుడు బైక్‌పై పారిపోతుండగా స్థానికులు పట్టుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు బాధితురాలి ఇంటికి వచ్చి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నిర్మల్ రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. డెలివరీ బాయ్ విఘ్నేశ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు నిర్మల్ రూరల్ సీఐ రామకృష్ణ, ఎస్సై సాయికుమార్ తెలిపారు.

జైనూర్ ఘటనపై ఎన్‌హెచ్‌ఆర్సీ సీరియస్

నివేదిక ఇవ్వాలని డీజీపీకి ఆదేశం

హైదరాబాద్, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ): కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని జైనూర్ పట్టణంలో ఇటీవల జరిగిన లైంగికదాడి ఘటనపై జాతీయ మహిళా కమిషన్ తీవ్రంగా స్పందించింది. ఈ ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని డీజీపీ జితేందర్‌ను ఆదేశించింది. మహిళపై లైంగికదాడి, హత్యాయత్నానికి గల కారణాలేంటో వివరించాలని కోరింది. ఈ అంశంపై రెండు వారాల్లోగా వివరణాత్మక నివేదిక ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి, డీజీపీకి నోటీసులు జారీచేసింది. ఎఫ్ఐఆర్ స్థితి, బాధితురాలి ఆరోగ్యం, కౌన్సెలింగ్, రాష్ట్ర అధికారుల ద్వారా ఆమెకు పరిహారం అందించడానికి సరైన నివేదిక ఇవ్వాలని పేర్కొన్నారు.

ఇంత అహంకార ప్రభుత్వాన్ని చూడలే

- రేవంత్‌రెడ్డి చెప్పేవి అబద్ధాలు
- ఉపాధ్యాయ దినోత్సవంరోజే టీచర్లకు అవమానం
- ఉద్యోగ సంఘాల గొంతు చచ్చిపోయిందా?
- కోదండరాం, మురళి ఎక్కడ?
- ఎస్టీయూ, జాక్టో మాజీ అధ్యక్షుడు భుజంగరావు



ఎస్టీయూటీఎస్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, జాక్టో మాజీ చైర్మన్ భుజంగరావు

హైదరాబాద్, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ) : ఇప్పుడున్నంత అహంకార, విధ్వంస పూరిత సర్కారును తానెప్పుడూ చూడలేదని ఎస్టీయూటీఎస్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, జాక్టో మాజీ చైర్మన్ భుజంగరావు అసహనం వ్యక్తం చేశారు. అబద్ధాలాడటంలో సీఎం రేవంత్‌రెడ్డి నంబర్ వన్ అని, ఆయన మోసకారి అని విమర్శించారు. ప్రభుత్వ తీరుపై ఉద్యోగులు, ఉపాధ్యాయుల్లో తీవ్ర వ్యతిరేకత కనిపిస్తున్నదని చెప్పారు. మంగళవారం 'నమస్తే తెలంగాణ'తో మాట్లాడిన ఆయన టీచర్స్ డే సందర్భంగా విద్యాశాఖ మంత్రిగా ఉండి టీచర్లకు అవార్డులిచ్చే తీరిక రేవంత్‌రెడ్డికి లేదా? అని ప్రశ్నించారు. పక్కరాష్ట్రంలో వరదలొచ్చినా టీచర్సడే సందర్భంగా సీఎం చంద్రబాబు ఉపాధ్యాయులకు అవార్డులిచ్చారని, ఈ సంస్కారం రేవంత్‌రెడ్డికి లేదా? అని నిలదీశారు. టీచర్సడే రోజునే సీఎం రాష్ట్రంలోని టీచర్లను అవమానించారని ఆగ్రహం వ్యక్తంచేశారు. 'సీఎం రెండుసార్లు మీటింగ్ పెడితే ఉద్యోగులు, ఉపాధ్యాయులంతా పోలోమని పోయింద్రు. సభలో సీఎం బ్రహ్మాండమైన ప్రసంగం చేసిండు. కానీ ఉద్యోగులకు ఆర్థిక ప్రయోజనాలు కల్పించే ఒక్క ప్రకటన కూడా చేయలేదు' అని దుయ్యబట్టారు.

ఐదు డీఏల అడ్రస్ లేదు

'మార్పు మార్పు అని మేము కాంగ్రెస్ వెంట పరిగెడితే ఉద్యోగులకు ఒరిగిందేమీ లేదు. ఐదు శాతం ఐఆర్, ఆరు గ్యారెంటీలు అటకెక్కినయి.. ఐదు డీఏలు అడ్రస్‌లేకుండా పోయినయ్. 18.7శాతం ఉద్యోగులకు డీఏ రావాల్సి ఉన్నది. ఒక్కో టీచర్, ఉద్యోగికి నెలకు రూ.15 వేల నుంచి రూ.20 వేలు సర్కారు బాకీపడింది. రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్ తప్ప ఒక్క ప్రయోజనం అందలేదు. పిల్లల పెండ్లిళ్లు చేద్దామన్నా.. ఇల్లు కట్టుకుందామన్నా రిటైర్మెంట్ బెన్‌ఫిట్లు రావడం లేదు. హెల్త్‌కార్డుల ఊసేలేదు. మెడికల్, జీపీఎఫ్, సరెండర్ లీవుల బిల్లులు పెడింగ్‌లోనే ఉన్నయ్' అని చెప్పారు.

మీ గొంతులను అమ్మేసుకున్నరా?

'మేధావులమని గొప్పలు చెప్పుకునే కోదండరాంరెడ్డి, ఆకునూరి మురళి ఎక్కడికి పోయింద్రు? మీకు ప్రజలు, విద్యార్థుల కష్టాలు పట్టవా? గురుకులాల్లో పురుగులన్నం పెడుతున్నరు. ఆర్జీయూకేటీ, పాలమాకుల గురుకులాల పిల్లలు రోడ్డెక్కింద్రు. దీనిపై మీరెందుకు స్పందించరు? మీ గొంతులను అమ్మేసుకున్నరా? మీ వ్యక్తిత్వాన్ని కుదువపెట్టింద్రా? ఒకటో తేదీన వేతనాలిస్తున్నానని గొప్పలు చెప్పుకుంటున్నరు. చాలా జిల్లాల్లో ఇంత వరకు వేతనాలు రాలేదు. దీనిపై ఎందుకు మీరు మాట్లాడటంలేదు? డీఎస్సీ నిర్వహణలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. ఏకంగా డీఎస్సీ ఫైనల్ కీలో తప్పులున్నాయంటే ఇదేం ప్రభుత్వమన్న అనుమానాలొస్తున్నాయి. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా విద్యా కమిషన్‌ను పూర్తిగా పునరావాసకేంద్రంగా మార్చేసిన ఘనత రేవంత్‌రెడ్డి సర్కారుదే' అంటూ మండిపడ్డారు.

కేసీఆర్ ఇచ్చిన పీఆర్సీలను మరువం

'ఏ మాటకామాట చెప్పుకోవాలి. రాజకీయాలు అవసరంలేదు. కేసీఆర్ స్ట్రెయిట్ ఫార్వర్డ్ మనిషి. అడగకముందే అన్నీ ఇచ్చే మనసున్న మారాజు. కొత్త రాష్ట్రం.. కొత్త సంసారం. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై అవగాహనే రాలేదు. ఉమ్మడి రాష్ట్రంలో ఆగమైన తెలంగాణలో అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన పీఆర్సీని జీవితంలో ఎవరూ మరిచిపోరు. మొదట 43శాతం ఫిట్‌మెంట్ ఇచ్చిన మనసున్న మారాజు కేసీఆర్. రెండో పీఆర్సీలో 30శాతం ఫిట్‌మెంట్ ఇచ్చారు. రెండు పీఆర్సీలు కలిపితే 73శాతం ఫిట్‌మెంట్ ప్రకటించిన గొప్ప నేత. ఎన్నికల ముందు 5 శాతం ఐఆర్ ప్రకటించారు. మళ్లీ పవర్‌లోకి వస్తే కడుపు నిండా పీఆర్సీ ఇస్తా నన్ను నమ్మండి అన్నడు. కానీ మార్పు అని కాంగ్రెస్‌ను నమ్మితే నట్టేట ముంచింద్రు.' అంటూ నాటి రోజులను గుర్తుచేస్తూనే కాంగ్రెస్ సర్కార్‌పై నిప్పులు చెరిగారు.

అప్పుడు యుద్ధం చేసినోళ్లు ఇప్పుడేరి?

'గతంలో ప్రగతిభవన్‌లో మీటింగ్ పెడితే ఉద్యోగులు, ఉపాధ్యాయ సంఘాలు కొట్లాడినంత పనిచేసినయ్. కేసీఆర్‌తో అంశాల వారీగా అందరూ కొట్లాడింద్రు. ఓ రకంగా ఆయనతో యుద్ధమే చేసింద్రు. ఇప్పుడు యుద్ధం కాదు కదా కనీసం మాట్లాడే సాహసం కూడా చేయడం లేదు. ఏం గొంతు చచ్చిపోయిందా? ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నేతలు మనస్సులో అంత బాధపెట్టుకొని ఎందుకు భయపడుతున్నరు? ఒక్కటంటే ఒక్క ఆర్థిక ప్రకటన ఇప్పించడంలో ఎందుకు విఫలమైంద్రు? దీనికి సంఘాల నేతలే సమాధానం చెప్పాలి' అని డిమాండ్ చేశారు. 'సమస్యలపై సంఘాలు ఎందుకింత మౌనంగా ఉన్నాయని ఉద్యోగులు నిలదీస్తున్నరు. అంతా ఫోన్లు చేసి ఆవేదన వ్యక్తంచేస్తున్నరు. ఇదేం ప్రభుత్వం?. ఇదేం ప్రజాపాలన అని ప్రశ్నిస్తున్నరు. పీఆర్సీపై ఇప్పటికీ సంఘాలు ఎందుకు మాట్లాడటంలేదని నిలదీస్తున్నరు. ఎవరూ మాట్లాడే ధైర్యం చేయడంలేదేందుకని రగిలిపోతున్నరు' అని భుజంగరావు ఆవేదన వ్యక్తంచేశారు.

ఏపీ వరదలతో 6,882 కోట్ల నష్టం

హైదరాబాద్, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ) : ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలకు 46 మంది ప్రాణాలు కోల్పోయారని ప్రభుత్వం అధికారిక ప్రకటన విడుదల చేసింది. 540 పశువులు మృతి చెందాయని, 4.90 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరుగగా, 49వేల ఎకరాల్లో ఉద్యాన, 200 ఎకరాల్లో సెరికల్చర్‌కు నష్టం జరిగిందని అధికారులు వెల్లడించారు. 5,921 కిలోమీటర్ల మేర రహదారులు ధ్వంసమయ్యాయని తెలిపారు. 76 విద్యుత్తు ఉపకేంద్రాలు ముంపుబారిన పడగా, 1,283 ఎల్టీ ఎలక్ట్రిక్ స్తంభాలు, 1,668, 11 కేవీ ఎలక్ట్రిక్ స్తంభాలు దెబ్బతిన్నాయన్నారు. ప్రాథమిక అంచనా మేరకు రూ. 6882 కోట్ల నష్టం వాటిల్లినట్టు కేంద్రానికి ప్రభుత్వం నివేదికను అందజేసింది.

ఐకే-1ఏ గనిలో ఊపిరాడక కార్మికుడి మృతి

- యాజమాన్యమే బాధ్యత వహించాలని హెచ్‌ఎంఎస్ కార్మిక సంఘం డిమాండ్
- గనిపై కార్మికుల ధర్నా



ఎల్లవేన శ్రీనివాస్(ఫైల్)

జైపూర్, సెప్టెంబర్ 10 : శ్రీరాంపూర్ డివిజన్‌లోని ఇందారం ఖని-1ఏ గనిలో మంగళవారం మొదటిషిఫ్టులో పని చేస్తున్న జనరల్ మజ్దూర్ ఊపిరాడక మృతిచెందాడు. తోటి కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం.. గోదావరిఖనిలోని గాంధీనగర్‌కు చెందిన ఎల్లవేన శ్రీనివాస్ (35) ఐకే-1ఏ మొదటి షిఫ్టు అండర్ గ్రౌండ్‌లో ఎస్-1 ప్యానల్ 35వ డిప్-4 లెవల్ వద్ద మంగళవారం విధులు నిర్వహిస్తుండగా, గాలి అందక కుప్పకూలిపోయాడు. గమనించిన తోటి కార్మికులు వెంటనే అండర్ గ్రౌండ్ నుంచి బయటకు తీసుకువచ్చారు. అంబులెన్స్‌లో రామకృష్ణాపూర్ ఏరియా హాస్పిటల్‌కు తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. గనిలో వెంటిలేషన్ సరిగా లేకపోవడం వల్లే శ్రీనివాస్ మృతిచెందినట్టు కార్మికులు పేర్కొంటున్నారు.

గనిపై హెచ్‌ఎంఎస్ కార్మికుల నిరసన

శ్రీనివాస్ మృతికి యాజమాన్యమే బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తూ హెచ్ఎంఎస్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గనిపై ధర్నా నిర్వహించారు. నాయకులు, కార్మికులు మాట్లాడుతూ కొంతకాలంగా 34, 35, 53 డిప్‌లలో గాలి సరఫరా లేదని కార్మికులు యాజమాన్యానికి మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని, తాజాగా కార్మికుడు ఊపిరాడక చనిపోతే గుండెపోటు, ఫిట్స్‌తో చనిపోయాడని కట్టుకథలు చెబుతున్నారని మండిపడ్డారు. ఇందుకు కారణమైన అధికారులపై చర్యలు తీసుకోవాలని హెచ్‌ఎంఎస్ ఉపాధ్యక్షుడు సారయ్య డిమాండ్ చేశారు. తన భర్త పని ప్రదేశంలోనే మృతి చెందినప్పటికీ బతికి ఉన్నట్టుగా అధికారులు దవాఖానకు తరలించి వైద్యం అందించినట్టు చిత్రీకరించారని శ్రీనివాస్ భార్య అనిత వాపోయింది.

గోదావరికి పోటెత్తిన వరద

- భద్రాచలం వద్ద 48.50 అడుగుల వద్ద ప్రవాహం

బూర్గంపహాడ్ (భద్రాచలం)/ఏటూరునాగారం/మంగపేట/వాజేడు, సెప్టెంబర్ 10: ఎగువ నుంచి వస్తున్న వరదతో భద్రాచలం వద్ద గోదావరి పోటెత్తింది. మంగళవారం సాయంత్రం 5.15 గంటలకు ప్రవాహం 48 అడుగులకు చేరడంతో రెండో ప్రమాద హెచ్చరిక జారీచేశారు. రాత్రి 7 గంటలకు రెండో ప్రమాద హెచ్చరికను దాటి 48.50 అడుగుల వద్ద గోదావరి ఉరకలు వేస్తుండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఇటు పెరుగుతున్న గోదావరికి తోడు.. అటు శబరి వరద కూడా పోటెత్తింది. చింతూరు వద్ద శబరి నది పోటెత్తడంతో సారపాక, భద్రాచలం వద్ద ఆంధ్రా, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలకు వెళ్లే లారీలు, ఇతర వాహనాల రాకపోకలను పోలీసు అధికారులు నిలిపివేశారు.

ఏటూరునాగారం పుష్కరఘాట్ వద్ద..

ఎగువ నుంచి వస్తున్న వరదతో ములుగు జిల్లా ఏటూరునాగారం రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద ప్రవాహం రెండో ప్రమాద హెచ్చరిక స్థాయికి చేరువైంది. మంగళవారం సాయంత్రం 4 గంటలకు పుష్కరఘాట్ వద్ద 15.800 మీటర్లకు చేరుకున్నది. 15.830 మీటర్లకు చేరితే రెండో ప్రమాద హెచ్చరికను జారీ చేస్తారు.

కరీంనగర్-ముంబై మధ్య 4 ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, సెప్టెంబర్ 10(నమస్తే తెలంగాణ) : దీపావళి, ఛాట్ సందర్భంగా ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేసినట్టు రైల్వే అధికారులు తెలిపారు. కరీంనగర్-ముంబై మధ్య అక్టోబర్ 29 నుంచి నవంబర్ 6 వరకు ఈ రైళ్లు రాకపోకలు సాగిస్తాయన్నారు.

సవాళ్లను అధిగమించాలి

హైదరాబాద్, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ) : కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన నూతన న్యాయ చట్టాల అమలులో ఎదురయ్యే సవాళ్లను పోలీసులు, జైళ్లశాఖ సిబ్బంది అధిగమించాలని జైళ్లశాఖ డీజీ సౌమ్యామిశ్రా సూచించారు. మంగళవారం చంచల్‌గూడ జైలులో బీపీఆర్ అండ్ డీ, కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలో కొత్త న్యాయచట్టాలపై శిక్షణను ఆమె ప్రారంభించారు.

వాణిజ్య

టాటా ఈవీలు చౌక

3 లక్షలదాకా తగ్గిన నెక్సాన్ ధర • పంచ్, టియాగోలూ అగ్గువే



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10: టాటా మోటర్స్ ఎలక్ట్రిక్ వెహికిల్స్ (ఈవీ) ధరలు తగ్గాయి. ఆయా మాడళ్లపై ఏకంగా రూ.3 లక్షలదాకా తగ్గించినట్టు మంగళవారం సంస్థ ప్రకటించింది. పాపులర్ మాడల్ నెక్సాన్ ఈవీ రేటు రూ.3 లక్షల వరకు దించినట్టు సంస్థ తెలియజేసింది. అలాగే పంచ్ ఈవీ ధరపై రూ.1.2 లక్షలదాకా, టియాగో ఈవీపై రూ.40,000 వరకు తగ్గింపులనిస్తున్నట్టు పేర్కొన్నది. 'ఈ ప్రత్యేక, పరిమిత కాల ధరల తగ్గింపుతో ఈవీలనూ పెట్రోల్/డీజిల్ కార్ల ధరలకు దగ్గరగా తీసుకెళ్తున్నాం' అని టాటా ప్యాసింజర్ ఎలక్ట్రిక్ మొబిలిటీ చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ వివేక్ శ్రీవాత్సవ అన్నారు. అంతేగాక తమ ఈ నిర్ణయంతో రెగ్యులర్ కార్ల కొనుగోలుదారులూ ఈవీలను ట్రై చేస్తారన్న ఆశాభావాన్ని ఆయన కనబర్చారు. నిజానికి ఇప్పటికే టియాగో, నెక్సాన్, హరియర్, సఫారీ వంటి మాడళ్ల ధరల్ని టాటా మోటర్స్ రూ.65,000ల నుంచి రూ.1.8 లక్షల వరకు తగ్గించింది. ఈ క్రమంలో ఈవీల రేట్లనూ భారీగా కోత పెట్టింది. దీంతో ఈ పండుగ సీజన్‌లో టాటా అమ్మకాలు మరింత పెరగడం ఖాయమన్న అభిప్రాయాలు మార్కెట్ వర్గాల్లో ఉన్నాయి. పైగా ప్రస్తుతం ఈవీ మార్కెట్‌లో టాటా మోటర్స్‌దే పైచేయి. తాజా ప్రకటనతో టాటా ఈవీల సేల్స్ ఇంకా పుంజుకుంటాయన్న అంచనాలు ఇండస్ట్రీ వర్గాల్లోనూ వినిపిస్తున్నాయి.

సియామ్ అధ్యక్షుడిగా శైలేశ్ చంద్ర

సియామ్ కొత్త అధ్యక్షుడిగా టాటా మోటర్స్ ప్యాసింజర్ వెహికిల్స్ ఎండీ శైలేశ్ చంద్ర ఎన్నికయ్యారు. ఈ మేరకు మంగళవారం జరిగిన ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశంలో ఎన్నుకున్నట్టు సియామ్ అధికారికంగా ప్రకటించింది. 2024-25కుగాను ఈయన ఎంపిక జరిగింది. కాగా, గతంలో సియామ్ ఉపాధ్యక్షుడిగా చంద్ర పనిచేశారు. ఇప్పటిదాకా వోల్వో ఐషర్ కమర్షియల్ వెహికిల్స్ ఎండీ, సీఈవో వినోద్ అగర్వాల్ ఉన్నారు. ఈయన స్థానంలోకి చంద్ర వస్తున్నారు. ఇక సియామ్ ఉపాధ్యక్షుడిగా అశోక్ లేలాండ్ ఎండీ, సీఈవో శేను అగర్వాల్, కోశాధికారిగా డైమ్లర్ ఇండియా కమర్షియల్ వెహికిల్స్ సీఈవో సత్యకమ్ ఆర్య ఎన్నికయ్యారు.

సింగిల్ చార్జింగ్‌తో 500 కి.మీ.

దేశీయ ఈవీ మార్కెట్‌లో గ్రాండ్ ఎంట్రీకి మారుతీ సుజుకీ ప్లాన్
వచ్చే ఏడాది జనవరిలో మధ్య శ్రేణి ఎస్‌యూవీని తేనున్న సంస్థ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10: దేశీయ ఆటో రంగ దిగ్గజం మారుతీ సుజుకీ.. ఎలక్ట్రిక్ వెహికిల్ (ఈవీ) మార్కెట్‌లో గ్రాండ్ ఎంట్రీకి ప్లాన్ చేస్తున్నది. పెట్రోల్, డీజిల్, సీఎన్‌జీ ఆధారిత వాహన మార్కెట్‌లో దూసుకుపోతున్న మారుతీ.. విద్యుత్తు ఆధారిత వాహన మార్కెట్‌లో మాత్రం వెనుకబడిపోయింది. దాదాపుగా అన్ని సంస్థలు ఈవీ సెగ్మెంట్‌పై ఇప్పుడు గట్టిగానే ఫోకస్ చేస్తున్నాయి మరి. ఈ క్రమంలో మారుతీ సైతం వచ్చే ఏడాది జనవరిలో తమ తొలి ఈవీ మాడల్‌ను మార్కెట్‌కు పరిచయం చేయాలనుకుంటున్నది. సింగిల్ చార్జింగ్‌తో 500 కిలోమీటర్లకుపైగా ప్రయాణించేలా ఓ మధ్య శ్రేణి ఎస్‌యూవీని తీసుకురాబోతున్నది. ఈ మేరకు మంగళవారం ఇక్కడ జరిగిన 64వ సియామ్ వార్షిక సమావేశానికి హాజరైన మారుతీ సుజుకీ ఇండియా సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (మార్కెటింగ్ అండ్ సేల్స్) పార్థో బెనర్జీ విలేకరులకు తెలిపారు. అయితే ధర ఎంత? అన్న వివరాలు మాత్రం తెలియజేయలేదు.

ఇన్‌ఫ్రాపై గురి

ఈవీ మార్కెట్‌లోకి ప్రవేశించే ముందు వాహనదారుల సౌకర్యార్థం పటిష్టమైన మౌలిక సదుపాయాల వ్యవస్థను ఏర్పర్చాలని మారుతీ సుజుకీ భావిస్తున్నది. అందుకే ఈవీల చార్జింగ్ స్టేషన్లను నెలకొల్పే దిశగా అడుగులు వేస్తున్నట్టు బెనర్జీ వెల్లడించారు. అలాగే తమ ఈవీ కార్లను కొన్నవారు ఐదేండ్ల తర్వాత అమ్ముకున్నా తగిన రేటు పలికేలా కృషి చేస్తున్నట్టు వివరించారు. ఆటో మార్కెట్‌లో రీసేల్ వాల్యూ కూడా ముఖ్యమేనన్నారు. 'మేము కేవలం ఈవీలనే మార్కెట్‌కు పరిచయం చేయాలనుకోవడం లేదు. కస్టమర్లకు కావాల్సిన అన్ని సౌకర్యాలనూ కల్పించాలనుకుంటున్నాం' అని వ్యాఖ్యానించారు. ఇదిలావుంటే 2030కల్లా ఎగుమతుల్ని మరింత పెంచుకోవాలని ప్రయత్నిస్తున్నట్టు సియామ్ సమావేశంలో మాట్లాడుతూ సంస్థ ఎండీ, సీఈవో హిసాషి తెలిపారు.



పండుగ సీజన్‌లో ఆఫర్లు?

గతకొద్ది నెలలుగా మార్కెట్‌లో నెలకొన్న మందగమనంతో ఆటో అమ్మకాలు అంతంత మాత్రంగానే సాగుతున్నాయి. డిమాండ్ లేక వాహనాలు పెద్ద ఎత్తున డీలర్ల దగ్గరే ఉండిపోతున్నాయి. దీంతో వాహన తయారీ సంస్థలు సైతం ఎక్కువగా సరఫరా చేయడం లేదు. ఈ నేపథ్యంలో రాబోయే పండుగ సీజన్‌పై అన్ని కంపెనీలు భారీగానే ఆశలు పెట్టుకున్నాయి. ముఖ్యంగా డీలర్ల వద్ద మిగిలిపోయిన వాహన నిల్వలన్నీ తరిగిపోయేలా, కొనుగోలుదారులను ఆకర్షించేలా ఆయా మాడల్స్‌పై ఆఫర్లను తేవాలని చూస్తున్నట్టు తెలుస్తున్నది. ఇక ప్రస్తుత పరిస్థితులకు తగ్గట్టుగా నిర్ణయాలు తీసుకుంటున్నామని బెనర్జీ తెలియజేశారు. దీంతో ఈ పండుగ సీజన్‌లో కార్ల ధరలు తగ్గవచ్చన్న అంచనాలు ఊపందుకున్నాయి. ఏటా దసరా, దీపావళి, క్రిస్మస్, న్యూ ఇయర్‌లతో రాబోయే 3-4 నెలలు ఆటో మార్కెట్‌లో సందడి నెలకొంటుంది. దీన్ని ఒడిసిపట్టుకొని బిజినెస్‌ను పెంచుకోవాలని అంతా సహజంగానే ప్రయత్నిస్తూంటారు.



ధర దిగిన ఐఫోన్లు


10 వేల వరకు తగ్గించిన సంస్థ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10: ఐఫోన్ 16ని మార్కెట్లోకి విడుదల చేసిన మరుక్షణమే ఇతర ఐఫోన్ల ధరలను తగ్గించింది యాపిల్ సంస్థ. ప్రతియేటా కొత్త మాడల్‌ను విడుదల చేస్తున్న సంస్థ..ఆ మరుసటి రోజే ఇతర ఫోన్ల ధరలను భారీగా తగ్గిస్తున్నది. దీంట్లోభాగంగా ఐఫోన్ 15, ఐఫోన్ 14 సిరీస్ మాడళ్ల ధరలను రూ.10 వేల వరకు తగ్గించింది. ఈ నూతన ధరలు వెంటనే అమలులోకి రానున్నట్లు పేర్కొంది. దీంతో ఐఫోన్ 15 మాడల్ ప్రారంభ ధర రూ.69,900కి దిగొచ్చింది. ధరలు తగ్గించకముందు ఇది రూ.79,900గా ఉన్నది. అలాగే ఐఫోన్ 15 ప్లస్ మాడల్ కూడా రూ.89,900 నుంచి రూ.79,900కి దించింది. వీటితోపాటు ఐఫోన్ 14, ఐఫోన్ 14 ప్లస్ మాడళ్లను కూడా రూ.10 వేల వరకు తగ్గించింది. దీంతో ఐఫోన్ 14 ధర రూ.69,900 నుంచి రూ.59,900కి దిగొచ్చింది. దేశవ్యాప్తంగా ఉన్న యాపిల్ స్టోర్లతోపాటు భాగస్వామ్య రిటైల్ అవుట్‌లెట్లలో తగ్గింపు ధరకే ఈ ఫోన్లను విక్రయిస్తున్నారు. ప్రస్తుత పండుగ సీజన్‌లో ఈ-కామర్స్ దిగ్గజాలైన అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌ల్లో ఈ ఫోన్ల ధరలు మరింత తగ్గే అవకాశాలు కూడా ఉన్నాయి. ముఖ్యంగా ఎక్స్ఛేంజ్ ఆఫర్లతోపాటు బ్యాంక్ డిస్కౌంట్లు కూడా ఉండనున్నాయి.

హైదరాబాద్‌లో ప్లాస్టిక్ రీసైక్లింగ్ ప్లాంట్

రూ.50 కోట్లతో ఏర్పాటు చేసిన రీ సస్టెయినబిలిటీ

హైదరాబాద్, సెప్టెంబర్ 10: ప్లాస్టిక్ వ్యర్థాలను పునర్వినియోగంలోకి తేవడానికి రీ సస్టెయినబిలిటీ..ఇన్వెస్ట్‌మెంట్ సంస్థ షార్ప్ వెంచర్స్‌తో జట్టుకట్టింది. దేశవ్యాప్తంగా ప్లాస్టిక్ వ్యర్థాలు అధికమవుతుండటంతో ప్రతియేటా వాతావరణ కాలుష్యం జరుగుతున్నదని, దీనిని తగ్గించడానికి తొలి విడుతలో హైదరాబాద్‌తోపాటు ఛత్తీస్‌గడ్‌లలో రూ.50 కోట్ల పెట్టుబడితో రీసైక్లింగ్ ప్లాంట్లను నెలకొల్పినట్లు రీ సస్టెయినబిలిటీ లిమిటెడ్ ఎండీ, సీఈవో మసూద్ మాలిక్ తెలిపారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన యూనిట్ సామర్థ్యం 24 వేల టన్నులు కాగా, రాయ్‌పూర్‌లో 8 వేల టన్నులు కలుపుకొని మొత్తంగా ప్రతియేటా 32 వేల టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు పునర్వినియోగంలోకి రానున్నట్లు చెప్పారు. దీంతో ప్రతియేటా 15 వేల టన్నుల కార్బన్‌డయాక్సైడ్ తగ్గనున్నదన్నారు. వచ్చే రెండేండ్లలో ఈ కెపాసిటీని 10 లక్షల టన్నులకు పెంచడానికి మూడు నుంచి ఐదు యూనిట్లను నెలకొల్పబోతున్నట్లు ప్రకటించారు. ఇందుకోసం రూ.100 కోట్ల వరకు ఖర్చు చేయనున్నట్లు సూచనప్రాయంగా చెప్పారు. ఈ ప్లాంట్లు ఏర్పాటు చేయడంతో 370 మందికి ప్రత్యక్షంగా, 2 వేల మందికి పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయని, వీరిలో 75 శాతం మంది మహిళలు కావడం విశేషమన్నారు.



జియోఫోన్ ప్రైమా 2

ధర రూ.2,799

సెల్ఫీ కెమెరా, వీడియో కాలింగ్ సౌకర్యాలు

ముంబై, సెప్టెంబర్ 10: రిలయన్స్ ఇండస్ట్రీస్ మరో బడ్జెట్ 4జీ ఫీచర్ ఫోన్‌ను పరిచయం చేసింది. జియోఫోన్ ప్రైమా 2 పేరిట విడుదలైన ఈ మొబైల్ ధర రూ.2,799. 2.4 అంగుళాల డిస్‌ప్లే ఉన్న ఇందులో బ్యాక్, ఫ్రంట్ (సెల్ఫీ) కెమెరాలున్నాయి. ఏ థర్డ్-పార్టీ యాప్ లేకుండానే నేరుగా వీడియో కాల్స్ చేసుకోవచ్చు. క్వాల్‌కామ్ చిప్‌తో 512 ఎంబీ ర్యామ్, 4జీబీ ఇంటర్నల్ స్టోరేజీ, మైక్రోఎస్‌డీ కార్డ్ స్లాట్ సౌకర్యాలున్నాయి. కైఓఎస్‌తో నడిచే ఈ ఫోన్‌లో యూట్యూబ్, గూగుల్ అసిస్టెంట్, ఫేస్‌బుక్ యాప్‌లతోపాటు యూపీఐ పేమెంట్స్ కోసం జియోపే కూడా ఉంటుంది. అయితే వాట్సాప్ ఉండదు. ఇక సులభంగా దీని 2,000 మెగాహెట్జ్ బ్యాటరీని మార్చుకోవచ్చు. అంతేగాక ఇది 23 రకాల భారతీయ భాషలను సపోర్ట్ చేస్తుంది. అలాగే జియో నెట్‌వర్క్‌లోనే పనిచేస్తుంది. కాగా, దీనికి ప్రత్యేక రిచార్జ్ ప్లాన్లున్నాయి. రూ.91లకే రోజుకు 100ఎంబీ డాటాతో 28 రోజుల కాలపరిమితిపై అన్‌లిమిటెడ్ కాల్స్ చేసుకోవచ్చు. 28 రోజుల వ్యాలిడిటీతోనే ఉన్న రూ.152 ప్లాన్‌లో రోజుకు 500ఎంబీ డాటా ఉంటుంది. రూ.895తో వార్షిక ప్లాన్ (336 రోజులు) కూడా ఉన్నది. ఇందులో 28 రోజులపాటు రోజుకు 2జీబీ డాటా వస్తుంది.



మళ్లీ 25 వేల పైకి నిఫ్టీ

ముంబై, సెప్టెంబర్ 10: వరుసగా రెండో రోజు స్టాక్ మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. అమెరికా మార్కెట్లు తిరిగి కోలుకోవడం, ఎఫ్ఐఐలు నిధులు కుమ్మరించడంతో సూచీలు కదంతొక్కాయి. ఒక దశలో 600 పాయింట్లకు పైగా లాభపడి 82 వేల పాయింట్లను అధిగమించిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 361.75 పాయింట్లు ఎగబాకి 81,921.29 వద్ద స్థిరపడింది. మరో సూచీ నిఫ్టీ ఏకంగా 25 వేల పాయింట్ల మైలురాయిని మళ్లీ అధిగమించి 104.70 పాయింట్లు అందుకొని 25,041.10 వద్ద ముగిసింది. నష్టాల్లో ప్రారంభమైన సూచీలకు అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలు లాభాల జోరుకు దోహదం చేశాయి. త్వరలో విడుదలకానున్న అమెరికా ద్రవ్యోల్బణ గణాంకాలు, ఫెడ్ నిర్ణయంపై మదుపరులు దృష్టిసారించడం దేశీయ సూచీలకు కలిసొచ్చిందని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు. భారతీ ఎయిర్‌టెల్ 2.29 శాతం పెరిగి టాప్ గెయినర్‌గా నిలిచింది.

రూ.932కే విమాన టికెట్

ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ ఆఫర్
త్వరలో బిజినెస్ క్లాస్ సీట్లకు చెల్లు

హైదరాబాద్, సెప్టెంబర్ 10: ఎయిర్ ఇండియా అనుబంధ సంస్థ ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్..తాజాగా 'ఫ్లాష్ సేల్' పేరుతో ప్రత్యేక ఆఫర్లు ప్రకటించింది. ఈ ఆఫర్ కింద ప్రారంభ విమాన టికెట్ ధరను రూ.932గా నిర్ణయించింది. ఈ నెల 16 వరకు బుకింగ్ చేసుకోనున్న ప్రయాణికులు వచ్చే ఏడాది మార్చి 31 వరకు ప్రయాణించవచ్చునని సంస్థ వెల్లడించింది. కంపెనీ వెబ్‌సైట్, మొబైల్ యాప్ ద్వారా బుకింగ్ చేసుకోవాల్సి ఉంటుందని పేర్కొంది. కంపెనీ వెబ్‌సైట్ ద్వారా బుకింగ్ చేసుకున్న ప్రయాణికులకు జీరో-చెక్-ఇన్ బ్యాగేజీ సదుపాయం కూడా లభించనున్నది. అలాగే విద్యార్థులకు, సీనియర్ సిటిజన్లకు, ఎస్ఎంఈలకు, డాక్టర్లు, నర్స్‌లకు, భద్రతదళాలకు ప్రత్యేక డిస్కౌంట్‌ను కల్పిస్తున్నది. ఇదిలా ఉంటే వచ్చే ఏడాది నుంచి వైట్-టెయిల్ విమానాల్లో బిజినెస్ క్లాస్ సీట్లను ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ తీసివేయనుంది.





జోయెటిస్ జీసీసీని ప్రారంభిస్తున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు


హైదరాబాద్‌లో జోయెటిస్ జీసీసీ

హైదరాబాద్, సెప్టెంబర్ 10(నమస్తే తెలంగాణ) : పశువులు, పెంపుడు జంతువుల ఔషధాల, పోషకాల ఉత్పత్తి సంస్థ జోయెటిస్..హైదరాబాద్‌లో గ్లోబల్ సామర్థ్య కేంద్రాన్ని(జీసీసీ)ని నెలకొల్పింది. 40 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ జీసీసీ సెంటర్‌ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..పశువైద్య రంగంలో ప్రపంచ దిగ్గజం జోయెటిస్ రాష్ట్రంలో ప్రవేశించడంతో లైఫ్ సైన్సెస్ రంగంలో హైదరాబాద్ సరికొత్త మైలురాయిని అధిగమించినట్లు అయిందని పేర్కొన్నారు. పశువులు, పెంపుడు జంతువుల ఔషధాలు, పోషకాల ఉత్పత్తిలో జోయెటిస్‌కు ప్రపంచవ్యాప్త గుర్తింపు ఉందని చెప్పారు. ఈ జీసీసీ సెంటర్ నుంచి బిజినెస్ ఆపరేషన్స్, డాటా మేనేజ్‌మెంట్, పరిశోధన, అభివృద్ధి లాంటి కార్యకలాపాలను నిర్వహిస్తుందని వెల్లడించారు. 2025 చివరి నాటికి వందలాది మంది సాఫ్ట్‌వేర్, పశువైద్య నిపుణులకు ఉద్యోగాలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో జోయెటిస్ చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ కీత్ సార్బాగ్, జోయెటిస్ ఇండియా సామర్థ్య కేంద్రం వైస్ ప్రెసిడెంట్ అనిల్ రాఘవ్, టీజీఐఐసీ సీఈఓ మధుసూదన్, యూఎస్ కాన్సులేట్ అధికారులు, యూఎస్ ప్రభుత్వ కన్సల్టెంట్లు నెల్సన్ కన్నింగ్ హామ్, రెబెకా డ్రేమే, ఫ్రాంక్ టల్లుటో, అఖిల్ బెరి పాల్గొన్నారు.

16 ఏండ్లలోపు పిల్లలు సోషల్ మీడియా

వినియోగంపై నిషేధం!

వయోపరిమితి విధించేందుకు ఆస్ట్రేలియా ప్రభుత్వం యోచన



న్యూఢిల్లీ: ఇటీవలి కాలంలో సోషల్ మీడియా వినియోగం విపరీతంగా పెరిగింది. చిన్నాపెద్దా తేడాలేకుండా అందరూ దానికి బానిలైపోతున్నారు. ఈ నేపథ్యంలో ఆస్ట్రేలియా కీలక నిర్ణయం తీసుకుంది. సోషల్ మీడియా వినియోగానికి వయో పరిమితిని తీసుకురావాలని యోచిస్తున్నది. అందులో భాగంగా 16 ఏండ్లలోపు వారిపై నిషేధం దిశగా అడుగులు వేస్తున్నది. ఈ విషయాన్ని ఆ దేశ ప్రధాని ఆంథోనీ అల్బనీస్ వెల్లడించారు. పిల్లలు తమ డివైజ్‌లకు దూరంగా మైదానాల్లో కనిపించాలని కోరుకుంటున్నట్టు చెప్పారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, టిక్‌టాక్ వంటి వాటి వినియోగం విషయంలో పిల్లల వయసు ఎంత ఉండాలనే దానిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని, కాకపోతే 14-16 ఏండ్ల మధ్య ఉంటే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. తానైతే 16 ఏండ్లలోపు చిన్నారులకు ఇలాంటివి నిషేధం చాలనే కోరుకుంటానని తెలిపారు. వయోపరిమితిపై ముమ్మందు ట్రయల్స్ మొదలవుతాయని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి ముసాయిదా బిల్లును ఈ ఏడాదే చట్టసభల్లో ప్రవేశపెడతామని ప్రధాని చెప్పారు. 'వయో పరిమితి' తీసుకురావటంపై విపక్ష నాయకుడు పీటర్ డట్టన్ మద్దతు పలుకుతున్నారు. తాము అన్నింటికీ అతీతులమన్నట్టు సోషల్ మీడియా కంపెనీలు వ్యవహరిస్తున్నాయని ఓ రేడియో యాంకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

సాంకేతికంగా సాధ్యమేనా?

ఆన్‌లైన్ వయసు ధ్రువీకరణ.. అయ్యే పనేనా? అన్న సందేహాలను నిపుణులు వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నిషేధం విధించినా, ప్రస్తుత టెక్నాలజీ దాన్ని అమలుజేస్తుందన్న విశ్వసనీయత లేదని ఐటీ నిపుణుడు టాబీ ముర్రే అన్నారు. డిజిటల్ ప్రపంచంలో ఆరోగ్యకరమైన, అర్థవంతమైన ప్రాతినిధ్యానికి యువకులను దూరం చేయటం హానికరమని క్వీన్స్‌ల్యాండ్ వర్సిటీకి చెందిన డానియల్ అన్నారు.

ముడా స్కామ్‌లో 18 మంది అధికారులకు నోటీసులు

12న విచారణకు హాజరు కావాలని లోకాయుక్త ఆదేశం


మైసూర్: కర్ణాటకలోని మైసూర్ అర్బన్ డెవలప్‌ఎంట్ అథారిటీ (ముడా) కుంభకోణంలో సూపరింటెండెంట్ ఇంజనీర్ సహా 18 మంది అధికారులకు మైసూర్ లోకాయుక్త నోటీసులు జారీ చేసింది. పలుకుబడి కలిగిన 350 మంది వ్యక్తులకు అక్రమంగా స్థలాలు కేటాయించారన్న ఆరోపణలపై నోటీసులు జారీ చేసిన లోకాయుక్త ఈనెల 12న తప్పకుండా తమ ముందు విచారణకు హాజరు కావాలని అధికారులను ఆదేశించింది. అధికారుల అక్రమ భూముల కేటాయింపులపై 2017లో ఆర్‌టీఐ కార్యకర్త గంగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు లోకాయుక్త ఈ నోటీసులు ఇచ్చింది. ముడా స్కామ్‌లో సీఎం సిద్ధరామయ్య చిక్కుకున్న విషయం తెలిసిందే. ఆయన సతీమణికి ఖరీదైన ప్రాంతంలో భూమి కేటాయించినట్టు ఆరోపణలున్నాయి.

విషమంగా సీతారాం ఏచూరి ఆరోగ్యం



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10: సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని మంగళవారం ఆ పార్టీ ఒక ప్రకటన విడుదల చేసింది. 72 ఏండ్ల సీతారాం ఏచూరి శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్నారు. దీంతో ఆగస్టు 19న ఆయనను ఢిల్లీలోని ఎయిమ్స్‌లో చేర్పించారు. ప్రస్తుతం వైద్యుల బృందం ఐసీయూలో ఆయనకు చికిత్స అందిస్తున్నదని, ఆయన రెస్పిరేటరీ సపోర్ట్‌తో ఉన్నారని సీపీఎం పేర్కొన్నది. ఇటీవలే ఏచూరి కాటరాక్ట్ సర్జరీ చేయించుకున్నారు. న్యుమోనియా తరహా ఛాతి ఇన్‌ఫెక్షన్‌కు చికిత్స కోసమని ఆయనను దవాఖానలో చేర్పించారు. మొదట చికిత్సకు బాగా స్పందించినప్పటికీ క్రమంగా ఆయన ఆరోగ్యం విషమిస్తున్నది.

ప్రయాణించిన దూరానికే టోల్!



- త్వరలో జీపీఎస్ ఆధారిత విధానం
- కొత్త నిబంధనలు నోటిఫై
- ప్రయాణ దూరం బట్టి టోల్ ఫీజు
- ఖాతా నుంచి ఆటోమేటిక్‌గా కట్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10: దేశంలో జీపీఎస్ ఆధారిత టోల్ వ్యవస్థను తీసుకువచ్చే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. నూతన విధానం అమలు చేసేందుకు అనుగుణంగా 2008 జాతీయ రహదారుల రుసుము(ధరల నిర్ణయం, వసూలు) నిబంధనలను మంగళవారం కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ నోటిఫై చేసింది. టోల్ వసూలుకు ప్రస్తుతం ఉన్న నగదు, ఫాస్టాగ్ చెల్లింపు విధానాలకు అదనంగా గ్లోబల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టమ్(జీఎన్ఎస్ఎస్)ను ప్రవేశపెట్టింది. ఈ విధానం ద్వారా వాహనాలు టోల్ గేట్ల వద్ద ఆగాల్సిన అవసరం లేకుండా నేరుగా వెళ్లేందుకు ప్రత్యేక లేన్లను ఏర్పాటు చేసేందుకు నిబంధనలను మార్చింది.

ఎలా పని చేస్తుంది?

జీఎన్ఎస్ఎస్ సాంకేతికత ద్వారా టోల్ చెల్లించేందుకు ముందుగా వాహనాలకు ఆన్ బోర్డ్ యూనిట్ల(ఓబీయూ)ను ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. టోల్ రోడ్డుపై వాహనం ఎక్కడి నుంచి ఎక్కడికి ప్రయాణించిందనేది ఈ ఓబీయూ ద్వారా జీపీఎస్ కోఆర్డినేట్లు నమోదవుతాయి. ఇందుకు జీపీఎస్‌తో పాటు జియో ఆగ్‌మెంటెడ్ నావిగేషన్(గగన్) వ్యవస్థను వినియోగిస్తారు. మరింత కచ్చితత్వం కోసం హైవేలపై ప్రత్యేకంగా ఏర్పాటుచేసే సీసీటీవీ కెమెరాలతో సరిపోల్చి చూస్తారు. చివరగా టోల్ రోడ్డుపై వాహనం ప్రయాణించిన దూరానికి వర్తించే టోల్ రుసుము వాహనదారు లింక్ చేసిన బ్యాంకు ఖాతా నుంచి ఆటోమెటిక్‌గా కట్ అయిపోతుంది. మొదటి 20 కిలోమీటర్ల ప్రయాణానికి మాత్రం టోల్ వర్తించదు. ప్రస్తుతం దేశంలో 45,428 కిలోమీటర్ల టోల్ రోడ్డు వ్యవస్థ ఉంది. విడతలవారీగా ఈ రోడ్లపై కేంద్రం జీఎన్ఎస్ఎస్ వ్యవస్థను అమలులోకి తీసుకురానుంది. ఇప్పటికే పైలట్ ప్రాజెక్టు పూర్తయ్యింది.

నాగేంద్రనే మాస్టర్‌మైండ్

- వాల్మీకి స్కామ్‌లో కర్ణాటక కాంగ్రెస్ మాజీ మంత్రిపై ఈడీ చార్జిషీట్
- పక్కదారి పట్టిన 21 కోట్ల నిధులు
- లోక్‌సభ ఎన్నికల్లో నిధుల వినియోగం
- హైదరాబాద్ సత్యనారాయణవర్మ కీ రోల్
- సిట్ క్లీన్‌చిట్‌ను తప్పుబట్టిన దర్యాప్తు సంస్థ



నాగేంద్ర

బెంగళూరు, సెప్టెంబర్ 10: కర్ణాటకతోపాటు తెలంగాణలో రాజకీయ ప్రకంపనలు రేపిన వాల్మీకి కుంభకోణంలో కాంగ్రెస్ నేత, మాజీ మంత్రి బీ నాగేంద్రనే కీలక సూత్రధారి అని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) నిర్ధారించింది. ఈ మేరకు మంగళవారం ఎమ్మెల్యే, ఎంపీల ప్రత్యేక కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసింది. అయితే, ఇప్పటికే ఈ కేసును విచారించిన కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) బీ నాగేంద్రతో పాటు వాల్మీకి బోర్డు చైర్మన్, కాంగ్రెస్ ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్‌కు క్లీన్‌చిట్ ఇచ్చింది. కనీసం ఈ ఇద్దరికి నోటీసులు జారీ చేసి, విచారణ కూడా జరపలేదు. ఈడీ మాత్రం ఈ మొత్తం కుంభకోణంలో నాగేంద్రనే మాస్టర్‌మైండ్ అని తేల్చింది. నాగేంద్రతో పాటు మరో నలుగురిని నిందితులుగా ఈడీ పేర్కొన్నది. ఇప్పటికే నాగేంద్ర ఇండ్లు, కార్యాలయాలలో ఈడీ సోదాలు నిర్వహించి, నాగేంద్రను అరెస్టు చేసింది.

పక్కదారి పట్టించి.. ఎన్నికల్లో వెచ్చించి

వాల్మీకి కుంభకోణానికి సంబంధించి ఈడీ చార్జిషీట్‌లో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. హైదరాబాద్‌కు చెందిన ప్రధాన నిందితుడు సత్యనారాయణ వర్మతో కలిసి రూ.21 కోట్ల నిధులను నాగేంద్ర పక్కదారి పట్టించినట్టు ఈడీ పేర్కొన్నది. బెంగళూరుతో పాటు బళ్లారి నుంచి ఈ డబ్బులను వివిధ ప్రాంతాలకు అక్రమంగా పంపించారని, లోక్‌సభ ఎన్నికల్లో వీటిని వినియోగించినట్టు ఈడీ గుర్తించింది.

ఏమిటీ స్కామ్?

'కర్ణాటక మహర్షి వాల్మీకి షెడ్యూల్డ్ ట్రైబ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్'కు చెందిన పలు బ్యాంకు ఖాతాల్లో ఉండాల్సిన రూ.187 కోట్లు పక్కదారి పట్టాయి. వాల్మీకి కార్పొరేషన్ అకౌంట్స్ సూపరింటెండెంట్ పీ చంద్రశేఖరన్ గత మే 26న ఆత్మహత్య చేసుకోవడంతో ఈ కుంభకోణం వెలుగు చూసింది. ఈ స్కామ్ గురించి చంద్రశేఖరన్ తన ఆరు పేజీల సూసైడ్ నోటులో పేర్కొన్నారు. యూనియన్ బ్యాంకు సైతం తమ బ్యాంకులోని వాల్మీకి కార్పొరేషన్ ఖాతా నుంచి చట్టవిరుద్ధంగా నగదు బదిలీ అయ్యిందని ఫిర్యాదు చేసింది. సర్వత్రా ఒత్తిడి పెరగడంతో సిద్ధరామయ్య ప్రభుత్వం.. సిట్ ఏర్పాటు చేసింది. ఈడీ సైతం రంగంలోకి దిగింది. లోక్‌సభ ఎన్నికల్లో మద్యం, డబ్బు పంచడం కోసమే 'వాల్మీకి కార్పొరేషన్' నిధులను అక్రమంగా వాడుకొన్నట్టు ఈడీ, సిట్ విచారణలో ప్రాథమికంగా తేలింది.



ఎవరీ సత్యనారాయణ వర్మ?

తెలంగాణ కాంగ్రెస్ నేతలతో సన్నిహిత సంబంధాలు!

హైదరాబాద్, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ): వాల్మీకి స్కామ్‌లో ఈడీ ప్రధానంగా ప్రస్తావించిన సత్యనారాయణ వర్మ హైదరాబాద్‌కు చెందిన బిల్డర్. ఈయన వాల్మీకి కార్పొరేషన్‌కు సంబంధించిన నిధులను 'ఫస్ట్ ఫైనాన్స్ క్రెడిట్ కో ఆపరేటివ్ సొసైటీ' ద్వారా దారి మళ్లించినట్టు ఈడీ తన చార్జిషీట్‌లో పేర్కొన్నట్టు విశ్వసనీయ సమాచారం. ఈ కుంభకోణానికి సంబంధించిన నిధులతోనే సత్యనారాయణ వర్మ రూ.3.3 కోట్లతో లాంబోర్గిని కారును కూడా కొన్నట్టు ఈడీ గుర్తించింది. ఈ కుంభకోణంలో సత్యనారాయణ వర్మతోపాటు ఇటకారి సత్యనారాయణ, చంద్రమోహన్, నాగేశ్వరరావులు కూడా ఉన్నారు. తెలంగాణకు చెందిన ఇద్దరు కీలక కాంగ్రెస్ నేతలకు సత్యనారాయణ వర్మ అత్యంత సన్నిహితుడనే ఆరోపణలున్నాయి. పక్కదారి పట్టించిన కార్పొరేషన్ నిధులను లోక్‌సభ ఎన్నికల్లో వినియోగించారని ఈడీ పేర్కొన్న నేపథ్యంలో సత్యనారాయణ వర్మ వెనుక ఎవరున్నారనేది చర్చనీయాంశంగా మారింది. ఈ నిధులకు సంబంధించి కర్ణాటక మంత్రి ప్రత్యేకంగా హైదరాబాద్‌కు కూడా వచ్చి చర్చల్లో పాల్గొన్నట్టు సమాచారం. ఇక్కడి ఇద్దరు కీలక నేతల్లో ఒకరు రెండుసార్లు బెంగుళూరుకు కూడా ఇదే విషయంపై వెళ్లివచ్చినట్టు తెలుస్తున్నది. సత్యనారాయణ వర్మకు సంబంధించిన వ్యాపారంలోనూ ఇక్కడి కాంగ్రెస్ నేతలు భాగస్వాములుగా ఉన్నట్టు ప్రచారం జరుగుతున్నది.

నవంబర్ నుంచి జేఈఈ మెయిన్-1 రిజిస్ట్రేషన్

- జనవరి చివరివారం, ఏప్రిల్ మొదటి వారంలో పరీక్షలు
- త్వరలో జేఈఈ -25 షెడ్యూల్ విడుదల

హైదరాబాద్, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ): దేశంలోనే అత్యున్నత విద్యాసంస్థలైన ఐఐటీలు, ఎన్ఐటీల్లోని బీటెక్, బీ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే జేఈఈ మెయిన్-2025 రిజిస్ట్రేషన్ నవంబర్ నుంచి మొదలుకానుంది. జనవరి చివరివారంలో జేఈఈ మెయిన్-1 పరీక్ష, ఏప్రిల్ మొదటి వారంలో జేఈఈ మెయిన్-2 పరీక్షలను నిర్వహించే అవకాశాలున్నాయి. పూర్తి షెడ్యూల్‌ను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టీఏ) వారం పదిరోజుల్లో విడుదల చేయనుంది. నవంబర్ నుంచే మొదటి విడత రిజిస్ట్రేషన్ ప్రారంభం కానుంది. నిరుడు జేఈఈ మెయిన్ సిలబస్‌లో పలు మార్పులు చేశారు. దీంతో ఈ ఏడాది ఎలాంటి మార్పులుండకపోవచ్చు. జేఈఈ మెయిన్ ఎగ్జామ్‌ను 300 మార్కులకు మూడు గంటలపాటు నిర్వహిస్తారు.

సగానికి తగ్గనున్న కెనడా స్టడీ వీసాలు

టొరొంటో, సెప్టెంబర్ 10: కెనడా స్టడీ వీసా ఆమోదం పొందటంలో భారతీయ విద్యార్థుల కష్టాలు మరింత పెరిగాయి. దీంతో ఈ ఏడాది స్టడీ వీసాలను పొందే భారతీయ విద్యార్థుల సంఖ్య 50 శాతం వరకు తగ్గవచ్చునని కెనడా ఎడ్యుకేషన్ టెక్నాలజీ కంపెనీ 'అపిల్‌బోర్డ్' తాజా నివేదిక అంచనా వేసింది. స్టడీ పర్మిట్ కోసం వచ్చిన గ్లోబల్ అప్లికేషన్ల సంఖ్యలో 39 శాతం తగ్గుదల ఉంటుందని తెలిపింది. ఈ నివేదిక ప్రకారం, గత ఏడాది 4,36,000 స్టడీ వీసాలు జారీచేయగా, ఈ ఏడాది వీటి సంఖ్య కేవలం 2,31,000కు పరిమితయ్యే అవకాశముంది.



పట్టాలపై భారీ సిమెంట్ దిమ్మెలు

అజ్మీర్ వద్ద మరో రైలు ప్రమాదానికి కుట్ర

జైపూర్, సెప్టెంబర్ 10: కాన్పూర్‌లో రైలు పట్టాలపై గ్యాస్ సిలిండర్ ఉంచి కాళిందీ ఎక్స్‌ప్రెస్‌ను పట్టాలు తప్పించేందుకు జరిగిన విద్రోహ చర్యను మరువక ముందే అలాంటి మరో ఘటన రాజస్థాన్‌లోని అజ్మీర్‌లో చోటుచేసుకుంది. ఆదివారం పులేరా నుంచి అహ్మదాబాద్ వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ ట్రైన్ శారదన స్టేషన్ సమీపంలో ట్రాక్‌పై సిమెంట్ దిమ్మెలను ఉంచారు. రైలు ఇంజన్ తాకిడికి ఒక దిమ్మె విరిగి పక్కకు పడిపోగా, మరో దిమ్మె విరిగి ముందు వైపు పడింది. రైలును పట్టాలు తప్పించడానికి విద్రోహులెవరో ఈ చర్యకు పాల్పడి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. దీనిపై పోలీస్ కేసు నమోదైంది.

కుటుంబానికి ఒక రోజు గ్యాస్ ఖర్చు రూ.5!

కేంద్ర మంత్రి హర్దీప్‌సింగ్ పురి

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి ఉజ్వల యోజన లబ్ధిదారుల కుటుంబాలకు ఒక రోజు గ్యాస్ ఖర్చు కేవలం రూ.5లే అవుతుందని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పురి పేర్కొన్నారు. మిగతా గ్యాస్ వినియోగదారుల కుటుంబాలకు సుమారుగా రూ.12 ఖర్చవుతుందని చెప్పుకొచ్చారు. డాలర్ మారకపు రేటు ఆధారంగా ఈ లెక్కింపు చేసినట్టు చెప్పారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో మంగళవారం పోస్ట్ చేశారు. ఉజ్వల పథకం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో గణనీయమైన మార్పులు వచ్చాయని తెలిపారు. ఈ పథకం కారణంగా 2014లో 14 కోట్లుగా ఉన్న ఎల్పీజీ కనెక్షన్లు 2024 నాటికి 33 కోట్లకు పెరిగాయన్నారు.

పిల్లలకు కోచింగ్ క్లాసులు

సరైన మార్గం కాదు

ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకులు నారాయణ మూర్తి

బెంగళూరు, సెప్టెంబర్ 10: కోచింగ్ క్లాసులపై ఇన్ఫోసిస్ వ్యవస్థాపకులు నారాయణమూర్తి విమర్శలు గుప్పించారు. పరీక్షల్లో పిల్లలు మెరుగ్గా రాణించేందుకు కోచింగ్ క్లాసులు సరైనమార్గం కాదని అభిప్రాయపడ్డారు. తరగతి గదిలో టీచర్లు చెప్పే పాఠాలపై శ్రద్ధ చూపని విద్యార్థులకే కోచింగ్ తరగతులు అవసరమవుతాయని పేర్కొన్నారు. పరీక్షల్లో పిల్లలు ఉత్తీర్ణులు కావడానికి కోచింగ్ క్లాసులు తప్పుడు మార్గంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. బట్టీ పట్టడం కాకుండా విమర్శనాత్మక ఆలోచన పిల్లల విద్యకు పునాదిగా ఉండాలని ఆయన అభిప్రాయపడ్డారు. బెంగళూరులో జరిగిన ఓ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన్ను.. ఐఐటీ, ఎన్ఐటీల్లో సీటు పొందాలంటే కోచింగ్ సంస్థలు కీలకం కాదా? అని ఒకరు ప్రశ్నించారు. 'కోచింగ్ క్లాసులకు వెళ్తున్న చాలా మంది విద్యార్థులు తరగతి గదిలో టీచర్ మాటల్ని వినటం లేదు. వాస్తవ ప్రపంచం విసిరే సవాళ్లను పరిష్కరించే విశ్లేషణ, పరిశీలనకు మన విద్యలో ప్రాధాన్యం కల్పించాలి' అని అన్నారు. సమస్య పరిష్కారం, విమర్శనాత్మక ఆలోచనకు 'కోచింగ్ క్లాసులు' ఆటంకంగా మారుతాయని ఆయన అన్నారు.

మళ్లీ భగ్గుమన్న మణిపూర్



సోమవారం సీఆర్‌పీఎఫ్ వాహనంపై దాడి చేస్తున్న ఆల్ మణిపూర్ స్టూడెంట్స్ యూనియన్ సభ్యులు

- రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థుల నిరసన
- డీజీపీ రాజీనామాకు డిమాండ్
- శాంతిభద్రతలు నెలకొల్పడంలో విఫలమయ్యారని ఆరోపణ
- రాజ్‌భవన్ ముట్టడికి యత్నం
- ఆందోళనకారులపై టియర్ గ్యాస్ ప్రయోగించినపోలీసులు
- ఐదు జిల్లాల్లో ఇంటర్నెట్ బంద్
- రెండు జిల్లాల్లో నిరవధిక కర్ఫ్యూ

ఇంఫాల్, సెప్టెంబర్ 10: ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో మళ్లీ కల్లోల పరిస్థితులు నెలకొన్నాయి. విద్యార్థుల నిరసనలతో రాష్ట్రం అట్టుడుకుతున్నది. రాష్ట్రంలో శాంతి భద్రతలు నెలకొల్పడంలో పూర్తిగా విఫలమైన రాష్ట్ర డీజీపీ, రక్షణ సలహాదారుడిని వెంటనే పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు పెద్ద ఎత్తున నిరసనలకు దిగారు. వేలాది మంది విద్యార్థులు, మహిళలు ఇంఫాల్‌లోని రాజ్‌భవన్ వైపు ప్రదర్శనగా వెళ్లడానికి ప్రయత్నించగా, వారిని కాంగ్రెస్ భవన్ వద్ద భద్రతా దళాలు అడ్డుకున్నాయి. దీంతో విద్యార్థులు పెద్దపెట్టున నినాదాలు చేస్తూ వారిపై రాళ్లు, గ్లాస్ మార్బుల్ బాల్స్‌తో దాడి చేయడంతో వారిని చెదరగొట్టడానికి పోలీసులు టియర్ గ్యాస్‌ను ప్రయోగించారు. ఘర్షణల్లో 40 మందికిపైగా విద్యార్థులు గాయపడ్డారు.

అదనంగా మరో 2000 మంది సీఆర్‌పీఎఫ్ బలగాలు

రాష్ట్రంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడటంతో ముందు జాగ్రత్త చర్యగా ఇంఫాల్ తూర్పు, పశ్చిమ జిల్లాల్లో నిరవధిక కర్ఫ్యూను విధించారు.ఐదు రోజుల పాటు ఐదు లోయ జిల్లాల్లో ఇంటర్నెట్‌ను నిలిపివేస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. మణిపూర్‌లో పరిస్థితులను అదుపు చేయడానికి 2,000 మందితో మరో రెండు సీఆర్‌పీఎఫ్ బెటాలియన్లను మోహరించనున్నట్టు కేంద్రం తెలిపింది. ఇందులో తెలంగాణలోని వరంగల్‌కు చెందిన 58వ నంబర్ బెటాలియన్‌ను, జార్ఖండ్‌లోని 112 నంబర్ బెటాలియన్‌ను తరలించనున్నట్టు మంగళవారం అధికారులు తెలిపారు.

ఢిల్లీలో రాష్ట్రపతి పాలన?



- బీజేపీ ఎమ్మెల్యేల ప్రతిపాదన
- హోం శాఖకు పంపిన రాష్ట్రపతి
- కమలం పార్టీ కనుసన్నల్లో ముర్ము
- తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన ఆప్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10: ఢిల్లీలో రాష్ట్రపతి పాలన విధింపుపై ఊహాగానాలు ఊపందుకున్నాయి. మద్యం పాలసీ కేసులో గత కొన్ని నెలలుగా ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ జైలులో ఉన్న నేపథ్యంలో రాష్ట్రంలో రాజ్యాంగ సంక్షోభం నెలకొన్నదని, రాష్ట్రపతి పాలన విధించాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు బీజేపీ ఎమ్మెల్యేలు వినతి పత్రం సమర్పించడం, దానిని ఆమె కేంద్ర హోం మంత్రిత్వ శాఖ పరిశీలనకు పంపడంతో ఈ ఊహాగానాలు మరింత అధికమయ్యాయి. 'ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ గత కొన్ని నెలలుగా జైలులో ఉండటంతో అభివృద్ధి కుంటుపడింది. పలు ముఖ్యమైన నిర్ణయాలు తీసుకునే వ్యక్తి జైలులో ఉండటం, సీఎం బాధ్యతలు ఎవరికీ అప్పగించకపోవడంతో ఇక్కడ రాజ్యాంగ సంక్షోభం నెలకొంది' అంటూ బీజేపీ ఆరోపించింది. ఈ పరిస్థితుల్లో ఢిల్లీలో రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేసింది. కాగా, బీజేపీ ఆరోపణలపై అధికార ఆమ్ ఆద్మీ పార్టీ తీవ్రంగా మండిపడుతున్నది. కమలం పార్టీ కనుసన్నల్లో రాష్ట్రపతి పనిచేస్తున్నారని ఆరోపించింది.

ఆప్ ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు కేంద్రం కుట్ర

ఢిల్లీలో రాష్ట్రపతి పాలన విధించడం ద్వారా కేంద్రంలోని బీజేపీ, కేజ్రీవాల్ ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు దొడ్డిదారిన కుట్ర పన్నుతున్నదని ఢిల్లీ మంత్రి, ఆప్ సీనియర్ నేత ఆతిశీ మంగళవారం ఆరోపించారు. ఒక వేళ కేజ్రీవాల్ ప్రభుత్వాన్ని మోదీ ప్రభుత్వం పడగొడితే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ మొత్తం 70 సీట్లను గెల్చుకుంటుందని, ఢిల్లీ ప్రజలు బీజేపీకి సున్నా సీట్లతో బుద్ధి చెబుతారని అన్నారు. మహారాష్ట్ర, కర్ణాటక, మణిపూర్ రాష్ట్రాల్లో చేసిన విధంగా ఆపరేషన్ లోటస్ ద్వారా విపక్ష రాష్ట్రాలను అధికారంలోంచి దించేయడమే బీజేపీ పని అని ఆతిశీ విమర్శించారు. అయితే ఇదే మంత్రాన్ని బీజేపీ ఢిల్లీలో ఆప్ ఎమ్మెల్యేలను తస్కరించడానికి ప్రయోగించి విఫలయ్యిందని ఆమె అన్నారు.

కాలుష్యం ఆధారంగా వాహనాల స్క్రాప్!


కొత్త పాలసీపై కేంద్రం కసరత్తు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10: కాలం చెల్లిన వాహనాల్ని తుక్కుగా(స్క్రాపేజ్) మార్చేయటంపై కేంద్రం కొత్త పాలసీని సిద్ధం చేస్తున్నట్టు తెలిసింది. వాహనాల వయసు ఆధారంగా కాకుండా, వాటి నుంచి వెలువడే కాలుష్యం ఆధారంగా తుక్కుగా మార్చాలన్నది కొత్త పాలసీలో కీలక అంశం.న్యూఢిల్లీలో ఏర్పాటుచేసిన ఓ సదస్సులో కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ కార్యదర్శి అనురాగ్ జైన్ మాట్లాడుతూ, '15 సంవత్సరాలు నిండినా కాలుష్యం ఆధారంగా పాలసీ ఉండాలని భావిస్తున్నాం' అని చెప్పారు.



దుబాయ్ యువరాణి 'డివోర్స్' పర్‌ఫ్యూమ్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10: 'ఇన్‌స్టాగ్రామ్' ద్వారా భర్తకు విడాకులు పంపి సంచలనం సృష్టించిన దుబాయ్ యువరాణి షేక్ మెహ్రా అల్ మక్తోమ్ తాజాగా మరో ఆసక్తికర ప్రకటన చేశారు. 'డివోర్స్' పేరుతో సరికొత్త పర్‌ఫ్యూమ్‌ను మార్కెట్లోకి తీసుకొస్తున్నట్టు ప్రకటించారు. 'ఇన్‌స్టాగ్రామ్'లో తన కొత్త ప్రొడక్ట్ టీజర్‌ను ఆమె విడుదల చేశారు. విరిగిన గాజు, నల్ల చిరుతను ఆ వీడియోలో చూపెట్టడం సర్వత్రా చర్చనీయాంశమైంది. 30 ఏండ్ల షేక్ మహ్రా 2023 మేలో దుబాయ్‌కు చెందిన ప్రముఖ వ్యాపారవేత్తను వివాహం చేసుకున్నారు. కొద్ది నెలల క్రితమే వారికి ఒక పాప జన్మించింది. ఇతర మహిళలతో సన్నిహితంగా ఉన్నాడంటూ తన భర్తకు జూలైలో ఇన్‌స్టా ద్వారా ఆమె విడాకులు పంపింది.



తలపై సీసీటీవీ కెమెరా బిగింపు!

న్యూఢిల్లీ: అమ్మాయిలపై ఇటీవల జరుగుతున్న అఘాయిత్యాలు అందరినీ కలవరపెడుతున్నాయి. ఈ నేపథ్యంలో సోషల్ మీడియాలో తాజాగా వైరల్ అవుతున్న వీడియో అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తున్నది. అందులో ఓ యువతి తలపై సీసీటీవీ కెమెరా బిగించి ఉంది. పాకిస్థాన్‌లోని కరాచీకి చెందిన ఆ యువతి తలపై స్వయంగా తండ్రే ఈ కెమెరాను అమర్చాడట. తద్వారా ఆమెను నిరంతరం పర్యవేక్షించే వీలుంటుందని అతని భావన. తన తండ్రి ఏం చేసినా తన మంచికోసమేనని ఆమె సమర్థించుకున్నది. కరాచీలో ఇటీవల సంచలనం సృష్టించిన హిట్ అండ్ రన్ కేసు కారణంగానే తన తండ్రి ఈ నిర్ణయం తీసుకున్నారని, తనకేదైనా జరిగినా సాక్ష్యం అయినా ఉంటుందని వివరించింది.




అత్యుత్తమ దేశంగా స్విట్జర్లాండ్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10: యూఎస్ న్యూస్ & వరల్డ్ రిపోర్ట్ వెలువరించిన 'ఉత్తమ దేశాల ర్యాంకింగ్స్ 2024'లో స్విట్జర్లాండ్ వరుసగా మూడో ఏడాది అత్యుత్తమ దేశంగా నిలిచింది. భారత్ మాత్రం 3 స్థానాలు దిగజారి 33వ స్థానంలో నిలిచింది. ప్రపంచ వ్యాప్తంగా 89 దేశాల్లో నిర్వహించిన సర్వేలో సాహసం, క్రియాశీలత, వారసత్వం, వ్యాపార నిర్వహణ & అభివృద్ధి సామర్థ్యం, జీవన నాణ్యత, సంస్కృతి, సంప్రదాయాలు తదితర 10 అంశాల్లో ఉప ర్యాంకింగ్స్ తీసుకున్నారు. ఈ 10 అంశాల పరిశీలనకు 73 గుణాలను పరిగణనలోనికి తీసుకున్నారు. జీవన నాణ్యత, విస్తృత వాణిజ్య అవకాశాల్లో చక్కని పనితీరుతో స్విట్జర్లాండ్ ప్రథమ స్థానంలో నిలిచింది.

లింక్డిన్ ఎంబీఏ ర్యాంకింగ్స్.. ఐఐఎఫ్‌టీకి టాప్ ర్యాంక్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10: కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని 'ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్' (ఐఐఎఫ్‌టీ) ప్రపంచస్థాయి బెస్ట్ బిజినెస్ స్కూల్‌లో చోటు దక్కించుకుంది. ఈ ఏడాది లింక్డిన్ టాప్-100 ఎంబీఏ ప్రోగామ్స్ నెట్‌వర్కింగ్ క్యాటగిరీలో ప్రపంచంలోనే ఐఐఎఫ్‌టీ టాప్‌లో నిలిచింది. టాప్-100 ఎంబీఏ ప్రోగ్రామ్స్‌లో 51వ ర్యాంక్‌ను సాధించింది. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఈమేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. గ్లోబల్ ర్యాంకింగ్స్‌లో ఐఐఎఫ్‌టీ టాప్‌లో నిలవటంపై కేంద్ర మంత్రి పియూష్ గోయల్ హర్షం వ్యక్తం చేశారు. అకడమిక్స్, రిసెర్చ్‌లో సంస్థ నిరంతర ప్రయత్నాలకు తాజా ఫలితమే నిదర్శనమని ఐఐఎఫ్‌టీ వీసీ రాకేశ్ మోహన్ చెప్పారు.



కార్బన్ డయాక్సైడ్ నుంచి ఇంధనం!


వాషింగ్టన్, సెప్టెంబర్ 10: సూర్యకాంతిని ఉపయోగించుకొని మొక్కలు..కార్బన్ డయాక్సైడ్, నీటిని ఆహారంగా మార్చినట్టు.. విస్తారమైన సౌరశక్తి నుంచి ఇంధనాన్ని తయారుచేయటంలో అమెరికా సైంటిస్టులు సరికొత్త ప్రక్రియను కనుగొన్నారు. కార్బన్ డయాక్సైడ్‌ను ఇంధనంగా మార్చటంలో అమెరికాలోని 'సెంటర్ ఫర్ హైబ్రిడ్ అప్రోచెస్ ఇన్ సోలార్ ఎనెర్జీ' (చేజ్) సెంటర్ పరిశోధకుల ప్రయోగాలు సక్సెస్ అయ్యాయి. సిలికాన్ ఫొటో ఎలక్ట్రోడ్స్‌పై కాంతిని ప్రసరింపజేయగా, నీటి సమక్షంలో కార్బన్ డయాక్సైడ్ నుంచి మిథనాల్‌ను ఉత్పత్తి చేసినట్టు శాస్త్రవేత్తలు వెల్లడించారు. దీనిని సైంటిస్టులు ద్రవరూపంలోని సౌర ఇంధనంగా పేర్కొన్నారు.

ట్రంప్ వర్సెస్ కమల నేడే తొలి డిబేట్

న్యూయార్క్: అమెరికా అధ్యక్ష ఎన్నికల పోరులో కీలక అధ్యాయానికి రంగం సిద్ధమైంది. రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్, డెమొక్రటిక్ అభ్యర్థి కమలా హారిస్ మొదటిసారి ముఖాముఖి చర్చలో పాల్గొననున్నారు. భారత కాలమానం ప్రకారం బుధవారం ఉదయం 6:30 గంటలకు ఫిలడెల్ఫియా వేదికగా వీరి చర్చా కార్యక్రమం జరుగుతుంది. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో అభ్యర్థుల చర్చా కార్యక్రమాలకు చాలా ప్రాధాన్యం ఉంటుంది. అభ్యర్థులు వారు విజయం సాధిస్తే దేశానికి సంబంధించి ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారో ఈ చర్చల్లోనే వెల్లడిస్తారు.

నటేశ్వరశర్మ కన్నుమూత

- సాహితీ లోకానికి అయాచితం సేవలు ఎనలేనివి
- తెలుగు, సంస్కృతంలో 60కి పైగా గ్రంథాలు రచించిన విశిష్ట కవి
- నిరుడు దాశరథి అవార్డుతో సత్కరించిన కేసీఆర్ సర్కార్
- నేడు బోయినపల్లి శ్మశానవాటికలో అంత్యక్రియలు



బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గత సంవత్సరం ప్రతిష్ఠాత్మక దాశరథి పురస్కారంతో డాక్టర్ అయాచితం నటేశ్వరశర్మను సత్కరిస్తున్న అప్పటి మంత్రి శ్రీనివాస్‌గౌడ్

హైదరాబాద్, సెప్టెంబర్ 10(నమస్తే తెలంగాణ)/కామారెడ్డి/సుభాష్‌నగర్: సంస్కృతాంధ్ర విద్వత్కవి, అష్టావధాని, తెలంగాణ ప్రభుత్వ దాశరథి అవార్డు గ్రహీత డాక్టర్ అయాచితం నటేశ్వరశర్మ(68) మంగళవారం కన్నుమూశారు. ఆరు నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్న శర్మ హైదరాబాద్ బోయిన్‌పల్లిలోని తన స్వగృహంలో అంతిమ శ్వాసవిడిచారు. ఆయన తెలుగు, సంస్కృతంలో 60కి పైగా గ్రంథాలను రచించారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో కవిగా తన గొంతు విప్పారు. ఆయన సాహితీ సేవలను గుర్తించిన కేసీఆర్ ప్రభుత్వం.. 2023లో దాశరథి అవార్డుతో సత్కరించింది. డాక్టర్ అయాచితం నటేశ్వరశర్మ 1956 జూలై 17న కామారెడ్డి జిల్లా రథాల రామారెడ్డిలో జయలక్ష్మీదేవి, ఆనందరాజశర్మ దంపతులకు జన్మించారు. ఆయనకు భార్య, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. నటేశ్వరశర్మ 1969లో విద్యాభ్యాసం చేస్తున్న రోజుల్లోనే సంస్కృతంలో, తెలుగులో పద్య, గేయ రచనలు చేయడం ప్రారంభించారు. 1970లో కంచి కామకోటి పీఠాధిపతి జయేంద్ర సరస్వతి స్వామి తిరుమల శ్రీవేంకటేశ్వర వేద సంస్కృత పాఠశాలను సందర్శించిన సమయంలో విద్యార్థిగా ఉన్న శర్మ.. సంస్కృత శ్లోకాలతో స్వాగతం పలకడం విశేషం. తర్వాత శర్మ తన పాండిత్య ప్రతిభతో అంచెలంచెలుగా ఎదిగారు. ఉభయ రాష్ట్రాలకు సంబంధించి ఎన్నో పురస్కారాలను అందుకున్నారు.

ప్రాచ్యభాషా పీఠాధిపతిగా సేవలు

కామారెడ్డిలోని ప్రాచ్య విద్యాపరిషత్తు ప్రాచ్య కళాశాలలో 1977 నుంచి సంస్కృత విభాగాచార్యులుగా, అనంతరం ప్రధానాచార్యులుగా పనిచేసి 2014 జూలైలో పదవీ విరమణ చేశారు. 2011 నుంచి 2013 వరకు ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని ప్రాచ్య భాషా విభాగానికి పీఠాధిపతి (డీన్)గా సేవలు అందించారు. ఆయన సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు వివిధ పత్రికల్లో ప్రచురితమయ్యాయి. అంతర్యామి శీర్షికతో చేసిన రచనలు పాఠకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. రామప్ప దేవాలయ శిల్పకళా వైభవాన్ని చాటి చెప్తూ ఆయన రచించిన సంస్కృత సంగీత రూపకం 'నాగిని' ఇటీవల హైదరాబాద్ ఆకాశవాణిలో ప్రసారమైంది. విద్యార్థి దశలో రాసిన వచన కవితా సంపుటి 'విక్రాంతిగీతి' మహాకవి దాశరథి ప్రశంసలు అందుకున్నది. అవధాని శశాంక, శతావధాని సమ్మన్నగారి లక్ష్మీనరసింహశర్మ అవధానాలతో స్ఫూర్తి పొందిన శర్మ.. డాక్టర్ రంగనాథ వాచస్పతితో కలిసి జంట అవధానాలు చేశారు. నటేశ్వరశర్మ తొలి గేయసంపుటి 'వసంతకుమారి'(1981). ఖండకావ్యాలలో సమయవిలాసిని, పంచశరీయం, సౌదామినీ విలాసం, చుక్కలు, చైత్రరథం, ఆటవెలది, జీవనయానం విశిష్ట రచనలుగా పేరొందాయి. వ్యవహారిక భాషలో రాసిన 'కవితాశతకం'.. మహాకవి శ్రీశ్రీ రచన 'సిరిసిరిమువ్వ' శతకాన్ని తలపిస్తుంది. ఆయన విశిష్ట సాహిత్య సేవలను గుర్తించిన 'భక్తిసాధనమ్' ఆధ్యాత్మిక సంస్థ గజారోహణ పురస్కారంతో సత్కరించింది.

సత్కారాలు.. పురస్కారాలు

రంజని-విశ్వనాథ పద్యకవితా పురస్కారం-2009, కిన్నెర ఆర్ట్ థియేటర్ వారి వచన కవితా పురస్కారం-2010, కిన్నెర-కుందుర్తి వచన కవితా పురస్కారం-2011, రాష్ట్ర కవి ఔగేటి ధార్మిక సాహితీ పురస్కా రం-2012, తెలుగు విశ్వవిద్యాలయం నుం చి అవధాన కీరి ్తపురస్కారం-2012, సర్వవైదిక సంస్థానం విశిష్ట కవి పురస్కారం-201 3, తెలంగాణ పద్య సాహిత్య పురస్కారం-2013, శాతవాహన విశ్వవిద్యాలయం నుంచి ఉత్తమ పద్యకవి పురస్కారం-2014, తేజ ఆర్ట్ క్రియేషన్స్ నుంచి విశిష్ట కవి పురస్కా రం-2014, విశ్వసాహితి విశిష్ట సాహిత్య పురస్కారం-2014, భక్తి టీవీ ఆధ్యాత్మిక సే వా పురస్కారం-2014, తెలుగు విశ్వవిద్యాలయం నుంచి అవధాన ప్రతిభా పురస్కా రం-2015, ఇందూరు అపురూప సాహితీ పురస్కారం-2016, వర్గల్ సరస్వతీ క్షేత్రం వారి 'అవధాన భారతి' పురస్కారం-2020, మల్లినాథసూరి కళాపీఠం వారి 'మహోపాధ్యాయ' పురస్కారం-2021, డీవీఎల్ఎన్ శాస్త్రి స్మారక సాహితీ పురస్కారం-2021, కోటంరాజు స్మారక సాహితీ పురస్కారం-2021 వంటి ఎన్నో పురస్కారాలను నటేశ్వరశర్మ అందుకున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గత సంవత్సరం ప్రతిష్ఠాత్మక దాశరథి పురస్కారంతో సత్కరించింది. అయాచితం మృతి తెలంగాణ సాహితీ లోకానికి తీరని లోటని పలువురు కవులు, ఆయా రంగాలకు చెందిన ప్రముఖులు, మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ తదితరులు నివాళులు అర్పించారు. బోయిన్‌పల్లిలోని శ్మశానవాటికలో బుధవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

వందకుపైగా అష్టావధానాలు



నటేశ్వరశర్మ రచించిన అభిజ్ఞాన శాకుంతలానికి పద్యానువాద ప్రబంధం 'శకుంతల'కు తెలుగు విశ్వవిద్యాలయం నుంచి ఉత్తమ కావ్య పురస్కారం లభించింది. దేశభక్తి కవితా సంపుటి 'భారతీ ప్రశస్తి'కి జాతీయ సాహిత్య పరిషత్తు పురస్కారం లభించింది. రుతువుల సోయగాలను వర్ణిస్తూ రచించిన 'రుతుగీత'కు ఉత్తమ కావ్య పురస్కారం వరించింది. తెలంగాణ రాష్ట్ర వైభవాన్ని ప్రస్తుతిస్తూ సంస్కృతంలో రాసిన 'తెలంగాణ సుప్రభాతం'.. 'తెలంగాణ' మాసపత్రికలో ధారావాహికంగా ప్రచురితమై పాఠకులను ఆకట్టుకున్నది. రాష్ట్రావిర్భావం తర్వాత 33 జిల్లాల ప్రత్యేకతలను తెలుపుతూ రాసిన పద్యాలు ఈ నేల విశిష్టతను చాటాయి. సంస్కృతాంధ్ర భాషల్లో శర్మ నూటికిపైగా అష్టావధానాలు చేశారు. అవధాన ప్రతిభకు తెలుగు విశ్వవిద్యాలయ ప్రతిభా పురస్కారం లభించింది. ఆదిశంకరాచార్యులు రచించిన 'సౌందర్య లహరి'పై పరిశోధనలకుగాను 1994లో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పట్టా, స్వర్ణపతకం అందుకున్నారు. ఆముక్తమాల్యదపై ఆయన విమర్శనా గ్రంథం ప్రామాణికమైనది.

ఆర్టీసీపై రుణభారాన్ని తగ్గించాలి

- టీజీఎస్‌ఆర్టీసీ సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ): టీజీఎస్‌ఆర్టీసీపై క్రమంగా రుణభారాన్ని తగ్గించాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. నూతన బస్సుల కొనుగోలుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సచివాలయంలో మంగళవారం ఆర్టీసీ అధికారులతో సీఎం సమీక్ష సమావేశం నిర్వహించారు. మహాలక్ష్మి పథకం ద్వారా 83.42 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించారని, మహిళా ప్రయాణికులకు రూ.2,840.71 కోట్లు ఆదా అయ్యాయని మంత్రి పొన్నం ప్రభాకర్ వివరించారు. అనంతరం వివిధ బ్యాంకులు, ఉద్యోగుల భవిష్య నిధి ఖాతా నుంచి వాడుకున్న నిధులు, విశ్రాంత ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు కలిపి రూ.6,322 కోట్ల రుణాలు ఉన్నట్టు అధికారులు సీఎంకు వివరించారు. సమీక్షలో సీఎస్ శాంతికుమారి, సీఎం కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, షానవాజ్ ఖాసీం, రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్, ఆర్టీసీ ఎండీ సజ్జనార్ పాల్గొన్నారు.

'వెల్ఫేర్ కమిటీలు వద్దు'

హైదరాబాద్, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ): ఆర్టీసీలో వెల్ఫేర్ కమిటీలను నియమించవద్దని, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ప్రకటించినట్టు ఆర్టీసీని ఆదుకునే కార్యక్రమాలను చేపట్టాలని ఎన్ఎంయూరాష్ట్ర అధ్యక్షుడు పీ కమాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మర్రి నరేందర్ డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న గొంగిడి సునీత, చిత్రంలో పైళ్ల శేఖర్‌రెడ్డి

ఐఐహెచ్‌టీని తరలిస్తే ఊరుకోం

- భూదాన్ పోచంపల్లిలోనే ఏర్పాటు చేయాలి
- బీఆర్ఎస్ హయాంలోనే కేంద్రానికి ప్రతిపాదనలు
- మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీత, పైళ్ల శేఖర్‌రెడ్డి ఫైర్

యాదాద్రి భువనగిరి, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ): యాదాద్రి భువనగిరి జిల్లా నుంచి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ (ఐఐహెచ్‌టీ)ని తరలిస్తే ఊరుకునే ప్రసక్తే లేదని మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీతామహేందర్ రెడ్డి, పైళ్ల శేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం వారు భువనగిరిలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలోనే పోచంపల్లిలో ఐఐహెచ్‌టీ మంజూరు కోసం కేంద్రానికి ప్రతిపాదనలు పంపించినట్టు చెప్పారు. మాజీ మంత్రి కేటీఆర్ అనేకసార్లు కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్లి.. పట్టుబట్టి ఐఐహెచ్‌టీ మంజూరు చేయించేందుకు ఎంతో కృషి చేశారని తెలిపారు. ఇప్పుడు రేవంత్‌రెడ్డి ఓర్వలేక ఐఐహెచ్‌టీని రంగారెడ్డి జిల్లాకు తరలించే కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. మాజీ సీఎం కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి ఆనవాళ్లు లేకుండా చేస్తానని గతంలోనే రేవంత్‌రెడ్డి అన్నారని, ఆ మేరకే ఐఐహెచ్‌టీని తరలించే కుట్ర చేస్తున్నారని విమర్శించారు. పోచంపల్లి మండలంలోని కనుముక్కలలో ఏర్పాటు చేయాలని జీవోలో స్పష్టంగా ఉన్నా ఉద్దేశపూర్వకంగా తీసుకెళ్లడం ఏంటని ప్రశ్నించారు. కనుముక్కలలో హ్యాండ్లూమ్ పార్కును వేలంలో కొనుగోలు చేశామని, గతేడాది మాజీ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యేలు సైతం అక్కడ పర్యటించిన విషయాన్ని వారు గుర్తుచేశారు. ఐఐహెచ్‌టీఎం తరలింపును మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ఎందుకు అడ్డుకోలేక పోతున్నారని ప్రశ్నించారు. స్కిల్ యూనివర్సిటీని కూడా పోచంపల్లిలోని రామానంద తీర్థ ఇన్‌స్టిట్యూట్‌లో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వానికి ప్రజారోగ్యం పట్టదా?

- జ్వరాలతో అల్లాడుతున్నా నిర్లక్ష్యమెందుకు?
- గ్రామాల్లో పారిశుద్ధ్యంపై సర్కారు దృష్టిపెట్టాలి
- మాజీ మంత్రి కొప్పుల ఫైర్



మాట్లాడుతున్న కొప్పుల ఈశ్వర్

వెల్గటూర్, సెప్టెంబర్ 10: 'ఎన్నో మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పాలనను పూర్తిగా గాలికొదిలేసింది. ఫలితంగా పల్లె, పట్టణాల్లో పారిశుద్ధ్యం లోపించి ప్రజలు విష జ్వరాలతో అల్లాడిపోతున్నారు. దవాఖానల్లో వసతులు, మందులు లేక ఇబ్బందులు పడుతున్నారు. అయినా.. ప్రభుత్వానికి ప్రజారోగ్యంపై కనీస పట్టింపులేకుండా పో యింది' అని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మండిపడ్డారు. జగిత్యాల జిల్లా వెల్గటూర్, ఎండపల్లి మండలాల్లో విష జ్వరాలతో మృతిచెందిన వారి కుటుంబాలను మంగళవారం పరామర్శించారు. వెల్గటూర్‌లో కొప్పుల మీడియా సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కాంగ్రెస్ నాయకులు కాలం గడుపుతున్నారని, ఫలితంగా గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించి డెంగ్యూ, చికున్‌గున్యా లాంటి విష జ్వరాలు ప్రబలుతున్నాయని మండిపడ్డారు. గత ఏడెనిమిదేండ్లలో ఒక్క డెంగ్యూ కేసైనా నమోదైందా? ప్రజలు ఆలోచించాలని సూచించారు. ప్రజలు జ్వరాలతో అల్లాడుతున్నారని, ప్రభుత్వ దవాఖానలకు వెళితే వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారని, అయినా.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కనీస పట్టింపులేకుండా పోయిందని, ఆయన ప్రతిపక్షాలను తిట్టడమే పనిగా పెట్టుకున్నారని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఎమ్మెల్యేలు, మంత్రులు అయితే నియోజకవర్గాల్లో సొంత పనులు చేసుకుంటున్నారని, ప్రజారోగ్యాన్ని గాలికొదిలేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇప్పటికైనా వైద్యులు, అధికారులతో రివ్యూ సమావేశాలు ఏర్పాటు చేసి గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరిచి, మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.



చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శిస్తున్న సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా

గురుకులానికి ఫీవర్.. మూడు రోజులు సెలవులు

- సిర్పూర్-టీ స్కూల్‌లో 30 మందికిపైగా విష జ్వరాలు
- విద్యార్థులను పరామర్శించిన సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా

సిర్పూర్(టీ), సెప్టెంబర్ 10: కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టీ)లోని సాంఘిక సంక్షేమ గురుకుల (బాలుర) పాఠశాల-కళాశాల జ్వరాలతో మంచం పట్టింది. దీంతో అధికారులు మూడు రోజుల పాటు సెలవులు ప్రకటించి పిల్లలను ఇండ్లకు పంపిస్తున్నారు. ఇక్కడ 450 మంది విద్యార్థులు చదువుతున్నారు. నాలుగు రోజుల క్రితం 30 మందికి పైగా జ్వరాల బారిన పడ్డారు. విడతల వారీగా పిల్లలను సిర్పూర్(టీ) సామాజిక దవాఖానకు తరలించినట్టు తెలుస్తున్నది. దవాఖానలో సరిపడా బెడ్లు లేక గురుకుల పాఠశాల నుంచి తెప్పించి మరీ వాటిపైనే విద్యార్థులకు చికిత్స అందించారు. మంగళవారం నాటికి 100 మందికి జ్వరాలు వచ్చినట్టు గుర్తించిన అధికారులు మూడు రోజుల పాటు సెలవులు ప్రకటించి విద్యార్థులను ఇండ్లకు పంపించారు. సిర్పూర్(టీ) సామాజిక దవాఖానలో చికిత్స పొందుతున్న 10 మంది (మంగళవారం ఉదయం వరకు) విద్యార్థులను కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా మంగళవారం పరామర్శించారు.



శ్వేత పార్థివదేహం వద్ద రోదిస్తున్న లక్ష్మారెడ్డిని ఓదార్చుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, చిత్రంలో మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, గంగుల కమలాకర్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

అశ్రునయనాల మధ్య శ్వేతారెడ్డి అంత్యక్రియలు

- మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకుల హాజరు
- లక్ష్మారెడ్డికి మంత్రి జూపల్లి కృష్ణారావు ఓదార్పు

తిమ్మాజిపేట, సెప్టెంబర్ 10: మాజీ మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డి సతీమణి శ్వేతారెడ్డి అంత్యక్రియలు మంగళవారం సాయంత్రం 4 గంటలకు ఆయన సొంతూరు నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలం ఆవంచలో అశ్రునయనాల మధ్య జరిగాయి. శ్వేతారెడ్డి సోమవారం రాత్రి చెన్నైలో మరణించగా.. మంగళవారం ఉదయం 11 గంటలకు ఆమె భౌతికకాయాన్ని సొంతూరుకు తీసుకొచ్చారు. దీంతో వారి కుటుంబసభ్యులు, బంధువులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు కన్నీటి పర్యంతమయ్యారు. ఆమె పార్థివదేహాన్ని చూసి లక్ష్మారెడ్డి బోరున విలపించారు. గ్రామ శివారులోని వారి వ్యవసాయ క్షేత్రంలో నిర్వహించిన అంత్యక్రియలకు పలువురు రాజకీయ నాయకులు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు.

లక్ష్మారెడ్డికి పలువురి పరామర్శ

లక్ష్మారెడ్డి సతీమణి శ్వేత మృతి చెందిన విషయం తెలుసుకొన్న మాజీ మంత్రులు హరీశ్‌రావు, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, గంగుల కమలాకర్, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, ఎమ్మెల్సీలు చల్లా వెంకట్రామిరెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డి, ఎంపీలు ఈటల రాజేందర్, డీకే అరుణ, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, శ్రీహరి, శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, జైపాల్‌యాదవ్, ఎర్ర శేఖర్, అంజయ్య యాదవ్, నరేందర్‌రెడ్డి, పెద్ది సుదర్శన్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నేతలు కర్నె ప్రభాకర్, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, ఎర్రోళ్ల శ్రీనివాస్, మర్రి సతీమణి జమున, బీఆర్ఎస్ నాయకులు శ్వేత పార్థివదేహానికి నివాళులర్పించి లక్ష్మారెడ్డికి ధైర్యం చెప్పారు. అలాగే ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు లక్ష్మారెడ్డి, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి కూడా లక్ష్మారెడ్డిని ఓదార్చారు.

కేసీఆర్ సంతాపం

హైదరాబాద్, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ) : మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత, జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే డాక్టర్ చర్లకోల లక్ష్మారెడ్డి సతీమణి శ్వేతా లక్ష్మారెడ్డి మరణంపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సంతాపం ప్రకటించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

మృతి తీవ్రంగా బాధించింది: కేటీఆర్

శ్వేతాలక్ష్మారెడ్డి మరణవార్త తీవ్రంగా బాధించిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. ఈ కష్ట సమయంలో వారి కుటుంబానికి ధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని చెప్పారు.

సోలార్ గ్రామంగా కొండారెడ్డిపల్లి

హైదరాబాద్, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి సొంత గ్రామం కొండారెడ్డిపల్లిని పూర్తిస్థాయి సోలార్ గ్రామంగా తీర్చిదిద్దే ప్రక్రియ మొదలైంది. సీఎం ఆదేశాల మేరకు మాడల్ సోలార్ విలేజ్‌గా మార్చనున్నారు. టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫారూఖీ, నాగర్‌కర్నూల్ కలెక్టర్ బీ సంతోష్, రెడ్‌కో వీసీ అండ్ ఎండీ అనిల, డైరెక్టర్ కే రాములు, ఇతర ముఖ్యశాఖల అధికారులు క్షేత్రస్థాయిలో మంగళవారం పర్యటించారు. గ్రామంలో మొత్తం 1,451 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి.

చాక్‌పీసులు, డస్టర్లు కొనేందుకు డబ్బులేవి?

- నాలుగు నెలలైనా రూపాయి విదిల్చని విద్యాశాఖ
- ఇంకా విడుదల కాని స్కూల్ గ్రాంట్ నిధులు
- టీచర్లే జేబు నుంచి ఖర్చుచేయాల్సిన పరిస్థితి
- మరోవైపు గ్రాంట్‌కు కోతలు పెట్టే ప్రతిపాదనలు



హైదరాబాద్, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ): కాంపొజిట్ స్కూల్ గ్రాంట్. పాఠశాలల్లో చాక్‌పీసులు, డస్టర్లు కొనాలన్నా.. ఇంటర్నెట్, విద్యుత్తు బిల్లులు చెల్లించాలన్నా .. పంద్రాగస్టుకో, జనవరి 26కో స్వీట్లు పంపిణీ చేయాలన్నా ఈ నిధులే ఆధారం. ఇలాంటి స్కూల్ గ్రాంట్ నిధులు ఇంతవరకు మంజూరు కాలేదు. విద్యాసంవత్సరం ప్రారంభమై నాలుగు నెలలు గడుస్తున్నా సర్కారు ఒక్క రూపాయి విదిల్చలేదు. దీంతో టీచర్లే తలా కొంత వేసుకుని.. జేబు నుంచి ఖర్చుచేయాల్సిన పరిస్థితి నెలకొన్నది. దీంతో టీచర్లంతా సర్కారు తీరుపై భగ్గుమంటున్నారు. గత సర్కారు జూలైలోనే 50శాతం నిధులను విడుదల చేసింది. కానిప్పుడు ఇంకా నిధులు విడుదల కాకపోవడంతో పాఠశాల నిర్వహణ అధ్వానంగా తయారైంది. స్కూల్ గ్రాంట్ నిధుల్లో నుంచి విద్యుత్తు బిల్లులు చెల్లించేవారు. అయితే ఇటీవలే సర్కారు విద్యాసంస్థలకు ఉచిత విద్యుత్తును ప్రకటించింది. దీంతో స్కూల్ గ్రాంట్‌గా ఇచ్చే నిధుల్లో కొంతమేర కోతలు పెట్టే ప్రతిపాదనలు విద్యాశాఖ పరిశీలనలో ఉన్నాయి. ఇదే జరిగితే ఒక్కో స్కూల్‌కు రూ.3 నుంచి నాలుగు వేలు కోతపడనున్నది. ఒక్క స్కూల్ గ్రాంటే కాకుండా పారిశుద్ధ్య నిధులు, ఇతర గ్రాంట్‌లను కూడా ప్రభుత్వం విడుదల చేయడంలేదు.

- పారిశుద్ధ్య నిర్వహణకు విద్యార్థుల సంఖ్యను బట్టి స్కూల్ ఫెసిలిటీ గ్రాంట్‌గా రూ. 3వేల నుంచి 30వేల వరకు ప్రభుత్వం నిధులిస్తామన్నది. సింగరేణి సంస్థ ద్వారా రూ.136 కోట్ల డీఎంఎఫ్‌టీ ఫండ్స్‌ను కేటాయించాలని ఆయా సంస్థకు ఆదేశాలిచ్చింది. కానీ ఇంతవరకు ఈ నిధులు కలెక్టర్ల ఖాతాల్లో జమకాలేదు.
- స్పోర్ట్స్ గ్రాంట్‌గా ప్రాథమిక స్కూళ్లకు ఐదు వేలు, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు పది వేల చొప్పున ఇవ్వాల్సి ఉండగా, ఇంతవరకు విడుదల చేయలేదు.
- మండల రిసోర్స్ సెంటర్లు(ఎంఆర్‌సీ), క్లస్టర్ రిసోర్స్ సెంటర్లకు(సీఆర్‌సీ) రూ. 39వేల గ్రాంట్‌ను విడుదల చేయాల్సి ఉండగా రూపాయి విడుదల చేయలేదు.
- కేజీబీవీలు, మాడల్ స్కూళ్లలోని హాస్టళ్లకు రోజువారీ ఖర్చులకు రూ. 30వేలు అడ్వాన్స్‌డ్‌గా ఇస్తామని విద్యాశాఖ ప్రొసీడింగ్స్ ఇచ్చింది. ఇంకా 20 జిల్లాల్లోని కేజీబీవీలు, మాడల్ స్కూల్ అటాచ్డ్ హాస్టళ్లకు ఇంతవరకు అడ్వాన్స్ మొత్తం అందలేదు.

స్కూల్ గ్రాంట్ స్లాబులిలా..

విద్యార్థులు	గ్రాంట్‌గా అందించే మొత్తం
1- 30 మంది	రూ. 10 వేలు
31 -100	రూ. 25 వేలు
101 -250	రూ. 50 వేలు
251- వెయ్యి మంది	రూ. 75 వేలు
వెయ్యి మందికి పైగా	రూ. లక్ష

పారిశుద్ధ్య నిధులు విడుదల చేయండి: టీఎస్‌జీహెచ్‌ఎంఏ

పాఠశాలల్లో పారిశుద్ధ్య నిర్వహణకు కేటాయించిన నిధులను విడుదల చేయాలని తెలంగాణ గెజిటెడ్ హెడ్మాస్టర్స్ అసోసియేషన్ (టీఎస్‌జీహెచ్‌ఎంఏ) ప్రభుత్వాన్ని కోరింది. ఇప్పటి వరకు పారిశుద్ధ్య నిధులింకా విడుదలకాలేదని, తక్షణమే ఈ నిధులను అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలకు అందేలా చూడాలని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాజభాను చంద్రప్రకాశ్, ప్రధాన కార్యదర్శి రాజుగంగారెడ్డి, కోశాధికారి బీ తుకారాం ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం పాఠశాల విద్యాశాఖ అధికారులను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. నిధుల వినియోగానికి సంబంధించిన మార్గదర్శకాలను, ఎప్పటినుంచి ఈ నిధులను వినియోగించుకోవాలో స్పష్టంచేయాలని ప్రభుత్వాన్ని కోరారు.



టెట్ మార్కుల అప్‌లోడ్‌కు చాన్స్

హైదరాబాద్, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ): డీఎస్సీ ఫలితాల విడుదలకు ముందే టెట్ మార్కులను అప్‌లోడ్ చేసుకునే అవకాశాన్ని విద్యాశాఖ కల్పించనున్నది. ఇందుకు రెండు రోజులపాటు అవకాశం కల్పించాలని అధికారులు నిర్ణయించారు. డీఎస్సీ ఫైనల్ 'కీ'ని ఇప్పటికే విడుదల చేశారు. ఫైనల్ 'కీ'పైనా అభ్యర్థులు పెద్ద ఎత్తున అభ్యంతరాలు వ్యక్తంచేస్తున్నారు. ఆయా అభ్యంతరాలను రివ్యూ కమిటీ పరిశీలనకు పంపించారు. కమిటీ పరిశీలన పూర్తైన తర్వాత రివైజ్డ్ ఫైనల్ 'కీ'ని విద్యాశాఖ విడుదల చేయనుంది. ఆ తర్వాత టెట్ మార్కులను కలిపి జనరల్ ర్యాంకింగ్ లిస్ట్(జీఆర్ఎల్)ను విడుదల చేస్తారు. దీంట్లో భాగంగానే టెట్ మార్కులను మరోసారి అప్‌లోడ్ చేసుకునే అవకాశమివ్వాలని అధికారులు నిర్ణయించారు. దీనిపై ఒకటి రెండు రోజుల్లో అధికారిక ప్రకటన విడుదల కానుంది.

లెక్చరర్లు లేని కాలేజీ!

- ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గంలో దుస్థితి
- ఒక్క అధ్యాపకుడినీ నియమించని ప్రభుత్వం
- దిక్కుతోచక టీసీలు తీసుకొని వెళ్తున్న విద్యార్థులు

బొంరాస్‌పేట, సెప్టెంబర్ 10: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్‌లోని బొంరాస్‌పేట ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. బొంరాస్‌పేటకు ఇటీవల ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరైంది. ఈ విద్యా సంవత్సరం నుంచే తరగతులు ప్రారంభమవుతాయని అధికారులు ప్రకటించారు. ఈ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులతోపాటు ఎంపీహెచ్‌డబ్ల్యూ, ఎంఎల్‌టీ వంటి వృత్తి విద్యా కోర్సులను అనుమతించారు. దీంతో ఆయా కోర్సుల్లో 30 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. తీరా ప్రభుత్వం ఒక్క అధ్యాపకుడిని కూడా నియమించకపోవడంతో ఇప్పటికే పది మంది విద్యార్థులు టీసీలు తీసుకొని ఇతర కాలేజీలకు వెళ్లిపోయారు. మిగతా పేద విద్యార్థులు లెక్చరర్ల రాకకోసం ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే ఇతర కాలేజీల్లో ఇంటర్ మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభం కాగా ఈ కాలేజీలో చేరిన విద్యార్థులు దిక్కుతోచని స్థితిని ఎదుర్కొంటున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభంలోనే కాలేజీలో అధ్యాపకులను నియమించి ఉంటే విద్యార్థులు ఇంకా ఎక్కువ సంఖ్యలో చేరేవారని, సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికైనా స్పందించి బొంరాస్‌పేట జూనియర్ కళాశాలలో లెక్చరర్లను నియమించి తరగతులు ప్రారంభించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

తరగతులు ప్రారంభించాలి

స్థానికంగానే కళాశాల రావడంతో ఊర్లోనే ఉండి చదువుకోవచ్చన్న ఉద్దేశంతో సీఈసీ ఫస్ట్ ఇయర్‌లో జాయిన్ అయ్యాను. ఇప్పటివరకు లెక్చరర్లను నియమించలేదు. ప్రభుత్వం లెక్చరర్లను నియమించి తరగతులను ప్రారంభించాలి. అధ్యాపకులు ఉంటే ఇంకా చాలా మంది విద్యార్థులు జాయిన్ అవుతారు.

-గడ్డల రమేశ్, బొంరాస్‌పేట

డెంగ్యూతో వివాహిత మృతి



అనిత (ఫైల్)

గజ్వేల్, సెప్టెంబర్ 10: సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం అహ్మదీపూర్‌లో మంగళవారం డెంగ్యూతో వివాహిత మృతి చెందింది. అహ్మదీపూర్‌కు చెందిన బోయిని అనిత (34) రెండు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నది. జ్వరం తీవ్రం కావడంతో కుటుంబ సభ్యులు గజ్వేల్‌లోని ప్రైవేటు దవాఖానకు తరలించారు. అక్కడ వైద్య పరీక్షల అనంతరం వైద్యులు డెంగ్యూగా నిర్ధారించడంతో వెంటనే మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతున్న సమయంలో ఆరోగ్యం విషమించడంతో మంగళవారం మృతి చెందింది. ఆమెకు భర్త, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

మహిళా పీఈటీలకు బాలుర గురుకులాల్లో పోస్టింగ్‌లు

- మహిళా గురుకులాల్లో ఖాళీలున్నా ఇవ్వని వైనం
- బాలురకు మహిళలు శిక్షణ ఎలా ఇస్తారు?
- టీజీపీఎస్సీ ఎదుట పీఈటీ అభ్యర్థుల నిరసన
- స్పందించని టీజీపీఎస్సీ అధికారులు



హైదరాబాద్, సెప్టెంబర్ 10 (నమస్త తెలంగాణ): గురుకుల పీఈటీ పోస్టులకు ఎంపికైన మహిళలకు బాలురు గురుకులాల్లో పోస్టింగ్‌లు ఇచ్చి అడ్డదిడ్డ నిర్ణయాలు తీసుకున్నారని టీజీపీఎస్సీ అధికారులపై అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సర్వీస్ కమిషన్ చేసిన తప్పులకు తాము బలి కావాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయని వాపోతున్నారు. బాలికల గురుకులాల్లో పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ అక్కడ పురుషులకు పోస్టింగ్ ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పురుషులను బాలుర గురుకులాలకు, మహిళలను బాలికల గురుకులాల్లోని పీఈటీ పోస్టులకు ఎంపిక చేయాలన్న అంశం తెరపైకి వచ్చింది. ఈ విషయమై ప్రతిరోజు టీజీపీఎస్సీ కార్యాలయం చుట్టూ బాధిత అభ్యర్థులు ప్రదక్షిణలు చేస్తున్నారు. ఎనిమిదేండ్ల క్రితం విడుదలైన పీఈటీ పోస్టుల భర్తీకి ఎంపికైన అభ్యర్థులలో చాలా మంది ఇతర ఉద్యోగాలకు వెళ్లిపోయారు. అభ్యర్థులు లేకపోవడంతో రిలింక్విష్‌మెంట్ ఆప్షన్‌కు అవకాశం ఇచ్చి, ప్రక్రియను సైతం పూర్తి చేశారు. అయినా ఇంతవరకు పోస్టింగ్ ఆర్డర్లు సరి చేసి ఇవ్వలేదని బాధిత పీఈటీ అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. టీజీపీఎస్సీ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. అయినప్పటికీ తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ స్పందించలేదు.